PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 45 సంచిక : 70 | విజయవాడ, శుక్రవారం 10 అక్టోబర్ 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Friday 10 October 2025 | Rs



గాజాలో శాంతి దిశగా ముందడుగు!

- కాల్పుల విరమణకు లైన్ క్లియర్
- శాంతి ప్రణాళిక తొలి దశపై హమాస్, ఇజ్రాయిల్ సంతకాలు : ట్రంప్ ప్రకటన



శాంతి ప్రణాళికకు ఒప్పందం కుదిరిందని తెలియడంతో ఆనందం వ్యక్తం చేస్తున్న పాలస్తీనా చిన్నారులు

కైరో : గత రెండేళ్లుగా గాజాలో ఏకపక్షంగా కొనసాగిస్తున్న మారణకాండను ఆపేందుకు ఇజ్రాయిల్ అంగీకరించింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతిపాదించిన శాంతి ప్రణాళికలోని తొలి దశకు హమాస్, ఇజ్రాయిల్ అంగీకరించి ఒప్పందంపై గురువారం ఉదయం సంతకాలు చేశాయి. దీంతో గాజా స్ట్రిప్‌లో కాల్పుల విరమణకు మార్గం సుగమమైంది. తాజా పరిణామాన్ని ప్రధాని నరేంద్ర మోడీ సహా పలువురు ప్రపంచ నేతలు స్వాగతించారు. శాంతి ప్రణాళికకు ఇరు పక్షాల ఆమోదం కోసం ట్రంప్, మధ్యవర్తులు చేసిన ప్రయత్నాలను హమాస్ ప్రశంసించింది. పాలస్తీనియన్ల త్యాగాలు వృథా కాబోవని, తమ ప్రజలకు స్వేచ్ఛ, స్వాతంత్య్రం కల్పించేందుకు కట్టుబడి ఉన్నామని ప్రకటించింది. ఇజ్రాయిల్ కేబినెట్ ఆమోదం పొందిన తరువాతే ఒప్పందం అమలులోకి వస్తుందని ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు ప్రకటించారు. గాజాలో కాల్పుల విరమణపై ఒప్పందం కుదరాలని, బందీల విడుదల జరగాలని ఎంతో కాలంగా ఎదురు చూస్తున్నామని అంటూ, హమాస్ - ఇజ్రాయిల్ మధ్య శాంతి ఒప్పందం కుదిరిందని ట్రంప్ వైట్ హౌస్ నుంచి ప్రకటించారు. ఈ ఒప్పందాన్ని చారిత్రక ముందడుగుగా ఆయన అభివర్ణించారు. ఇజ్రాయిల్ కొనసాగిస్తున్న మారణహోమంలో గత 24 గంటల్లో పది మంది గాజా వాసులు ప్రాణాలు కోల్పోయారు. 49 మంది తీవ్రంగా గాయపడ్డారు.

ఉమ్మడి విశాఖలో భూ లూటీ

రూ. లక్షల కోట్ల విలువైన భూములు కార్పొరేట్లకు అప్పగింత

- ఒక్క అనకాపల్లిజిల్లాలోనే రూ.40 వేల కోట్ల కేటాయింపులు
- స్థానికులను తరిమేసిన అదాని గంగవరం పోర్టు
- ఉద్యోగ, ఉపాధి అవకాశాలు నామమాత్రమే



అనకాపల్లి జిల్లా పరవాడలోని ఫార్మా స్యూటికల్స్ సెజ్ (ఫైల్ ఫోటో)

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో


రాష్ట్ర ఆర్థిక రాజధానిగా గుర్తింపు పొందిన ఉమ్మడి విశాఖ జిల్లాలో పెద్ద ఎత్తున భూ లూటీ జరుగుతోంది. సెజ్‌లు, కారిడార్‌లు, ఐటి కంపెనీల పేరుతో లక్షల కోట్ల విలువైన భూమిని కార్పొరేట్లకు పాలకులు పందేరం చేస్తున్నారు. 2005 నుంచి ఈ తతంగం సాగుతోంది. విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో 135 కిలోమీటర్ల పరిధిలోగల సముద్ర తీరంలో సెజ్‌లు, ఐటి, ఫార్మా కంపెనీల పేరుతో లక్షల ఎకరాల్లో ఈ భూ పందేరం కొనసాగుతోంది. ఇంత పెద్ద ఎత్తున భూ పందేరం జరుగుతున్నా వాటి ద్వారా వచ్చిన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మాత్రం నామమాత్రమే! విశాఖ నగరం, గ్రామీణ ప్రాంత పరిసరాలు, మధురవాడ, రుషికొండల్లో రూ.6 వేల కోట్లు విలువైన సుమారు నాలుగు వేల ఎకరాలను ఐటి కోసం టిడిపి కూటమి ప్రభుత్వం వచ్చాక కేటాయింపులు చేసింది. అనకాపల్లి జిల్లాలో విశాఖ-చెన్నయ్ కారిడార్, సెజ్‌ల పేరిట లక్ష ఎకరాలకుపైగా కార్పొరేట్లకు అప్పగించాలని ప్రణాళికలు సిద్ధం చేశారు. వీటిలో గడిచిన 15 ఏళ్లుగా రూ.40 వేల కోట్ల విలువైన 50 శాతానికిపైగా భూములను కార్పొరేట్లు ఇప్పటికే స్వాధీనం చేసుకున్నారు. గాజువాక నియోజకవర్గంలో అదాని గంగవరం పోర్టు స్టీల్‌ప్లాంట్ నుంచి 1,200 ఎకరాలు, రాష్ట్ర ప్రభుత్వం నుంచి 1,800 ఎకరాలు తీసుకుని స్థానిక మత్స్యకారులకు ఉపాధి చూపకుండా నిర్వాసితులను చేసి 1,700 మంది బయట కార్మికులతో పోర్టును నిర్వహిస్తోంది.

ఐటి పేరుతో కారుచౌకగా కట్టబెట్టిన వైనం

విశాఖ రుషికొండపై తాజాగా టిడిపి కూటమి ప్రభుత్వం 21.16 ఎరాలను టిసిఎస్‌కు ఎకరా 99 పైసలకు (ఈ భూముల వాస్తవ విలువ రూ.900 కోట్లు) ఇచ్చేసింది. 12 వేల ఉద్యోగాలు టిసిఎస్ ఇవ్వనున్నట్లు ప్రభుత్వం చెబుతోంది. వాస్తవానికి ఈ కంపెనీ ముంబయిలో ఇటీవల 12 వేల మందిని తొలగించేసింది. అమెరికన్ కంపెనీ కాగ్నిజెంట్‌కు 22.19 ఎకరాలను ఎకరా 99 పైసలకే (వాస్తవంగా వీటి విలువ రూ.950 కోట్లు) ధారాదత్తం చేసింది. ఎనిమిది వేల ఉద్యోగాలు వస్తాయని చెబుతోంది. ఈ కంపెనీ భారతదేశంలో 10,700 మందిని ఇప్పటికే తొలగించింది. రుషికొండ-మధురవాడ కొండపై ఎఎన్ఎస్ఆర్ ఐటికి రూ.500 కోట్లు విలువైన 10.29 ఎకరాలను ఎకరా ఒక్కింటికి 99 పైసలకే చంద్రబాబు ప్రభుత్వం ఇచ్చేసింది. పది వేల ఉద్యోగాలు ఇస్తారని మిగతా 7లో

ప్రాంతం	భూ కేటాయింపులు	విలువ
విశాఖ జిల్లా (ఐటి)	4,000 ఎకరాలు	రూ.6 వేల కోట్లు
అనకాపల్లి జిల్లా (సెజ్)	5,3000 ఎకరాలు	రూ.40 వేల కోట్లు
ఐటి సంస్థలు	**ప్రస్తుత ఉద్యోగులు**	**ఇస్తానని చెప్పినవి**
డబ్ల్యుఎన్ఎస్	5000	9,000
పాత్రా	3000	5000
టెక్ మహీంద్రా	1500	5000
విప్రో	100	2000

హంగేరి రచయిత లాస్‌జ్లోకు సాహిత్య నోబెల్



స్టాక్‌హోం : సాహిత్యంలో విశేషంగా కృషి చేసినందుకు హంగేరి రచయిత లాస్‌జ్లో క్రాస్నాహోర్కైనిని ఈ ఏడాది సాహిత్యంలో నోబెల్ పురస్కారం వరించింది. 'విధ్వంసం, బీభత్సం మధ్యలో కళ యొక్క శక్తిని పునరుద్ఘాటించిన ఆయన దార్శనికతకు గుర్తింపు'గా ఈ బహుమతి లభించింది. రొమేనియా సరిహద్దుల్లోని ఒక చిన్న పట్టణంలో 1954లో జన్మించిన లాస్‌జ్లో 1985లో తన మొదటి నవలతోనే హంగేరీలో సాహిత్య సంచలనంగా మారారు. ఈ ఏడాది ప్రచురితమైన 'హెర్ష్ 07769'ను మహత్తరమైన సమకాలీన జర్మనీ నవలగా నోబెల్ కమిటీ అభివర్ణించింది. జర్మనీలో నెలకొన్న సామాజిక అశాంతిని కచ్చితంగా కళ్లకు కట్టినట్లు ఆ నవలలో చూపించారు. హింసను, సౌందర్యాన్ని 'అసాధ్యమైన రీతిలో కలుపుతూ', ఉత్కంఠ గొలిపేలా రచించారని తన ప్రకటనలో పేర్కొంది. ఇప్పటివరకు సాహిత్యంలో 117 సార్లు నోబెల్ బహుమతిని ప్రకటించగా, 18సార్లే మహిళలకు దక్కింది.

దిగ్భ్రాంతికి గురయ్యాం!

- దాడి ఘటనపై తొలిసారి స్పందించిన జస్టిస్ గవాయ్
- ఇక అది మర్చిపోయిన అధ్యాయమంటూ వ్యాఖ్య
- ఇది చిన్న విషయం కాదు : జస్టిస్ భుయాన్

7



మెడికల్ కాలేజీ నిర్మాణాల ప్రాంతంలో మాట్లాడుతున్న జగన్

పేదవాడికి వైద్యాన్ని దూరం చేస్తారా?

- వైసిపి అధినేత వైఎస్ జగన్
- మాకవరపాలెం మెడికల్ కాలేజీ నిర్మాణాల పరిశీలన

7

ఫార్మా కాలుష్య నియంత్రణకు సమయం కావాలి!

- సమగ్ర అధ్యయనం చేస్తాం
- యు కొత్తపల్లి సభలో ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్
- సమయం కోరడంపై మత్స్యకారుల నిరసన
- జీవనోపాధులు నాశనమవుతుంటే సమయం కావాలా అంటూ ఆగ్రహం

2



మంత్రి పవన్ కల్యాణ్‌కు వినతిపత్రం ఇస్తున్న మత్స్యకారులు

ఆదివాసీ చట్టాలు, హక్కులకు విరుద్ధంగా మంజూరు చేసిన

హైడ్రో పవర్ ప్రాజెక్టు ఒప్పందాలు రద్దు చేయండి

ముఖ్యమంత్రికి వి.శ్రీనివాసరావు లేఖ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఆదివాసీ చట్టాలు, హక్కులకు విరుద్ధంగా మంజూరు చేసిన హైడ్రో పవర్ ప్రాజెక్టు ఒప్పందాలు రద్దు చేయాలని, దానికోసం ఇచ్చిన జిఒ 51, 13, 2ను వెంటనే ఉపసంహరించాలని ప్రభుత్వాన్ని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి ఆయన గురువారం లేఖ రాశారు. రాష్ట్రంలో 5వ షెడ్యూల్డ్ ఏరియాలో ఉన్న అల్లూరి సీతారామరాజు (ఏ.ఎస్.ఆర్.), పార్వతీపురం మన్యం జిల్లాలు, అనకాపల్లి సబ్‌ప్లాన్ ఏరియాలో పంప్డ్ స్టోరేజీ హైడల్ ప్రాజెక్టుల ప్రతిపాదన ఆదివాసీలను తీవ్రమైన ఆందోళనకు గురిచేస్తోందని తెలిపారు. వీటి ఏర్పాటుతో ఆదివాసీల హక్కులు, భూములు, సంస్కృతి, పర్యావరణం దారుణంగా దెబ్బతింటాయన్న ఆందోళన వ్యక్తం చేశారు. ఆ ప్రాంతాల్లో హైడ్రో పవర్ ప్రాజెక్టుల నిర్మాణానికి నవయుగ, మెగా, అదానీ, శ్రీశిరిడిసాయి వంటి కార్పొరేట్ కంపెనీలకు ఆదివాసీ గ్రామసభ ఆమోదం లేకుండానే జిఓలు (51,13,2 నంబర్లతో ఇంధన మరియు శక్తి విభాగం) జారీ చేశారని వివరించారు. ఆదివాసీల చట్టాలు, హక్కులకు పూర్తి విరుద్ధంగా కార్పొరేట్ కంపెనీలతో రాష్ట్ర ప్రభుత్వం అక్రమ ఒప్పందం చేసుకుందని పేర్కొన్నారు. కనీసం గిరిజన సలహా మండలి అభిప్రాయం కూడ తీసుకోలేదని, ప్రభుత్వ చర్యలు, ఆంధ్రప్రదేశ్ పంచాయతీల (ఎక్స్‌టెన్షన్) షెడ్యూల్డ్ ఏరియాలకు (పెసా) చట్టం 1996 నిబంధనలు 2011, అడవి హక్కుల చట్టం (ఎఫ్ఆర్ఏ) 2006, ఆంధ్రప్రదేశ్ భూమి బదిలీల నియంత్రణ (1/70 నియమం) చట్టాలకు వ్యతిరేకమని వివరించారు. సుప్రీం కోర్టు సమతా జడ్జిమెంట్ ఇప్పటికీ విలువ కలిగి ఉందని, అలాగే, ఎఫ్ఆర్ఏ చట్టం కింద ఆదివాసీల అటవీ హక్కులు (ఉమ్మడి మరియు వ్యక్తిగత హక్కులు) గుర్తించకుండా ప్రాజెక్టులను నిర్మించాలనుకోవడం అన్యాయమని తెలిపారు. ఈ ప్రాజెక్టుల వల్ల ఎనిమిది మండలాల్లో 250 గ్రామాల్లో 50,000 మంది ఆదివాసీలతోపాటు 20 వేల ఎకరాల అటవీ, వ్యవసాయ సొంత భూములు జలసమాధి కానున్నాయని పేర్కొన్నారు. గుజ్జీలి, మిగతా 7లో

భారీగా ఎఐఎస్ అధికారుల బదిలీ

- పలు జిల్లాలకు కొత్త జెసిల నియామకం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి-అమరావతి



ఎస్ ఢిల్లీరావు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 31 మంది అఖిల భారత సర్వీస్ (ఎఐఎస్) అధికారులను బదిలీ చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. వ్యవసాయశాఖ డైరెక్టర్‌గా ఉన్న ఎస్ ఢిల్లీరావు బదిలీ అయ్యారు. ఖరీఫ్‌లో యూరియా సరఫరాలో వైఫల్యం వలన ఆయనను బదిలీ చేసినట్లు చెబుతున్నారు. ఆయన స్థానంలో మన్‌జీర్ జిలానీ సామున్‌ను నియమించారు. ఢిల్లీరావును పౌరసరఫరాలశాఖ వైస్ ఛైర్మన్ స్థానానికి బదిలీ చేశారు. ఎపిపిఎస్‌సి సెక్రటరీగా రవి సుభాష్, ఎపిఎస్‌పిడిసిఎల్ సిఎండిగా శివశంకర్ లోతేటి, కుటుంబసంక్షేమ శాఖ డైరెక్టర్‌గా చక్రధర్‌బాబు, ఇంటర్మీడియట్ ఎడ్యూకేషన్ డైరెక్టర్‌గా పి రంజిత్‌బాషా, హౌసింగ్ కార్పొరేషన్ వైస్ సిఎండిగా అరుణ్‌బాబు నియమితులయ్యారు. పలు జిల్లాలకు కొత్త జాయింట్ కలెక్టర్లను వేశారు.

బదిలీల పట్టిక 2లో..

వేధింపులు ఆపండి

- ఎపి రైతు, వ్యవసాయ, కౌలు రైతుల సంఘాల డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పని గంటలు పెంపుదలకు వ్యతిరేకంగా ఈ నెల 7న నిర్వహించిన రాష్ట్ర వ్యాప్త నిరసనల్లో భాగంగా కృష్ణాజిల్లా మచిలీపట్నం కోనేరు సెంటర్‌లో ధర్నా చేసిన రౌతు, కౌలు రైతుల, కార్మిక సంఘాల నాయకులపై పోలీసులు వేధింపులు ఆపాలని ఎపి రైతు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మిక సంఘాల రాష్ట్ర కమిటీలు డిమాండ్ చేశాయి. ఈ నిరసనకు సంబంధించి 23 మంది నాయకులపై పోలీసులు అక్రమ కేసులు పెట్టి వేధించడాన్ని ఎపి రైతు, వ్యవసాయ కార్మిక, కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు కె.ప్రభాకర్ రెడ్డి, వి.వెంకటేశ్వర్లు, ఎం.హరిబాబులు గురువారం ఒక సంయుక్త ప్రకటనలో ఖండించారు.

రైతు సంఘం, కార్మిక సంఘం నాయకులపై సెక్షన్ 35 కింద కేసులు నమోదు చేసినట్లు నోటీసు ఇచ్చి విచారణకు పోలీసు స్టేషన్‌కు రమ్మని ఆయా సంఘాల నాయకులను పోలీసులు వేధిస్తున్నట్లు చెప్పారు. రైతు సంఘం కృష్ణా జిల్లా కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావును బంటుమిల్లిలో అరెస్ట్ చేసి జిల్లా కేంద్రమైన మచిలీపట్నం తీసుకువెళ్లి అక్కడ సొంత పూచీకత్తుపై విడుదల చేశారన్నారు. ఇతర నాయకుల ఇళ్లకు వెళ్లి నోటీసులు ఇచ్చి వేధిస్తున్నట్లు చెప్పారు. ఈ రకమైన వేధింపులను మానుకోవాలని పోలీసులకు విజ్ఞప్తి చేశారు.

భూసార పరీక్షల కోసం విధానం

- ఆధార్ ధృవీకరణతో ఎరువులు
- సమీక్షలో సిఎం చంద్రబాబు నాయుడు



వ్యవశాయశాఖ సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

భూసార పరీక్షలు నిర్వహించి, వాటి ఫలితాలు ఆధారంగా రబీలో రైతులు సూక్ష్మపోషకాలను వినియోగించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. వ్యవసాయ అనుబంధ రంగాలపై రాష్ట్ర సచివాలయంలో గురువారం నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ వచ్చే వ్యవసాయ సీజన్‌కు భూసార పరీక్షలకు సంబంధించి ఒక ప్రామాణిక విధానాన్ని రూపొందించాలన్నారు. పొలం విస్తీర్ణం ఆధారంగా, ఆధార్ ధృవీకరణలతో ఎరువులు ఇవ్వాలని సూచించారు. రాష్ట్రంలోని అన్ని వ్యవసాయ మార్కెట్ కమిటీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు మాస్టర్ ప్లాన్ రూపొందించాలని అధికారులను సిఎం ఆదేశించారు. 218 మార్కెట్ కమిటీల స్థలాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అర్బన్ ప్రాంతాల్లో రైతుబజార్ల ఆధునీకరణకు భూమి ఎంత అవసరమో అంచనా రూపొందించాలన్నారు. మార్కెట్ కమిటీలను, రైతు బజార్లకు అనుసంధానం చేసి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్నారు. భూసారం పెంచే పోషకాల విషయంలో లోపాలను సవరించి ప్రణాళికలు చేసుకోవాలని, దశలవారీగా రసాయన ఎరువుల వినియోగం తగ్గించాలని అన్నారు. హెచ్డీ బర్లీ పొగాకుకు మార్కెట్ డిమాండ్ కోసం నాలుగు జిల్లాల్లో పొగాకు సాగుకు క్రాఫ్ హాలిడే ప్రకటించాలన్నారు. ఈ నెల 11 ప్రధాని ప్రారంభించనున్న ధన్ ధాన్య కృషీ యోజన కింద ఏ పంటలకు ఎక్కువ ప్రయోజనం కలగులుగుందో చూసి ఆ పంటలను ప్రోత్సహించాలన్నారు. గతంలో రాష్ట్రం కంటే కర్ణాటకలో సెరీకల్చర్ సాగు తక్కువగా ఉండేదని, ఇప్పుడు 8 రెట్లు పెరిగిందన్నారు. ఇందుకు కారణాలు విశ్లేషించాలని సూచించారు. ప్రతి పంటపైనా వ్యవసాయ విశ్వవిద్యాలయాలు అధ్యయనం చేయాలని, రైతులకు వచ్చే పంట ఆదాయం, ఇతర ప్రత్యామ్నాయాలపై రీ ఓరియంటేషన్ జరగాలన్నారు. ఉల్లి, టమోటో, మిర్చి, మామిడి పంటల విషయంలో సాగు ఖర్చు ఎంత ఉందనేది ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, ఆయా పంటలకు ధరలు తగ్గకుండా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. టేబుల్ వెరైటీతో పాటు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లకు పంపితే అసలు ధరలు పడిపోయి నష్టం వాటిల్లే అవకాశం ఉందన్నారు. అరటి పంటకు దేశీయంగా, విదేశాల్లో వినియోగం అధికంగా ఉందన్నారు. ఉద్యాన పంటల సాగు దేశీయ మార్కెట్లతోపాటు ఎగుమతులు చేసేందుకు లాజిస్టిక్స్ సవాళ్లు లేకుండా చూసుకోవాలని చెప్పారు. వ్యవసాయ రంగంలో, అనుబంధ రంగాల్లో ఉత్పత్తులుగా వచ్చే పట్టగొడుగుల సాగు పెద్ద ఎత్తున ప్రోత్సహించాలని, సర్కులర్ ఎకానమీలోకి పుట్టగొడుగుల సాగు తీసుకురావాలని ఆదేశించారు. రాష్ట్రంలో ఉన్న ఆవుల విసర్జితాలతో జీవామృతం తయారు చేసి ప్రకృతి వ్యవసాయానికి అనుసంధానించాలని,ఈ సమీక్షా సమావేశంలో వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు, ఆ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఈపురుపాలెం కాలువ సహజస్థితిని పునరుద్ధరించండి

- బాధితులకు న్యాయం చేయండి
- సిఎంకు వి.శ్రీనివాసరావు లేఖ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

చీరాల మండలం ఈపురుపాలెం సముద్రతీరంలో ఉన్న స్ట్రయిట్‌కట్ కాలువ సహజస్థితిని పునరుద్ధరించాలని, బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు గురువారం నాడు లేఖ రాశారు. వరద నీరు సముద్రంలో కలవడంతో పాటు, స్థానిక మత్స్యకారులు తమ బోట్లు నిలిపేందుకు, తుఫాను సమయాల్లోనూ రక్షణస్థలంగా ఉపయోగించుకునేందుకు స్ట్రయిట్‌కట్ కాలువ అనుకూలంగా ఉందని ఈ లేఖలో ఆయన సిఎం దృష్టికి తీసుకువచ్చారు. ఈ సహజ నిర్మాణం వల్ల సముద్ర అలలు, గాలుల ప్రభావం నుంచి మత్స్యకారులు బోట్లు రక్షించుకుంటున్నారని పేర్కొన్నారు. 2021 తర్వాత ఈ పరిసరాల్లో రిసార్ట్‌లు, రియల్ ఎస్టేట్ వ్యాపారాలు వేగంగా విస్తరించడంతో, కొంతమంది ప్రైవేటు రియల్ ఎస్టేట్ వ్యాపారులు, రాజకీయ మద్దతుతో కలిసి కాలువ పూడ్చివేత పనులు ప్రారంభించారని తెలిపారు. 'శ్రీ భ్రమర ఇన్‌ఫ్రా డెవలపర్స్' పేరుతో ఈ ప్రాంతంలో ప్రైవేట్ బీచ్ ఏర్పాటుకు, రిసార్ట్ నిర్మాణాలకు ప్రయత్నాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. దీనివల్ల మత్స్యకారులు తమ వత్తిని కొనసాగించలేని పరిస్థితి ఏర్పడిందని వివరించారు. కాలువ పూడ్చివేత వల్ల సముద్ర ముఖద్వారంలో బోట్ల రాకపోకలు ఆగిపోయాయని, సహజ "ఎల్–ఆకారం" నిర్మాణం చెదిరిపోయి, 45కు పైగా బోట్లు ధ్వంసమయ్యాయని వివరించారు. పలు గ్రామాల మత్స్యకారుల జీవనాధారం తీవ్రంగా దెబ్బతిందని తెలిపారు. ఈ పరిస్థితులపై 13 గ్రామాల మత్స్యకారులు నెలల తరబడి ఆందోళనలు చేస్తున్నారని, కలెక్టర్ విచారణ జరిపి, ఎల్ ఆకారంలో తిరిగి పునరుద్దరించడం, బీచ్ డెవలప్‌మెంట్ పేరుతో పూడ్చిన భూభాగంపై పరిహారం చెల్లించడం వంటి హామీలు ఇచ్చినా, ఇవి ఇప్పటివరకు అమలు కాలేదని తెలిపారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఇక్కడ తమ నిర్మాణాలను కొనసాగిస్తూ తీర ప్రాంత మత్యకారుల వత్తికి తీవ్ర ఆటంకాలు కల్పిస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే తగు చర్యలు తీసుకోవాలని కోరారు. సహజ స్థితిలో ఉన్న ఎల్ ఆకారపు స్ట్రయిట్‌ట్ కట్ కాలువను పునరుద్ధరించాలని, హై టైడ్ లైన్ (హెచ్‌టిఎల్) నుండి 200 మీటర్ల పరిధిలో ఉన్న రిసార్ట్, కాంక్రీట్ నిర్మాణాలను వెంటనే తొలగించాలని కోరారు. సర్వే నంబర్ 499/2 భూమిపై జారీ చేసిన డికె పట్టాను రద్దు చేసి, ఆ భూమిని మత్స్యకారుల అవసరాలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. పూడ్చివేతవల్ల దెబ్బతిన్న బోట్లకు ప్రభుత్వ ఖర్చుతో నష్టపరిహారం చెల్లించాలని, రియల్ ఎస్టేట్ వ్యాపారుల అక్రమ భూకబ్జా, తీరరేఖ నిబంధనల ఉల్లంఘనపై విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు. మత్స్యకారులు ఈ కాలువపై ఆధారపడి దశాబ్దాలుగా జీవనం సాగిస్తున్నారని, ఈ సహజ వనరును నాశనం చేయడమంటే, వారి జీవన హక్కును హరించడం వంటిదేనని తెలిపారు. ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకొని సహజ స్థితిని పునరుద్దరించి, మత్స్యకారులకు న్యాయం చేయాలని శ్రీనివాసరావు కోరారు.



సమానత్వంతోనే మహిళాభివృద్ధి

- సినీ దర్శకులు ఉమామహేశ్వరరావు
- అనంతలో ఘనంగా ఐద్వా సాంస్కృతిక ఉత్సవాలు

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

స్త్రీలు, పురుషులు అన్న తేడా లేకుండా అందరూ సమానమే అన్న భావనతో ముందుకు సాగడం ద్వారా మహిళాభివృద్ధి సాధ్యం అవుతుందని సినీ దర్శకులు ఉమామహేశ్వరరావు తెలిపారు. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) 16వ రాష్ట్ర మహాసభ ఈ నెల 13 నుంచి మూడు రోజుల పాటు అనంతపురంలో జరగనుంది. ఈ నేపథ్యంలో గురువారం అనంతపురం జిల్లా కేంద్రంలోని కృష్ణ కళా మందిరంలో సాంస్కృతిక ఉత్సవాలు ప్రారంభం అయ్యాయి. నాలుగు రోజుల పాటు సాగే కళా సాంస్కృతి ఉత్సవాలు, ఫొటో ఎగ్జిబిషన్ ప్రారంభోత్సవ సభ నిర్వహించారు. తొలుత ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను స్నేహలత నర్సింగ్ హోం అధినేత్రి డాక్టర్ అరుణ ప్రారంభించారు. అనంతరం కళా సాంస్కృతిక ఉత్సవాలను సినీ దర్శకులు ఉమా మహేశ్వరరావు, అనంతపురం జిల్లా రెవెన్యూ అధికారి మలోల ప్రారంభించారు. యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు సరళ అధ్యక్షతన నిర్వహించిన ప్రారంభ కార్యక్రమంలో ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వారి కుటుంబంలో ఆడ మగ అన్న తేడాలేకుండా పిల్లలను సమానంగా పెంచి సమాన హక్కులు కల్పించాలన్నారు. రాజకీయం, సంస్కృతి రెండూ ఒక్కటేనన్నారు. రెండింటిని అర్థం చేసుకుని మహిళలు ముందుకు సాగాలన్నారు. సమానత్వాన్ని ప్రతిబింబించే సినిమాలు ఎన్నో వచ్చాయని వాటిని ఆదరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి మాట్లాడుతూ ఐద్వా 16వ రాష్ట్ర మహాసభ ఈ నెల 13, 14, 15వ తేదీల్లో అనంతపురంలో నిర్వహిస్తున్న నేపథ్యంలో 9 నుంచి నుంచి 12వ తేదీ వరకు చైతన్య సాంస్కృతిక ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కళా ప్రదర్శనలు అలరించాయి. ఈ కార్యక్రమంలో గేట్స్ కళాశాల అధినేత్రి పద్మావతి, డాక్టర్ ప్రసూన్, డాక్టర్ ప్రగతి, యుటిఎఫ్ నాయకులు దేవేంద్రమ్మ, ప్రమీల, రాష్ట్ర నాయకులు రమణయ్య, ఐద్వా జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్యామల, చంద్రిక పాల్గొన్నారు.

ప్రధాని చేసిందేమీ లేదు : చింతా మోహన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ తన 11 ఏళ్ల పాలనలో దేశానికి చేసి మేలు శూన్యమని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ అన్నారు. రెండు ప్రధాన కుంభకోణాలలో మోడీ ఇరుక్కున్నట్లు తెలిపారు. విజయవాడ ప్రెస్ క్లబ్ లో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కార్పొరేట్ సంస్థలకు రూ.14.50 లక్షల కోట్ల రుణ మాఫీలో కోట్లు చేతులు మారాయని తెలిపారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను ఎందుకు అడ్డుకోలేదో ప్రజలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పాలని కోరారు. సంపద సృష్టిస్తానని చెప్పి తన కుటుంబ సంపదను పెంచుకుంటున్నాడు తప్ప ప్రజల సంపదను పెంచడం లేదన్నారు.

విఒఎల మూడేళ్ల కాలపరిమితి
అమలు నిలుపుదల

- మంత్రి కొండపల్లి శ్రీనివాస్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

స్వయం సహాయక సంఘాల పుస్తకాల నిర్వహణ, శిక్షణకు గ్రామ స్థాయిలో పని చేస్తున్న గ్రామ సంఘ సహాయకుల (విఒఎ) విషయంలో గత ప్రభుత్వం విధించిన మూడు ఏళ్ల కాలపరిమితి నిలుపుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు గ్రామీణ పేదరిక నిర్మూలనా శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. సచివాలయంలో విఒఎ సంఘ నాయకులతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఇందుకు సబందించిన ప్రతిని అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. విఒఎల తొలగింపు అంశం ఆయా గ్రామ సంఘాల నిర్ణయం మేరకు జరుగుతుందని తెలిపారు. విఒఎ సంఘంలో నిధులు దుర్వినియోగం చేయడం, అవినీతికి పాల్పడినట్లయితే వారిపై చట్టపరమైన క్రమశిక్షణా చర్యలు తీసుకోవడానికి డిఆర్‌డిఎ పిడికి అధికారులు కల్పించినట్లు వెల్లడించారు.

గ్రామీణ ప్రాంతాల్లో 27 వేల మంది విఒఎలు పూర్తి చేసుకున్నారని, వారి పని తీరు సంతృప్తి కరంగా ఉంటే గ్రామ సంఘాల నిర్ణయం ప్రకారం కొనసాగించవచ్చని సూచించారు. విఒఎలకు డేటా అప్‌డేట్ చేసేందుకు మొబైల్ ఫోన్ ఇవ్వాల్సిందిగా కోరాగా, పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని సెర్ప్ సిఇఒను మంత్రి ఆదేశించారు.

విఒఎల కాలపరిమితి రద్దుపై హర్షం

విఒఎల 3 ఏళ్ల కాలపరిమితి సర్క్యులర్ అమలును నిలుపుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం పట్ల ఎపి వెలుగు విఒఎ ఉద్యోగుల సంఘం (సిఐటియు) రాష్ట్ర కమిటీ హర్షం వ్యక్తం చేసింది.

గత 6 ఏళ్లుగా చేసిన పోరాటాల ఫలితంగానే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని యూనియన్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు సిహెచ్.రూపాదేవి, కె.ధనలక్ష్మిలు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గత ప్రభుత్వం 2019లో ఈ సర్క్యులర్ ను తీసుకువచ్చిందని, దీని రద్దు కోసం రాష్ట్రంలో మిలిటెంట్ పోరాటాలు నిర్వహించామని తెలిపారు. ఎన్నికల ముందు టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు అధికారంలోకి వస్తే కాలపరిమితి సర్క్యులర్‌ను రద్దు చేస్తామని హామీ ఇచ్చారని, హామీని ఇప్పుడు అమలు చేశారని తెలిపారు. ఈ అంశంపై గతంలో యూనియన్ ఆధ్వర్యంలో సిఎం చంద్రబాబు నాయుడికి, మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను స్వయంగా కలిపి వినతి పత్రాలు అందించామని తెలిపారు.

గురుకులాలు, వసతి గృహాల్లో
సౌకర్యాల మెరుగుదలకు టాటా సహకారం

- మంత్రి డోలా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకులాలు, ఎస్‌సి సంక్షేమ వసతి గృహాలలో సురక్షిత మంచినీరు, ఆహార నాణ్యత, మరగునీరు శుద్ధి ప్లాంట్ల ఏర్పాటు వంటి మౌలిక సౌకర్యాల మెరుగుదలకు టాటా ట్రస్టు సహకారం అందించనుంది. ఈ మేరకు సచివాలయంలో గురువారం నాడు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామితో టాటా ట్రస్ట్ ప్రతినిధులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..గురుకులాల్లో, వసతి గృహాల్లో వాటర్ ఇన్‌లైన్ క్లోరినేషన్, సివేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్స్ ఏర్పాటుకు టాటా ట్రస్ట్ ముందుకొచ్చిందన్నారు. వీటితో పాటు నాణ్యమైన ఆహార తయారీపై వంట పని కార్మికులకు శిక్షణ, ప్రకృతి సేద్యంలో సాంకేతిక సాయం కూడా అందిస్తామని టాటా ట్రస్టు ప్రతినిధులు ప్రతిపాదించినట్లు పేర్కొన్నారు.

బదిలీ అయిన అధికారులు

ఎవరు	ఎక్కడ	ఎక్కడికి
కెవిఎన్ చక్రధర్‌బాబు	వెయిటింగ్	కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్
డాక్టర్ మన్‌జిర్ జిలానీ సామూన్	మార్క్‌ఫెడ్ ఎమ్‌డి	వ్యవసాయశాఖ డైరెక్టర్
పి రవిసుభాష్	వెయిటింగ్	ఎపిపిఎస్‌సి సెక్రటరీ
శివశంకర్ లోతేటి	వెయిటింగ్	ఎస్‌పిడిసిఎల్ వైస్ సిఎండి
ఎస్ ఢిల్లీరావు	వ్యవసాయశాఖ డైరెక్టర్	సివిల్ సప్లయిస్ ఎమ్‌డి
పి రంజిత్‌బాషా	వెయిటింగ్	ఇంటర్ ఎడ్యుకేషన్ డైరెక్టర్
పి అరుణ్‌బాబు	వెయిటింగ్	హౌసింగ్ ఎమ్‌డి
జె వెంకట మురళి	వెయిటింగ్	సిసిఎల్‌ఎ సెక్రటరి
చేతన్ టిఎస్	వెయిటింగ్	సిసిఎల్‌ఎ జాయింట్ జెక్రటరి
బి నవ్య	కర్నూలు జెసి	వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ ఎమ్‌డి
సివి ప్రవీణ్ ఆదిత్య	మారిటైం బోర్డు సిఇఒ	ఎయిర్‌పోర్ట్స్ కార్పొరేషన్ ఎమ్‌డి
కెఎస్ విశ్వనాథన్	విశాఖ, విఎంఆర్‌డిఎ	
కమిషనర్	ఐ అండ్ పిఆర్ డైరెక్టర్	
ఆర్ గోవిందరావు	సర్వే సెటిల్‌మెంట్ డైరెక్టర్	సివిల్ సప్లయిస్ డైరెక్టర్
ఎస్ చిన్నరాముడు	వెయిటింగ్	ఎస్‌సి కమిషన్ సెక్రటరీ
జి సూర్యసాయి ప్రవీణ్‌చంద్	సిఆర్‌డిఎ అడిషనల్	
కమిషనం	ట్రాన్స్‌కో జాయింట్ ఎమ్‌డి	
భావన	కాకినాడ కమిషనర్	బాపట్ల జిల్లా జెసి
సి విష్ణు చరణ్	నంద్యాల జిల్లా జెసి	సోషల్ వెల్ఫేర్ డిప్యూటి సెక్రటరీ
షోబిక ఎస్ఎస్	వెయిటింగ్	హెల్త్ డిప్యూటి సెక్రటరీ
అభిషేక్ కుమార్	శ్రీసత్యసాయి జిల్లా జెసి	మారిటైం బోర్డు విసి
కె కార్తిక్	వెయిటింగ్	నంద్యాల డిస్ట్రిక్ట్ జెసి
సుభం బన్సల్	తిరుపతి జిల్లా జెసి	ఇండస్ట్రీస్ డైరెక్టర్
అభిషేక్ గౌడ	అల్లూరి జిల్లా జెసి	ఏలూరు జిల్లా జెసి
నూరుల్ ఖ్వామర్	ఫైనాన్స్ డిప్యూటి సెక్రటరీ	కర్నూలు జిల్లా జెసి
రాహుల్ మీనా	కాకినాడ జిల్లా జెసి	రాజమహేంద్రవరం కమిషనర్
అపూర్వ భరత్	ఎటపాక సబ్ కలెక్టర్	కాకినాడ జిల్లా జెసి
మంత్రి మౌర్య భరద్వాజ్	ఆదోని సబ్ కలెక్టర్	శ్రీసత్యసాయి జిల్లా జెసి
బిఎస్‌వి త్రివినాగ్	మార్కాపురం సబ్ కలెక్టర్	హౌసింగ్ డిప్యూటి సెక్రటరీ
మురళీధర్ కొమ్మిశెట్టి (ఐఆర్ఎస్)	ఎహెచ్‌డిడి డిపార్ట్‌మెంట్	ఎపి డైయిరీ ఎమ్‌డి
వి ప్రసన్న వెంకటేష్	సోషల్ వెల్ఫేర్ సెక్రటరీ	లెదర్ ఇండస్ట్రీస్ ఎమ్‌డి
ఎస్ భరణి (ఐఎఫ్ఎస్)	స్పోర్ట్స్ అథారిటీ ఎమ్‌డి	యూత్ సర్వీసెస్ కమిషనర్
తిరుమణి శ్రీ పూజ	పాడేరు ఐటిడిఎ పిఒ	అల్లూరి జిల్లా జెసి

అవ్యాన్ రియల్టర్స్‌కు
హైకోర్టులో ఎదురుదెబ్బ

ప్రజాశక్తి - అమరావతి

నేహారెడ్డి, ఆమె కంపెనీ అవ్యాన్ రియల్టర్స్ ఎల్‌ఎల్‌పికి హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. విశాఖ జిల్లా భీమునిపట్నం పరిధిలో సిఆర్‌జెడ్ నిబంధనలకు విరుద్ధంగా సముద్రానికి అతిసమీపంలో నిర్మించిన కాంక్రీట్‌గోడను కూల్చేందుకు అయిన రూ.48.21 లక్షల ఖర్చును నేహారెడ్డి, ఆమె కంపెనీ చెల్లించాలంది. తదుపరి విచారణలోగా జివిఎంసి వద్ద జమ చేయాలని మాజీ ఎంపి విజయసాయిరెడ్డి కుమార్తె పెనక నేహారెడ్డి, ఆమె కంపెనీ అవ్యాన్ రియల్టర్స్ ఎల్‌ఎల్‌పిని ఆదేశించింది. విచారణను అక్టోబర్ 16కి వాయిదా వేస్తూ చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్.రఘునందనరావుతో కూడిన డివిజన్‌బెంచ్ గురువారం ఆదేశించింది. భీమునిపట్నం వద్ద సిఆర్‌జెడ్ నిబంధనలు ఉల్లంఘించి రెస్టోబార్ నిర్మాణం జరిగిందని ఎపి కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ అథారిటీ మెంబర్ సెక్రెటరీ, జివిఎంసి కమిషనర్, విశాఖ జిల్లా కలెక్టర్‌తో కూడిన కమిటీ నివేదికను హైకోర్టు పరిశీలించింది. దీనిపై కౌంటర్ వేయాలని రెస్టోబార్‌ను ఆదేశించింది. భీమునిపట్నం పరిధిలోని సిఆర్ జెడ్–1 ప్రాంతంలో సముద్రానికి సమీపంలో నేహారెడ్డి అవ్యాన్ రియల్టర్స్ ఎల్‌ఎల్‌పి శాశ్వత కాంక్రీట్ నిర్మాణాలపై జనసేన కార్పొరేటర్ పిఎల్‌విఎన్ మూర్తి యాదవ్ పిల్ దాఖలు చేశారు. అదేవిధంగా మరో నాలుగు రెస్టోబార్లను తొలగించాలంటూ గ్రామాభివృద్ధిసేవా సంఘం అధ్యక్షులు గంటా నూకరాజు మరో పిల్ వేశారు. ఈ నిర్మాణాలు చేసిన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని ఎపి కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ అథారిటీ మెంబర్ సెక్రెటరీని ఆదేశించింది.

ఎపిపిఎస్‌సి తాత్కాలిక ఛైర్మన్‌గా ప్రొఫెసర్ సి శశిధర్

ప్రజాశక్తి- అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఎపిపిఎస్‌సి) ఛైర్మన్ బాధ్యతలను ప్రొఫెసర్ సి శశిధర్‌కు అప్పగిస్తూ ప్రభుత్వం గురువారం జిఒ జారీ చేసింది.

ఆ పదవిలో రిటైర్డ్ సీనియర్ ఐపిఎస్ అధికారి ఎఆర్ అనురాధ కొనసాగుతున్నారు. గురువారంతో ఆమె వయసు 62 సంవత్సరాలు నిండటంతో నిబంధనల ప్రకారం పదవీ విరమణ చేశారు. దాంతో ఎపిపిఎస్‌సి సభ్యునిగా ఉన్న ప్రొఫెసర్ సి శశిధర్‌కు ఛైర్మన్‌గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు.

నేటి నుంచి 'ఆరోగ్యశ్రీ' బంద్

- రూ.2,700 కోట్ల బకాయిలు

ప్రజాశక్తి- నెల్లూరు ప్రతినిధి, అమరావతి బ్యూరో

పేద ప్రజలకు ఉచితంగా వైద్య సేవలందించే ఆరోగ్యశ్రీ పథకం విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. ఏడాది నుంచి బిల్లులు చెల్లించకపోవడంతో ఈ పథకం కింద వైద్య సేవలను ఎన్‌టిఆర్ వైద్యసేవల నెట్‌వర్క్ ఆస్పత్రులు శుక్రవారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా నిలిపివేస్తున్నాయి. ఇప్పటికే వైద్య ఖర్చుల ధరలు భారీగా పెరిగాయని, ప్రభుత్వం పాత ధరలే ఇస్తోందని, నెలవారీ బిల్లులు సకాలంలో చెల్లించడం లేదని, దీంతో, ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎపి స్పెషాలిటీ ఆస్పత్రి అసోసియేషన్ (ఆషా) ఒక ప్రకటనలో తెలిపింది. ప్రతి నెలా రూ.380 కోట్ల బిల్లులు అవుతున్నా ఏడాది నుంచి బకాయిలు పేరుకుపోయాయని పేర్కొంది. బకాయిల చెల్లింపు విషయంలో ప్రభుత్వం స్పష్టత ఇవ్వడం లేదని తెలిపింది. 2005 నుంచి రాష్ట్రంలో ఆరోగ్య శ్రీ పథకం అమలవుతోంది. ఎన్‌టిఆర్ వైద్యసేవల నెట్‌వర్క్ పరిధిలోని ఆస్పత్రుల ద్వారా 2,446 వైద్యసేవలు అందుతున్నాయి. చేసిన వైద్యానికి ప్రభుత్వం నుంచి డబ్బులు సక్రమంగా విడుదల కాకపోవడంతో అనేక ఆస్పత్రులు వైద్యసేవల నుంచి తప్పుకున్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలో ఎన్‌టిఆర్ వైద్యసేవ నెట్‌వర్క్ కింది 2,291 ఆస్పత్రులు ఉన్నాయి. వాటిలో 1,397 ప్రభుత్వాస్పత్రులు, 894 ప్రయివేటు ఆస్పత్రులు. ప్రతి నెలా రూ.380 కోట్ల నుంచి రూ.420 కోట్ల మేరకు బిల్లులు అవుతున్నాయి. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రూ.5 లక్షలు ఉన్న వైద్య సేవల ఖర్చు పరిమితి ఉంది. టిడిపి కూటమి ప్రభుత్వం ఈ పరిమితిని రూ.25 లక్షలకు పెంచింది. ఇందులో రూ.2.50 లక్షల వరకు ఇన్సూరెన్స్ కంపెనీలు కవర్ చేస్తుండగా, రూ.25 లక్షల వరకు ఆరోగ్య ట్రస్ట్ ద్వారా ఇస్తుందని ప్రభుత్వం ప్రకటించింది. రాష్ట్రంలో ఎన్‌టిఆర్ వైద్యసేవలందిస్తున్న ఆస్పత్రులకు ప్రభుత్వం సమారు రూ.2,700 కోట్లు బకాయిలు ఉన్నట్లు సమాచారం. 2010లో డిస్పోజల్, సిరైల్‌గౌస్ రూ.10 ఉంటే, ప్రస్తుతం రూ.22కు పెరిగిందని, ఐవి కాన్యులా రూ.22 నుంచి రూ.40కు, సిరంజి 5 ఎంఎల్, 10 ఎంఎల్ రూ.3 నుంచి రూ.6, నార్మల్ సెలైన్ 500 ఎంఎల్ రూ.20 నుంచి రూ.40కు, కుట్లు వేసే మెటీరియల్ రూ.135 నుంచి రూ.325కు, ట్రస్ట్‌తో ఎంఒయు ఖర్చులు రూ.10 వేల నుంచి రూ.40 వేలకు పెరిగినట్లు ఆస్పత్రి వర్గాలు చెబుతున్నాయి.

సమస్యలు పట్టని ప్రభుత్వం : ఆషా

ప్రభుత్వం తమ సమస్యలు పట్టించుకోవడం లేదని, పదో తేదీ (శుక్రవారం) నుంచి వైద్యసేవలు నిలిపేస్తున్నామని ఎపి స్పెషాలిటీ ఆస్పత్రుల అసోసియేషన్ (ఆషా) రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ ఎస్‌విఎల్ నారాయణరావు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రోగులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

వైద్య సేవల్ని ఆపొద్దు : మంత్రి సత్యకుమార్

రాష్ట్ర ప్రభుత్వం త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తుందని, వైద్య సేవలను ఆపకుండా కొనసాగించాలని ఎన్టీఆర్ వైద్య సేవల నెట్వర్క్ ఆసుపత్రుల యాజమాన్యాలను రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ కోరారు. విజయవాడలో గురువారం ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వ దాదాపు రూ.2,500 కోట్లు బకాయిలను వదిలి వెళ్లిందరన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను ఆసుపత్రుల యాజమాన్యాల ప్రతినిధులు పరిస్థితిని అర్థం చేసుకుంటారని ఆశిస్తున్నట్లు చెప్పారు. బకాయిలతో సహా అన్ని సమస్యల్ని పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో మాట్లాడి చర్యలు తీసుకుంటామన్నారు. కాగా కొత్తగా మంజూరు చేసిన వైద్య కళాశాలల నిర్మాణంలో మాజీ సిఎం భారీ అవినీతికి పాల్పడినట్లు సత్యకుమార్ ఆరోపించారు. ఒక్కో గుత్తేదారు నుంచి రూ.100 కోట్లు చొప్పున కమిషన్ తీసుకున్నట్లు గురువారం ఒక ప్రకటనలో ఆయన పేర్కొన్నారు.

ఫార్మా కాలుష్య నియంత్రణకు సమయం కావాలి !

- సమగ్ర అధ్యయనం చేస్తాం
- యు కొత్తపల్లి సభలో ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్
- సమయం కోరడంపై మత్స్యకారుల నిరసన
- జీవనోపాధులు నాశనమవుతుంటే సమయం కావాలా అంటూ ఆగ్రహం



పవన్ కల్యాణ్‌కు వినతిపత్రం ఇస్తున్న మత్స్యకారులు

ప్రజాశక్తి- కాకినాడ

ఫార్మా పరిశ్రమల నుంచి వస్తున్న కాలుష్య నియంత్రణకు సమయం కావాలని, సమగ్ర అభ్యయనం చేపట్టి కార్యాచరణ సిద్ధం చేస్తామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చెప్పారు. కాకినాడ జిల్లా యు.కొత్తపల్లి మండలం ఉప్పాడ సెంటర్‌లో గురువారం నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. పిఠాపురం సహా పరిసర ప్రాంతాల్లోని పరిశ్రమలు కలుషిత జలాలను నేరుగా సముద్రంలో వదిలేస్తుండటంపై చర్యలకు తగిన సమయం కావాలని, శాఖలను సమన్వయం చేసుకుని ముందుకు వెళ్లాల్సివుంటందని, దీనిపై చేతులెత్తి అభిప్రాయం చెప్పాలని పవన్ కోరారు. దీనికి మత్స్యకారులు స్పందిస్తూ జీవనోపాదులు నాశనమవుతుంటే ఇంకా సమయం కావాలా అంటూ పలువురు మత్స్యకారులు బహిరంగ సభలోనే నిరసన తెలిపారు. పవన్‌కల్యాణ్ వారిని పట్టించుకోకుండా తన ప్రసంగాన్ని కొనసాగించారు. పరిశ్రమలకు మత్స్యకారులెవ్వరూ వ్యతిరేకంగా లేరని, అయితే ఆ పరిశ్రమల వల్ల కాలుష్యాన్ని మాత్రమే వ్యతిరేకిస్తున్నారని పవన్ చెప్పారు. రాష్ట్రాభివృద్ధి మీద మత్స్యకారుల అవగాహనకు ఇదే నిదర్శనమని వారికి కృతజ్ఞతలు తెలిపారు. అయితే మత్స్యసంపదను, వారి జీవనభృతిని దెబ్బతీస్తున్న కాలుష్యాన్ని అరికట్టేందుకు తగిన సమయం కావాలని పునరుద్ఘాటించారు. తీర ప్రాంతంతో పాటు పిఠాపురం పరిసర ప్రాంతాల్లోని పరిశ్రమల కాలుష్యం మీద ఆడిట్ చేయాలని జిల్లా అధికారులను ఆయన కోరారు.

సీ ప్రొటెక్షన్ వాల్ నిర్మిస్తాం

ఉప్పాడ సీ ప్రొటెక్షన్ వాల్ నిర్మిస్తానని పవన్ కల్యాణ్ మాట ఇచ్చారు. ఇప్పటికే ఉప్పాడ– కొణపాక మధ్య తీర రక్షణ పనులు ప్రారంభించినట్లు చెప్పారు. రూ.323 కోట్లతో ఉప్పాడ సీ ప్రొటెక్షన్ వాల్ నిర్మించేందుకు కేంద్రం సానుకూలంగా ఉందని తెలిపారు.

ఈ సభలో ఎంపి తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, ఎమ్మెల్సీలు పిడుగు హరిప్రసాద్, కర్రి పద్మశ్రీ, ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, డిసిసిబి ఛైర్మన్ తుమ్మల బాబు పాల్గొన్నారు. అంతకుముందు కాకినాడలోని కలెక్టరేట్‌లో ఉప్పాడ మత్స్యకారులతో ఆయన మాట్లాడారు. సముద్రపు వేటలో ప్రమాదవశాత్తూ మరణించిన 18 మంది మత్స్యకారుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా 'మాటామంతీ' కార్యక్రమంలో ఉప్పాడ, కోనపాపపేట, అమీనాబాద్, మూలపేట మత్స్యకార ప్రతినిధులు తమ సమస్యలను వివరించారు. పవన్ స్పందిస్తూ సమస్యలను మూడు నెలల్లో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

మోస్తరు నుంచి భారీ వర్షాలు

• విపత్తుల నిర్వహణ సంస్థ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

దక్షిణ ఒడిశా నుంచి మన్నార్ గల్ఫ్ వరకు ఉన్న ద్రోణి గురువారం ఉత్తర కోస్తా తమిళనాడు నుంచి కొమొరిన్ ప్రాంతం వరకు, కోస్తా ఆంధ్ర, రాయలసీమ, తమిళనాడు మీదుగా సముద్ర మట్టానికి 0.9 కిలో మీటర్ల ఎత్తులో కొనసాగుతుందని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండి ప్రఖర్ జైన్ తెలిపారు. దీని ప్రభావంతో అల్లూరి సీతారామరాజు, రాయలసీమ జిల్లాల్లో శుక్రవారం పిడుగులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలు చెట్ల కింద నిలబడరాదని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. శుక్రవారం నాడు అల్లూరి సీతారామరాజు, అనంతపురం, శ్రీ సత్యసాయి, వైఎస్ఆర్ కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో పిడుగులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. మిగిలిన జిల్లాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని వెల్లడించారు.

88 వేల మంది పిల్లలకు ప్రత్యేక బోధన అవసరం

• స్పెషల్ డిఎస్‌సి ద్వారా నియామకాలకు డివైఎఫ్ఐ డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ప్రత్యేక బోధన అవసరమైన విద్యార్థులు 88 వేల మంది పైగా ఉన్నారు. వీరందరికీ విద్యనందించాలంటే ప్రత్యేక బోధనా నైపుణ్యాలున్న ఉపాధ్యాయులు అవసరం. కానీ అందుకు సరిపడ సంఖ్యలో ఉపాధ్యాయులు లేకపోవడంతో ఆ పిల్లలంతా విద్యకు దూరమవుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తక్షణమే ప్రత్యేక డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేసి ఉపాధ్యాయులను నియమించాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. విజయవాడలో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి రామన్న మాట్లాడుతూ.. ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వులు 13 ప్రకారం 2260 ప్రత్యేక విద్య ఉపాధ్యాయ పోస్టుల నియామకానికి తక్షణమే నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రత్యేక విద్యా బోధకుల సంబంధించిన కోర్సులు చదివిన 20 వేల మంది ఎక్కువ తరలివచ్చి స్పెషల్ డిఎస్సి కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. సుప్రీం కోర్టు ఈ ఏడాది డిసెంబరు 15 లోపు ప్రత్యేక విద్య డిఎస్సి నోటిఫికేషన్ ఇవ్వాలని ఆదేశించిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. రెగ్యులర్ నోటిఫికేషన్ లేనందున అభ్యర్థుల వయోపరిమితి సడలింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో డివైఎఫ్ఐ నగర అధ్యక్షులు శివ, స్పెషల్ డిఎస్సి అభ్యర్థులు ప్రశాంత్, అరుణ్‌కుమార్, రోహిత్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బలవంతపు భూసేకరణతో ప్రజాప్రతిఘటన

• మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు

ప్రజాశక్తి- బూర్జ (శ్రీకాకుళం జిల్లా)

థర్మల్ పవర్ ప్లాంట్ పేరుతో బలవంతపు భూసేకరణ చేస్తే ప్రజాప్రతిఘటన తప్పదని మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. శ్రీకాకుళం జిల్లా బూర్జ మండలం మసానపుట్టిలో బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా, థర్మల్ పవర్ ప్లాంట్ ప్రతిపాదనను రద్దు చేయాలని గురువారం జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. గిరిజనులను కార్పొరేట్లకు అప్పగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోందని విమర్శించారు. గతంలో కాకరాపల్లిలో థర్మల్ పవర్ ప్లాంట్ పేరుతో 2020 ఎకరాలు బలవంతంగా గుంజుకొని, ప్రజల ప్రాణాలు బలి తీసుకొని ఈస్ట్‌కోస్ట్ కంపెనీకి కట్టబెట్టిందని, కంపెనీ ఆ భూములను రూ.1,500 కోట్లకు బ్యాంకులో తాకట్టు పెట్టి దివాళాపోయిందని గుర్తుచేశారు. ప్రభుత్వం ఈ భూములను కారుచౌకగా వేలం వేసి లాజిక్స్ కంపెనీకి కట్టబెట్టిందన్నారు. అభివృద్ధి పేరుతో ప్రజలను మోసం చేసి ఉద్యోగం ఇచ్చారా అని కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, అచ్చెన్నాయుడులను ప్రశ్నించారు. ప్రజల భూములు తీసుకొని కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టడమే అభివృద్ధా? అని ప్రశ్నించారు. అభివృద్ధిపై చిత్తశుద్ధి ఉంటే ఆముదాలవలస సుగర్ ఫ్యాక్టరీని తెరిపించాలని డిమాండ్ చేశారు. దీనివల్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా పది వేల మందికి ఉపాధి కల్పించవచ్చని తెలిపారు. నాగావళి, వంశధార నదుల అనుసంధానం, నేరడి బ్యారేజీని నిర్మిస్తే రెండు పంటలకు నీరంది జిల్లా సస్యశ్యామలమవుతుందన్నారు. సిపిఎం, సిపిఐ, న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శులు డి.గోవిందరావు, చాపర వెంకటరమణ, తాండ్ర ప్రకాష్, ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.మోహనరావు మాట్లాడుతూ అణువిద్యుత్ ప్లాంట్, కార్గో ఎయిర్‌పోర్టు, థర్మల్ పవర్ ప్లాంట్ ఏర్పాటుతో జిల్లాను విధ్వంసం చేయాలనుకుంటున్నారా? అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సదస్సులో థర్మల్ వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు హరనాథ్, సవర సింహాచలం, వడ్డ సురేష్, కె.అప్పలనాయుడు, గిరిజనులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు



సంస్మరణ సభలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు

పత్రిక ద్వారా ప్రజావాణి వినిపించిన శ్రీనివాస్

• సంస్మరణ సభలో వక్తలు

ప్రజాశక్తి- ఉంగుటూరు (గన్నవరం)

ఇంటి పేరును ప్రజాశక్తిగా, కేరాఫ్ అడ్రస్‌గా చింతపల్లి పాపారావు భవనంగా జీవనం సాగించిన శ్రీనివాస్ పత్రిక ద్వారా ప్రజావాణిని వినిపించారని పలువురు వక్తలు పేర్కొన్నారు. గత నెల 27న రోడ్డు ప్రమాదంలో మరణించిన ప్రజాశక్తి గన్నవరం విలేకరి నెక్కలపు శ్రీనివాసరావు సంస్మరణ సభ గురువారం కృష్ణా జిల్లా గన్నవరంలోని చింతపల్లి పాపారావు భవనంలో జరిగింది. తొలుత శ్రీనివాస్ చిత్రపటానికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, కృష్ణా జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వివిధ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు, ప్రజాశక్తి సిబ్బంది శ్రద్ధాంజలి ఘటించారు. రెండు నిమిషాలపాటు మౌనం పాటించి సంతాపం తెలిపారు. అనంతరం సిపిఎం గన్నవరం పట్టణ కార్యదర్శి సూరగాని సాంబశివరావు అధ్యక్షతన జరిగిన సభలో వై.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ శ్రీనివాస్ విలేకరిగా, పార్టీ నేతగా సమాజ మార్పు కోసం తనవంతు పాత్ర పోషించారన్నారు. తన జీవనయానంలో ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా తుదివరకూ నిలబడగలిగారని కొనియాడారు. గన్నవరం ఎంపిపి అనగాని రవి మాట్లాడుతూ ప్రజలపక్షాన సిపిఎం పోరాడుతోందని, ప్రజావాణిని 'ప్రజాశక్తి' వినిపిస్తోందని, ఆ రెండింటి బాధ్యతలు శ్రీనివాస్ చక్కగా నిర్వర్తించారని అన్నారు. సిపిఎం కృష్ణా జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు మాట్లాడుతూ ప్రజల సమస్యలపై కథనాలు రాయడంలో శ్రీనివాస్ తనకు తానే సాటని అన్నారు. ప్రజాశక్తి ఉమ్మడి కృష్ణా జిల్లా కన్వీనర్ ఎంబి.నాథన్ మాట్లాడుతూ ప్రజాశక్తి వంటి ప్రజల పత్రికలో పని చేయడం ఆషామాషీ కాదని, అడ్డంకులను అధిగమించి పని చేసినప్పుడే ప్రజా విలేకరి కాగలుగుతాడని, శ్రీనివాస్ ఆ కోవకు చెందుతారని అన్నారు. సిపిఐ నాయకులు కొండా వీరాస్వామి మాట్లాడుతూ శ్రీనివాస్ మృతి ఎర్రజెండాకు, ప్రజాశక్తికి తీరని లోటన్నారు. శ్రీనివాస్‌తో తమకు ఉన్న అనుబంధాన్ని సీనియర్ పాత్రికేయులు యు.రామకృష్ణ తదితరులు పంచుకున్నారు.

రిజర్వేషన్ల అమలుపై హైకోర్టు స్టే

• తెలంగాణ స్థానిక ఎన్నికల నోటిఫికేషన్ నిలిపివేత

• 4 వారాల్లోగా కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైకోర్టు ఆదేశాలతో తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ నిలిచిపోయింది. బిసిలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేసేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన జిఒ నంబర్ 9 అమలుపై హైకోర్టు స్టే విధించింది. ఈ మేరకు న్యాయస్థానం గురువారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. నాలుగు వారాల్లోగా కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ప్రభుత్వ కౌంటర్లపై అభ్యంతరాల దాఖలుకు పిటిషనర్లకు రెండు వారాల గడువు విధించింది. తదుపరి విచారణను ఆరు వారాలకు వాయిదా వేసింది. మరోవైపు స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్‌పైనా హైకోర్టు స్టే విధించింది. ఈ నేపథ్యంలో ఎన్నికల ప్రక్రియ ఆరు వారాలపాటు నిలిచిపోనుంది. జిఒ నంబర్ 9ను సవాలు చేస్తూ మాధవరెడ్డి, సముద్రాల రమేష్ దాఖలు చేసిన పిటిషన్లపై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ జిఎం మొహియుద్దీన్‌లతో కూడిన ద్వి సభ్య ధర్మాసనం రెండోరోజు విచారణ జరిపింది. ప్రభుత్వం తరపున అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి, సీనియర్ అడ్వకేట్ అభిషేక్ మను సింఘ్వీ, ప్రొ.రవివర్మ వాదనలు వినిపించారు. బిసి కులగణనకు అసెంబ్లీ ఏకగ్రీవ తీర్మానం చేసిందని, స్వాతంత్ర్యం తర్వాత సమగ్ర కులగణన సర్వే తెలంగాణలోనే జరిగిందన్నారు. రాష్ట్రంలో బిసి జనాభా 57.6 శాతం ఉన్నట్లు తేలిందని తెలిపారు. వారికి 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని ప్రభుత్వం ఏకగ్రీవంగా నిర్ణయించినట్లు కోర్టుకు వివరించారు. రాజ్యాంగంలో రిజర్వేషన్లపై ఎక్కడా 50 శాతం సీలింగ్ లేదన్నారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసిలు కలిపి 85 శాతం జనాభా ఉన్నారని, 85 శాతం జనాభాకు 42 శాతంతో కలిపి 67 శాతమే రిజర్వేషన్లు ఇస్తున్నామని వివరించారు. 15 శాతం జనాభాకు 33 శాతం ఓపెన్‌గానే ఉందన్నారు. పిటిషనర్ల తరపున సీనియర్ న్యాయవాదులు కె వివేక్ రెడ్డి, మయూర్ రెడ్డి, జె ప్రభాకర్ వాదనలు వినిపించారు. సుప్రీంకోర్టు తీర్పులు, పంచాయతీరాజ్ చట్టం ప్రకారం రిజర్వేషన్లు 50 శాతానికి మించరాదని, మహారాష్ట్రలో రిజర్వేషన్లు 50 శాతానికి పెంచినప్పుడు సుప్రీంకోర్టు తప్పుబట్టిందని వివరించారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్‌పై స్టే విధిస్తూ, ఎన్నికల నోటిఫికేషన్ నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. స్థానిక ఎన్నికల విషయంలో న్యాయస్థానం ఉత్తర్వులను అమలు చేస్తామని రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యదర్శి గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు.

అదాని సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటుపై

ప్రజాభిప్రాయ సేకరణను రద్దు చేయండి

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

విశాఖపట్నం జిల్లా పెదగంట్యాడలో అదాని అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటు కోసం మరలా ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తామన్న ప్రభుత్వ నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని, ఆ ఫ్యాక్టరీకి ఇచ్చిన అనుమతులను రద్దు చేయాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం డిమాండ్ చేశారు. గురువారం విశాఖ సిఐటియు జిల్లా కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం బుధవారం పెదగంట్యాడలో నిర్వహించిన పబ్లిక్ హియరింగ్‌ను ప్రజలు స్వచ్ఛందంగా తిరస్కరించిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రజాభీష్టాన్ని గుర్తించి ఫ్యాక్టరీకి ఇచ్చిన అనుమతులను రద్దు చేయాల్సిందిపోయి దానికి భిన్నంగా మరలా 15 రోజుల తర్వాత ప్రజాభిప్రాయ సేకరణ చేపడతామని ప్రకటించడం ప్రజలను మోసం చేయడమేనన్నారు. పార్టీ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ.. అదాని గంగవరం పోర్టు కాలుష్యం వల్ల ఇప్పటికే పది లక్షల మంది ప్రజలు పలు వ్యాధులకు గురవుతున్నారని, తాజాగా సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పడితే ప్రజల పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలను మభ్యపెట్టేలా స్థానిక గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతున్నారని, ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యేలు గణబాబు, ఎంపి భరత్ స్పందించి సిమెంట్ ఫ్యాక్టరీని రద్దు చేయించాలన్నారు. లేని పక్షంలో ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్, వి.కృష్ణారావు పాల్గొన్నారు.

వేటకు వెళ్లిన మత్స్యకారుడు మృతి

ప్రజాశక్తి - వజ్రపుకొత్తూరు

సముద్రంలో చేపల వేటకు వెళ్లి తెప్పపై నుంచి జారిపడి శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరు మండలంలోని దేవునల్తాడకు చెందిన మత్స్యకారుడు బుడగట్ల చినబాబు (42) మృతి చెందారు. తోటి మత్స్యకారులతో గురువారం వేకువజామున సముద్రంలో చేపల వేటకు వెళ్లిన చినబాబు, వేట చేస్తుండగా వలను లాగే క్రమంలో ఒక్కసారిగా ఎగసిపడిన అలల ఉధృతికి తెప్పపై నుంచి జారి సముద్రంలో పడిపోయారు. ఒడ్డుకు చేరుకున్న మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆయనకు భార్య నారాయణమ్మ, తల్లి, గుణసరమ్మ, తండ్రి కేశవులు ఉన్నారు.

గూగుల్‌కు పచ్చని పంట పొలాలు

• సాగు భూముల్లో ఐటి కంపెనీలు సరికాదు : సిపిఎం

ప్రజాశక్తి - ఆనందపురం (విశాఖపట్నం)


భూములను పరిశీలిస్తున్న లోకనాథం, జగ్గునాయుడు

విశాఖ జిల్లా ఆనందపురం మండలం తర్లువాడ గ్రామంలోని దళిత రైతులకు చెందిన పచ్చని పంట భూములను గూగుల్ డేటా సెంటర్ కోసం కేటాయించడం తగదని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం, విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు అన్నారు. గూగుల్‌కు కేటాయించిన భూములను తర్లువాడ గ్రామంలోని దళిత రైతులతో కలిసి గురువారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా లోకనాథం, జగ్గునాయుడు మాట్లాడుతూ... 1971లో ప్రధాని ఇందిరా గాంధీ కాలంలో తర్లువాడ గ్రామంలోని దళిత రైతులకు ఒక్కొక్కరికీ రెండు ఎకరాల చొప్పున బి పట్టాలు మంజూరు చేశారని, అప్పటి నుంచి రైతులు ఆ భూముల్లో జీడి, మామిడితో పాటు అంతర పంటలుగా కాయగూరలు పండిస్తున్నారని తెలిపారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో సుమారు 480 ఎకరాల భూములను గూగుల్, సిఫీ, రైడెన్ ఇన్ఫోటెక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ వంటి కంపెనీలకు అప్పగించేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందని తెలిపారు. వీటిలో తర్లువాడలో 200 ఎకరాలు, అచ్యుతాపురం, రాంబిల్లి ప్రాంతాల్లో 160 ఎకరాలు, అడవివరంలో 120 ఎకరాలు ఉన్నాయని వివరించారు. పచ్చని సాగు భూముల్లో ఐటి కంపెనీలు పెట్టడం సరికాదని, పరిశ్రమల జోన్లలో ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. గతంలో ల్యాండ్ పూలింగ్ పేరుతో పేదల భూములను స్వాధీనం చేసుకోవడాన్ని హైకోర్టు కూడా అంగీకరించలేదని గుర్తుచేశారు. గూగుల్ వంటి డేటా సెంటర్లు భారీగా నీటిని వినియోగిస్తాయని, ఇది పర్యావరణానికి, భూగర్భ జలాలకు తీవ్ర ముప్పు అని అన్నారు. రైతులకు తెలియకుండా భూసార పరీక్షలు, సర్వేలు, నష్టపరిహారం నిర్ణయాలు చేయడం సరికాదన్నారు. పార్టీ డివిజన్ కార్యదర్శి ఆర్ఎస్ఎన్.మూర్తి మాట్లాడుతూ.. దళిత రైతులకు అన్యాయం చేస్తే ఊరుకోబోమన్నారు. పర్యటనలో భాగంగా సిపిఎం నాయకులు రైతుల పంట పొలాలను సందర్శించి, పంటలను పరిశీలించారు. వివిధ దేశాల నుంచి వ్యవసాయ శాస్త్రవేత్తలు తర్లువాడలోని ప్రకృతి వ్యవసాయాన్ని సందర్శించి రైతులకు అవార్డులు ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. గ్రామ రైతులు మాట్లాడుతూ 'మాకు బతకడానికి ఈ భూములు తప్ప వేరే దారి లేదు. ప్రాణాలైనా అర్పిస్తాం కానీ భూములు ఇవ్వం' అని పేర్కొన్నారు.

మోహన్‌బాబు వర్శిటీకి ఊరట

గుర్తింపు రద్దు సిఫార్సుల అమలుపై స్టే

ప్రజాశక్తి - అమరావతి

తిరుపతి జిల్లా రంగంపేటలోని మోహన్ బాబు యునివర్సిటీ గుర్తింపుని రద్దు చేయాలని, విద్యార్థుల నుండి రూ.26.17 కోట్ల మేరకు అదనంగా వసూలు చేసిన మొత్తాన్ని తిరిగి చెల్లించాలని ఎపి ఉన్నత విద్య నియంత్రణ, పర్యవేక్షణ కమిషన్ ప్రభుత్వానికి చేసిన సిఫార్సుల అమలును హైకోర్టు నిలుపుదల చేసింది. యునివర్సిటీ పరిపాలనా బాధ్యతలను శ్రీవెంకటేశ్వర యునివర్సిటీ వైస్ ఛాన్సలర్/ రిజిస్ట్రారుకు అప్పగించాలన్న ఆదేశాలను కూడా నిలుపుదల చేస్తూ వెలువరించిన మధ్యంతర ఉత్తర్వులను అధికారిక వెబ్ సైట్‌లో అప్లోడ్ చేయాలని కూడా ఆదేశించింది. మోహన్‌బాబు యునివర్సిటీ దాఖలు చేసిన అనుబంధ పిటిషన్‌ను పరిష్కరించినట్లుగా జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి గురువారం ఆదేశాలు జారీ చేశారు. ప్రధాన పిటిషన్‌పై విచారణను ఈ నెల 14కి వాయిదా వేశారు. మోహన్‌బాబు యునివర్సిటీ గుర్తింపు రద్దు చేయడంతో పాటు పలు చర్యలకు సిఫార్సు చేస్తూ ఎపి ఉన్నతవిద్య నియంత్రణ, పర్యవేక్షణ కమిషన్ ఆదేశించిన సంగతి తెలిసిందే.

కొనసాగుతున్న ఐటి దాడులు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో పప్పుల వ్యాపారులపై ఆదాయపన్ను శాఖ అధికారుల దాడులు మూడో రోజు గురువారం కూడా కొనసాగాయి. కర్నూలు, తెనాలి, గుంటూరు, విజయవాడ, వినుకొండ, తెనాలి, పిడుగురాళ్ల, విశాఖపట్నం తదితర ప్రాంతాల్లో కందిపప్పు, పచ్చిపప్పు ఇతర నిత్యావసర వస్తువులను ప్రభుత్వానికి సరఫరా చేసే అంశంలో జరిగిన అక్రమాలు తనిఖీల్లో కనుగొన్నారు. హైదరాబాద్‌లో బంగారం దుకాణాలపై ఐటి అధికారులు దాడులు చేసిన క్రమంలో విశాఖపట్నం, గుంటూరు జిల్లాకు చెందిన వ్యాపారులు ఎక్కువ బంగారం కొనుగోలు చేశారని తేలడంతో ఈ దిశగా వ్యాపారుల ఇళ్లు, సంస్థల్లో తనిఖీలు చేస్తున్నారు. సంబంధిత వ్యాపారుల నుంచి వైసిపి నాయకులకు నిధులు వెళ్లాయని ఐటి అధికారుల దాడుల్లో వెల్లడి కావడంతో ఈ కేసులన్నింటిని ఎన్‌ఫోర్సుమెంట్‌కు అప్పగించాలని ఆదాయపన్ను అధికారులు యోచిస్తున్నారు. 2019 నుంచి 2024 వరకు ప్రభుత్వానికి కందిపప్పు, పచ్చిపప్పు సరఫరా చేసిన ఎస్.వెంకటేశ్వరరావు, ఒ.శ్రీనివాసరావు, మస్తాన్‌రావు తదితరుల నివాసాలు, వ్యాపార సంస్థల కార్యాలయాల్లో తనిఖీ చేయగా పెద్ద మొత్తంలో బంగారం, నగదు పట్టుబడినట్టు తెలిసింది.

రూ.15 లక్షల కోట్లకు బంగారం తాకట్టు రుణాలు

• ఇక్రా రేటింగ్స్ అంచనా

న్యూఢిల్లీ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మార్చి ముగింపు నాటికి బంగారం రుణాల మార్కెట్ రూ.15 లక్షల కోట్లను చేరొచ్చని రేటింగ్ ఏజెన్సీ ఇక్రా అంచనా వేసింది. గత కొన్ని నెలలుగా బంగారం ధరలు వేగంగా పెరగడం, అన్ని సమయాలలో గరిష్ట స్థాయికి చేరుకోవడంతో ఈ రంగం పెరుగుదలకు దోహదం చేయొచ్చని ఇక్రా లిమిటెడ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఎఎం కార్తీక్ పేర్కొన్నారు. సంఘటిత పసిడి రుణ మార్కెట్ పరిమాణం 2027 మార్చి నాటికి రూ.18 లక్షల కోట్లకు పెరగవచ్చని పేర్కొన్నారు. బ్యాంకింగేతర విత్త సంస్థలు (ఎన్‌బిఎఫ్‌సి)ల పసిడి రుణ పోర్టుపోలియో 30-35 శాతానికి పెరగొచ్చన్నారు. ఈ మార్కెట్ పరిమాణం మార్చి 2025 నాటికి రూ.11.8 లక్షల కోట్లుగా ఉంది.

టిసిఎస్ నికర లాభాలు రూ.12,075 కోట్లు

ముంబయి : టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టిసిఎస్) సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసికం (క్యూ2)లో 1.39 శాతం వృద్ధితో రూ.12,075 కోట్ల నికర లాభాలు ప్రకటించింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.11,909 కోట్ల లాభాలు నమోదు చేసింది. కంపెనీ ఒక్కో షేరుకు రూ.11 చొప్పున మధ్యంతర డివిడెండ్‌ను ప్రకటించింది.

దేశ కుబేరుల్లో ముకేష్ అంబానీ టాప్

• రూ.9.32 లక్షల కోట్ల సంపదతో అగ్రస్థానం • తర్వాత స్థానంలో గౌతం అదానీ : ఫోర్బ్స్

న్యూఢిల్లీ : దేశంలో అపారకుబేరుడిగా అగ్రస్థానంలో ముకేష్ అంబానీ కొనసాగుతున్నారు. భారత్‌లోని 100 మంది అత్యంత సంపన్నుల జాబితాను ఫోర్బ్స్ విడుదల చేసింది. అంబానీ సంపద 105 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.9.32 లక్షల కోట్లు)గా ఉంది. గతేడాదితో పోలిస్తే 12 శాతం తగ్గింది. ఫోర్బ్స్ రిపోర్ట్ ప్రకారం.. 2025లో 100 మంది భారత కుబేరుల సంపద విలువ లక్ష కోట్ల డాలర్ల (దాదాపు రూ.88 లక్షల కోట్లు)కు చేరింది. వీరి మొత్తం సంపద 2025లో 9 శాతం తగ్గింది. ముకేష్ అంబానీ తర్వాత గౌతం అదానీ రెండో స్థానంలో నిలిచారు.

అదానీ 92 బిలియన్ డాలర్ల (రూ.8.17 లక్షల కోట్లు) సంపదను కలిగి ఉన్నారు. ఒపి జిందాల్ గ్రూపునకు చెందిన సావిత్రి జిందాల్ మూడో స్థానంలో ఉండగా, టెలికాం దిగ్గజం సునీల్ మిత్తల్ నాలుగు, టెక్ బిలియనీర్ శివ నాడార్ ఐదోస్థానంలో నిలిచారు.

ఆయా సంస్థల షేర్ విలువలతో పాటు ఆయా వ్యక్తులు, కుటుంబాల నుంచి సేకరించిన ఆర్థిక సమాచారం, విశ్లేషకులు, స్టాక్ ఎక్స్ఛేంజీలు, నియంత్రణ సంస్థల నుంచి సేకరించిన వివరాలతో సంపద విలువను అంచనా వేసినట్లు ఫోర్బ్స్ వెల్లడించింది.

సంపాదకీయం

దగ్గుమందు దారుణం!

చిన్నారుల దగ్గు నివారణకు వేసే మందు- ఆ పసిపిల్లల ప్రాణాలనే తీయటం ఎంత దారుణం! అది ఎంత అజాగ్రత్తకు, అమానవీయతకు సంకేతం! మూడేళ్ల క్రితమే ఈ చర్చ తీవ్ర స్థాయిలో జరిగింది. ఆఖరికి ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఒ) కూడా జోక్యం చేసుకొంది. ఆ మందుల్లో వాడే రసాయనం ఎంతటి హానికరమో వివరించి, నిషేధానికి సిఫార్సు చేసింది. అయినా, మన పాలకులు బాధ్యతాయుతంగా వ్యవహరించలేదు. ఫలితంగా గత వారం రోజుల్లో మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో 17 మంది చిన్నారులు ప్రాణాలు కోల్పోయారు. అభంశుభం తెలియని పసివాళ్లు, అమ్మానాన్న ఇచ్చిన మందు ద్వారా ఉపశమనం పొంది, హాయిగా చిరునవ్వులు చిందించాల్సినవాళ్లు ఊపిరి ఆగిపోయి విగత జీవులయ్యారు. ఇలాంటి సంఘటనలు మళ్లీ మళ్లీ జరుగుతున్నందుకు పాలకులు సిగ్గుపడాలి. పసిపిల్లల ప్రాణాలతో నిర్లక్ష్యంగా, బాధ్యతారాహిత్యంగా వ్యాపారం చేస్తున్నందుకు బోనులో నిలబడాలి.

హానికరమైన దగ్గు మందును వాడడం వల్ల మధ్యప్రదేశ్‌లోని చింద్వారా ప్రాంతంలో తొలి చిన్నారి మరణం సెప్టెంబరు రెండో తేదీన సంభవించింది. ఆ తరువాత అనేకమంది చిన్నారులు తీవ్ర అస్వస్థతకు గురవ్వడం, వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతూ మరో 14 మంది ప్రాణాలు కోల్పోవటం అత్యంత విషాదకరం. రాజస్థాన్‌లోనూ ఇదే కారణంతో ఇద్దరు చిన్నారులు మరణించారు. కొద్దిపాటి కారణానికే అస్వస్థతకు గురయ్యేంత సున్నితంగా ఉండే పసిపిల్లలకు వాడే మందుల తయారీలో ఇంతటి తీవ్ర నిర్లక్ష్యం ఎందుకు చోటు చేసుకుంటోంది? తరచూ ఇలాంటి బాధ్యతారాహిత్యాలు బట్టబయలవుతున్నా - ప్రభుత్వాలు ఎందుకు కళ్ళు మూసుకొని ఉంటున్నాయి? తీవ్ర ఆవేదన, ఆందోళన కలిగించే ఈ ప్రశ్నలకు బాధ్యతాయుతమైన సమాధానాలు లభిస్తాయనుకోవటం కూడా అత్యాశే!

"దగ్గు మందులో ఉపయోగించే డై ఇథలీన్, ఇథలీన్ గ్లైకాల్ రసాయనాలు మోతాదు మించితే - చిన్నారుల ఆరోగ్యం మీద అవి తీవ్ర దుష్ప్రభావాన్ని చూపిస్తాయి. 0.10 శాతానికి మించిన రసాయనం ఉంటే అది పసిపిల్లల మూత్రపిండాల పనితీరును దారుణంగా దెబ్బ తీసే ప్రమాదం ఉంది. భారత్ ఔషధ కంపెనీల నుంచి వచ్చిన దగ్గు మందులో ఈ విష రసాయనాల మోతాదు 0.25 శాతం నుంచి 2.1 శాతం వరకూ ఉంది." అని రెండేళ్ల నాడు సాక్షాత్తూ ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదించింది. మన దేశం నుంచి పోర్టీస్, రీమాన్ లేబరేటరీలు తయారు చేసి పంపిన దగ్గు సిరప్‌లు జాంబియా, ఉజ్బెకిస్తాన్ దేశాల్లో అనేకమంది చిన్నారులు చనిపోవటానికి కారణమయ్యాయి. అప్పట్లో ఈ విషాదాలు తీవ్ర సంచలనమై, అంతర్జాతీయంగా భారత్ పరువును బజారు పాలు చేశాయి. ఔషధ సంస్థల మందుల తయారీ మీద, అవి పాటించే ప్రమాణాల మీదా తనిఖీలు చేయాల్సిన ప్రభుత్వం తగు రీతిలో వ్యవహరించకపోవటమే ఈ దారుణం మళ్లీ మళ్లీ చోటు చేసుకోవటానికి కారణం. మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లలో చిన్నారుల మరణాలు సంభవించినా అక్కడి బిజెపి డబుల్ ఇంజన్ సర్కార్లు తక్షణం స్పందించకపోవటం విచారకరం. జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సి) నోటీసులు ఇచ్చాక కానీ, మధ్యప్రదేశ్ పాలకుల్లో చలనం కలగలేదు. చిన్నారుల మరణాల దుర్ఘటనపై తక్షణం సమగ్ర విచారణ జరిపించాలని, కల్తీ ఔషధాలను వెంటనే నిషేధించాలని ఎన్‌హెచ్‌ఆర్‌సి మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్ ప్రభుత్వాలకు; భారత డ్రగ్ కంట్రోలర్ జనరల్ (డిసిజిఐ)కు నోటీసులు జారీ చేసింది. తీసుకున్న చర్యలపై రెండు వారాల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశించింది.

చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్టు మధ్యప్రదేశ్ ప్రభుత్వం స్పందించింది. మృతుల కుటుంబాలకు రూ.4 లక్షల నష్టపరిహారం ప్రకటించింది. డ్రగ్ కంట్రోలర్ దినేశ్ మౌర్య బదిలీ, డిప్యూటీ డైరెక్టరు, ఇద్దరు డ్రగ్ ఇన్‌స్పెక్టర్ల సస్పెన్షన్ వంటి చర్యలు చేపట్టింది. వాస్తవానికి ఇలాంటి కంటి తుడుపు తతంగంతో సమసిపోయే సమస్య కాదిది. మూడేళ్ల క్రితం మన దేశ ఔషధ కంపెనీల దగ్గుమందుపై అంతర్జాతీయంగా విమర్శలు వచ్చినప్పుడే- మొత్తం యంత్రాంగాన్ని కట్టుదిట్టం చేయాల్సింది. ప్రమాణాల పైన, ప్రమాదాల పైన నిరంతర పర్యవేక్షణ జరిపి ఉండాల్సింది. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మేల్కొని, ఇలాంటివి పునరావృతం కాకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలి.

మహనీయుల మాట




మనకు తెలిసింది బిందువు
మనకు తెలియంది సింధువు

- ఐజాక్ న్యూటన్,
బ్రిటిష్ భౌతిక, గణిత, ఖగోళ శాస్త్రవేత్త.

ఆర్.ఎస్.ఎస్ విద్వేష చరిత్రకు వందేళ్లు!

సందర్భం

రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్.ఎస్.ఎస్) వందేళ్ళ (1925–2025) ఉత్సవాల్ని ప్రారంభిస్తూ ప్రధాని దేశ ప్రజలకు ఒక గొప్ప సందేశమిచ్చారు. స్వాతంత్ర్య పోరాటంలో ఆర్.ఎస్.ఎస్ వీరోచితంగా పోరాడిందనీ, ఎంతో మంది బలిదానాలు చేశారని ఢంకా బజాయించారు. ఒకప్పుడు మాటిమాటికీ బ్రిటీష్ ప్రభుత్వపు, ఆ తర్వాత నెహ్రూ, ఇందిరా గాంధీ ప్రభుత్వాలను క్షమాపణలు కోరుతూ వారి దయాదాక్షిణ్యాల మీద బతికిన ఆర్.ఎస్.ఎస్ వారు ఇప్పుడు చరిత్రను వక్రీకరించాలను కుంటున్నారన్నమాట! ఆ సందర్భంలోనే కావాలనే ప్రధాని అలా మాట్లాడారన్నమాట!! సందర్భం వచ్చింది గనక, ఆర్.ఎస్.ఎస్ ఆవిర్భావం- స్వాతంత్ర్య పోరాటంలో దాని పాత్ర గురించి ఈ దేశ ప్రజలు తప్పక వాస్తవాలు మాట్లాడుకోవాలి!





ప్రొ॥ దేవరాజు మహారాజు

దేశం కోసం ప్రాణాలర్పించిన త్యాగధనులు భగత్ సింగ్, సచ్చీంద్రనాథ్ సన్యాల్, చంద్రశేఖర ఆజాద్, సుఖ్‌దేవ్ థాపర్లు. వీరంతా కలిసి, నాటి బ్రిటీష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడడానికి 1928లో న్యూఢిల్లీలోని ఫిరోజ్‌షా కోట్లలో ఒక విప్లవ సంఘాన్ని ఏర్పాటు చేసుకున్నారు. దాని పేరు హిందుస్థాన్ సోషలిస్ట్ రిపబ్లికన్ అసోసియేషన్ (హెచ్.ఎస్.ఆర్.ఎ). దీన్నే హిందుస్థాన్ సోషలిస్ట్ రిపబ్లికన్ ఆర్మీ-అని కూడా వ్యవహరించేవారు. నాటి యువకులు పెద్ద సంఖ్యలో ఆకర్షితులై, ఇందులో భాగస్వాములయ్యేవారు. అలా సభ్యుడైనవాడే కేశవ్ బలిరామ్ హెడ్గేవార్. త్వరలోనే తన బుద్ధి బయట పెట్టుకున్నాడు. తను ఉన్న హెచ్.ఎస్.ఆర్.ఎ వివరాలన్నీ రహస్యంగా బ్రిటీష్ అధికారులకు చేరవేయడం ప్రారంభించాడు. ఆ రకంగా బ్రిటీష్ గూఢచారిగా మారిపోయాడు. నాటి బ్రిటీష్ వారి ప్రోద్బలంతో 1925 సెప్టెంబర్ 27న రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్.ఎస్.ఎస్) స్థాపించాడు. ఇది నాటి బ్రిటీష్ పాలకులకు అనుకూలంగా పని చేయడానికి ఏర్పడిన సంఘం. హిందుత్వను బలపరచడం దాని ధ్యేయం. హెచ్.ఎస్.ఆర్.ఎ కు పూర్తి వ్యతిరేకం!

బ్రిటీష్‌కు వ్యతిరేకంగా ఎవరూ ఏ విధమైన ఉద్యమాలూ చేయకుండా అరికట్టడం ఆనాటి ఆర్.ఎస్.ఎస్ విధి! అందువల్ల నాటి స్వాతంత్ర్యోద్యమాన్ని దొంగ దెబ్బ తీసినవాడు కేశవ్ బలరామ్ హెడ్గేవార్. దొంగే 'దొంగా దొంగా' అని గగ్గోలు పెట్టినట్టు నాటి నుంచి, నేటి వరకు ఇలాంటి వారే తమని తాము దేశభక్తులుగా ప్రకటించుకుంటున్నారు. పైగా మిగతా వారెవరూ దేశభక్తులు కారని, అది తమకు మాత్రమే చెందిన పేటెంట్ హక్కు అయినట్టు వ్యవహరిస్తున్నారు. 1925 ఆగష్టు 9న జరిగిన 'కకోరి రైలు దోపిడి'కి సంబంధించిన విచారణలో హెడ్గేవార్ బ్రిటీష్ వారికి పూర్తి సహకారం అందించాడు. రాంప్రసాద్ బిస్మిల్, ఠాకూర్ రోషన్ సింగ్, రాజేంద్రనాథ్ లహరి, అష్ఫఖుల్లా ఖాన్ లకు 1927 డిసెంబర్ 19న మరణ శిక్షలు పడడానికి కారణమయ్యాడు. మరో 16 మందికి దీర్ఘకాలిక జైలు శిక్షలు, ఇంకో 40 మందికి వివిధ శిక్షలు పడడానికి కారణమయ్యాడు. ఆనాటి బ్రిటీష్ ప్రభుత్వానికి ఊడిగం చేసిన ఈ ఆర్.ఎస్.ఎస్ దేశభక్తులు నేడు దేశభక్తి మీద భాషణలిస్తున్నారు. హిందుస్థాన్ సోషలిస్ట్ రిపబ్లికన్ అసోసియేషన్ ప్రకటించిన మ్యానిఫెస్టో "ద రెవల్యూషనరీ" కకోరి కుట్ర కేసులో బ్రిటీష్ వారికి ఒక సాక్ష్యమైంది. మరణ శిక్షకు గురైన బిస్మిల్, అష్ఫఖుల్లాలు విప్లవ కవులు. వీరి రచనల్ని భగత్ సింగ్ అభిమానించేవాడు.

స్వాతంత్ర్య సమరంలోకి దూకి తమ ప్రాణాల్ని సైతం అర్పించడానికి సిద్ధపడ్డ భారత యువకుల్ని అదుపు చేయడానికి...వారి ధ్యేయాన్ని, గమ్యాన్ని మార్చడానికి హెడ్గేవార్ అనే 'దేశభక్తుడు' చాలా శ్రమించాడు. అహింసా సిద్ధాంతంతో బ్రిటీష్ తుపాకి తూటాలకు సైతం భయపడక ఎదురొడ్డి నిలబడ్డ దేశ ప్రజల మనో ధైర్యం ముందు హెడ్గేవార్-ఆర్.ఎస్.ఎస్ కుట్రలు పని చేయలేదు. స్వాతంత్ర్య ప్రకటన వెలువడింది!! మూడు రంగుల జెండాను జాతీయ పతాకగా స్వీకరించాం. విధిలేక మొదటి సంవత్సరం జాతీయ జెండాను ఎగరేసిన ఆర్.ఎస్.ఎస్ చీఫ్ హెడ్గేవార్.. మరుసటి సంవత్సరం నుండి దాన్ని పూర్తిగా వ్యతిరేకించడం ప్రారంభించాడు. ఆర్.ఎస్.ఎస్ అధికారిక పత్రిక 'ఆర్గనైజర్' 1947 ఆగష్టు 14 సంచికలో ఈ విధంగా ప్రకటించారు.

"ఏదో అదృష్టం కలిసొచ్చి స్వాతంత్యం సాధించుకున్న వీరికి మరో ముఖ్యమైన విషయమేదీ కనబడలేదు. ఓ మూడు రంగుల జెండాను జాతీయ జెండాగా ఆమోదించుకున్నారు. ఆ జెండాను హిందువులు ఎన్నటికీ గౌరవించరు. మూడు అనే సంఖ్య చాలా అశుభమైంది. జాతీయ పతాకం మీద ఉన్న మూడు రంగులు దేశ ప్రజల మానసిక స్థితి మీద తీవ్రమైన వ్యతిరేక ప్రభావం చూపగలవు. ఫలితంగా దేశ భవిష్యత్తు దుర్భరంగా ఉంటుంది" అని! ఇన్నేళ్ళ స్వతంత్ర భారత దేశంలో త్రివర్ణ పతాకం స్వతంత్రంగా, సగర్వంగా నిలబడింది. ఇక కష్టాలంటే అవి ఆర్.ఎస్.ఎస్-బిజెపిల అనాలోచిత నిర్ణయాల వల్ల వచ్చినవే, వస్తున్నవే! కేశవ్ బలరామ్ హెడ్గేవార్ తర్వాత ఎం.ఎస్.గోల్వాల్కర్ సంఘ్ చాలక్ బాధ్యతలు (1940) తీసుకున్నాడు. ఈయన హెడ్గేవార్ కన్నా మరో అడుగు ముందుకేశాడు. బ్రిటీష్ ప్రభుత్వం అడుగులకు మడుగులొత్తడంతో పాటు, దేశ ప్రజల మనసుల్లో విష బీజాలు నాటాడు. దేశంలో అత్యధికులు హిందువులు కాబట్టి, వారిని ఏకం చేయడం కోసం అల్ప సంఖ్యాకుల పట్ల ద్వేషభావం వ్యాప్తి చేశాడు. బ్రిటిష్ ప్రభుత్వాన్ని వ్యతిరేకించడం దేశభక్తి కాదని, హిందూ మతాన్ని, సంస్కృతిని పరిరక్షించుకోవడమే దేశభక్తి-అని నూరిపోశాడు.

దేశమంతా క్విట్ ఇండియా ఉద్యమం ఉధృతంగా సాగుతూ ఉంటే..అందులో పాల్గొనగూడదని తన సంఘ్ పరివార్ సభ్యులకు గోల్వాల్కర్ పిలుపునిచ్చాడు. అది కొంతవరకు పని చేసింది. ఫలితంగా "1942లో బ్రిటీష్ వ్యతిరేక తిరుగుబాటును అణచివేయడంలో రాష్ట్రీయ స్వయం సేవకులు అందించిన తోడ్పాటు చాలా గొప్పది" అని నాటి బ్రిటీష్ ప్రభుత్వం బొంబాయిలో ఆర్.ఎస్.ఎస్ కు ఒక ప్రశంసా పత్రం అందించింది. ఇవి చరిత్రలోని వాస్తవాలు! ప్రస్తుత పరిస్థితుల్లో కూడా ఆర్.ఎస్.ఎస్ – బిజెపి ఆ మూల సూత్రాలతోనే పని చేయడం మనం చూస్తూనే ఉన్నాం. ఆర్.ఎస్.ఎస్ చరిత్రను గ్రంథస్థం చేసిన సి.పి.బిషకర్ పుస్తకం చదివినా ఈ విషయాలన్నీ తెలుస్తాయి. హిట్లర్, ముస్సోలినీల భావజాలాన్ని సంఘ్ పరివార్ ప్రముఖులు ఇష్టపడేవారని తెలియజేసింది ఈయనే! గాంధీజీ హత్య నేపథ్యంలో 1948 ఫిబ్రవరి 4న ఆర్.ఎస్.ఎస్ ఈ దేశంలో నిషేధానికి గురైంది. అప్పుడు భారత రాజ్యాంగానికి విధేయులమై ఉంటామనీ, జాతీయ పతాకాన్ని గౌరవిస్తామని ప్రతిజ్ఞ చేసి, గోల్వాల్కర్ నేతృత్వంలో 1949 ఏప్రిల్ 11న నిషేధాన్ని ఎత్తివేయాల్సిందిగా అభ్యర్థిస్తూ ఆర్.ఎస్.ఎస్ ప్రాధేయ పడింది. మూడు నెలల తర్వాత నెహ్రూ ప్రభుత్వం నిషేధాన్ని ఎత్తేసింది. అయినా కూడా, తన ప్రతిజ్ఞకి తానే విలువ లేకుండా చేసుకున్న సంఘ్ పరివార్, రాజ్యాంగానికి విరుద్ధంగా కార్యకలాపాలు నిర్వహిస్తూనే ఉంది. దేశాన్ని ముక్కలు చేయడంలో నాడు ఆర్.ఎస్.ఎస్ ముఖ్య భూమికను పోషించింది. విభజన తర్వాత కూడా దేశంలో అశాంతి నెలకొల్పుతూనే ఉంది. స్వాతంత్యోద్యమంలో కలిసి పోరాడిన హిందూ, ముస్లింల మధ్య ద్వేషాన్ని రగిలించి, మత కలహాలు సృష్టించింది. ప్రస్తుతం కూడా ఇంకా ఆ ప్రయత్నంలోనే ఉంది. స్వాతంత్ర్యం సాధించుకుని 77 ఏళ్ళు పూర్తయినా ఆర్.ఎస్.ఎస్ మాత్రం అభివృద్ధి నిరోధక శక్తిగానే ఉంది.

దేశమంతా క్విట్ ఇండియా ఉద్యమం ఉధృతంగా సాగుతూ ఉంటే... అందులో పాల్గొనగూడదని తన సంఘ్ పరివార్ సభ్యులకు గోల్వాల్కర్ పిలుపునిచ్చాడు. అది కొంతవరకు పని చేసింది. ఫలితంగా "1942లో బ్రిటీష్ వ్యతిరేక తిరుగుబాటును అణచివేయడంలో రాష్ట్రీయ స్వయం సేవకులు అందించిన తోడ్పాటు చాలా గొప్పది" అని నాటి బ్రిటీష్ ప్రభుత్వం బొంబాయిలో ఆర్.ఎస్.ఎస్ కు ఒక ప్రశంసా పత్రం అందించింది. ఇవి చరిత్రలోని వాస్తవాలు! ప్రస్తుత పరిస్థితుల్లో కూడా ఆర్.ఎస్.ఎస్ - బిజెపి ఆ మూల సూత్రాలతోనే పని చేయడం మనం చూస్తూనే ఉన్నాం. ఆర్.ఎస్.ఎస్ చరిత్రను గ్రంథస్థం చేసిన సి.పి.బిషకర్ పుస్తకం చదివినా ఈ విషయాలన్నీ తెలుస్తాయి. హిట్లర్, ముస్సోలినీల భావజాలాన్ని సంఘ్ పరివార్ ప్రముఖులు ఇష్టపడేవారని తెలియజేసింది ఈయనే! గాంధీజీ హత్య నేపథ్యంలో 1948 ఫిబ్రవరి 4న ఆర్.ఎస్.ఎస్ ఈ దేశంలో నిషేధానికి గురైంది. అప్పుడు భారత రాజ్యాంగానికి విధేయులమై ఉంటామనీ, జాతీయ పతాకాన్ని గౌరవిస్తామని ప్రతిజ్ఞ చేసి, గోల్వాల్కర్ నేతృత్వంలో 1949 ఏప్రిల్ 11న నిషేధాన్ని ఎత్తివేయాల్సిందిగా అభ్యర్థిస్తూ ఆర్.ఎస్.ఎస్ ప్రాధేయ పడింది.

భారత రాజ్యాంగం పట్ల ఆర్.ఎస్.ఎస్ కు ఎలాంటి అభిప్రాయముందో చూద్దాం! వారి అధికారిక పత్రిక 'ఆర్గనైజర్' 1949 నవంబర్30 సంచికలో ఇలా ప్రకటించుకుంది. "భారత దేశానికి కొత్తగా రాజ్యాంగం రాయాల్సిన అవసరమే లేదు. పురాతన కాలంలో మనువు రాసిన గొప్ప గొప్ప సూత్రాలు మనకు ఉండనే ఉన్నాయి. నేటి రాజ్యాంగంలో వాటి ప్రస్తావన లేకపోవడం విచారించదగ్గ విషయం. ప్రపంచానికి దారి చూపగల 'మనుధర్మ శాస్త్రం' ఈ రాజ్యాంగ నిపుణులకు కనీసం గుర్తుకు రాకపోవడం-ఈ దేశం చేసుకున్న దౌర్భాగ్యం!" అన్న ఆర్.ఎస్.ఎస్ అంతటితో ఆగలేదు. 1950 ఫిబ్రవరి6 సంచికలో "హృదయాలను పరిపాలించే మనువు" శీర్షికతో ఒక వ్యాసం ప్రచురించింది. అందులో ఇలా ఉంది-"ఈ దేశంలో మనువుకు రోజులు చెల్లిపోయాయి-అని డా.బి.ఆర్.అంబేద్కర్ బొంబాయిలో అన్నట్టు తెలిసింది. కానీ, అది జరగని పని! దాన్ని జరగనివ్వం కూడా!! ప్రతి హిందువు మనసులో మనువు ఎల్లప్పుడూ ఉంటాడు. మనువు సూత్రాలు జన జీవితంలో కొనసాగుతాయి. శూద్రులు కూడా మనువును పూజిస్తారు. సమానత్వం గనక ఆచరణలోకి వస్తే, దేశం బలహీన పడుతుంది. వ్యక్తులు దుర్బలులవుతారు."

1950 జనవరి 26న రాజ్యాంగాన్ని ఆమోదించిన సందర్భంలో బాబా సాహెబ్ అంబేద్కర్ "మన రాజ్యాంగం దేశంలో సమానత్వాన్ని సాధిస్తుంది" అన్నందుకు ఆర్.ఎస్.ఎస్ పై విధంగా స్పందించింది. రాజ్యాంగ వ్యతిరేకతను బాహాటంగా ప్రకటించింది. తమకు మనుధర్మ శాస్త్రమే అనుసరణీయమని చెప్పుకుంది. అందుకే చూడండి. బలహీన వర్గాలు ఆర్.ఎస్.ఎస్ కోసం ఎన్ని త్యాగాలు చేసినా, దాని అధినేతలుగా కేవలం బ్రాహ్మణులే కొనసాగుతూ ఉండడం ఇప్పటికీ మనం చూస్తున్నాం. స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనేవారిని అడ్డగించి, ఎంతో మంది దేశభక్తుల మరణానికి ప్రత్యక్షంగా పరోక్షంగా కారణమైన ఆర్.ఎస్.ఎస్ వారు, తమకు తాము దేశ భక్తులమని ప్రకటించుకోవడాన్ని ఈ దేశ ప్రజలు అంగీకరిస్తారా? గాంధీజీ హంతకుడికి, తమ సంస్థకు ఎలాంటి సంబంధమూ లేదని ఆనాడు ప్రకటించుకుని తర్వాత కాలంలో నాథూరామ్ గాడ్సేను ఎందుకు ఆరాధిస్తున్నారూ? ఇవన్నీ చూస్తే, దేశంలో హిందుత్వ ఉగ్రవాదం పెచ్చరిల్లిపోవడానికి, దేశ ఆర్థిక ప్రగతి దిగజారుతూ పోవడానికి, అతి పెద్ద ఆర్థిక నేరగాళ్ళు దేశం విడిచి పారిపోవడానికీ ఆర్.ఎస్.ఎస్-బిజెపి లే కారణమని ఈ దేశ ప్రజలు అర్థం చేసుకున్నారు. తీవ్రవాదులు, దేశ ద్రోహులూ కలిసి తమను తాము 'దేశభక్తులు'గా ప్రకటించుకుంటుంటే అసహ్యంగా ఉంది. పైగా దేశభక్తులు ఎవరన్నది వారే నిర్ణయిస్తుండడం వికృతాల్లోకెల్లా వికృతం. వీరు దేశభక్తి-అనే పదానికి అర్థమే మార్చేశారు. వారి కుట్రలను ఛేదించడం ఈ దేశ ప్రజల తక్షణ కర్తవ్యం!

భిన్నత్వంలో ఏకత్వం సాధించుకున్న ఈ దేశం, తన అస్థిత్వాన్ని కోల్పోక ముందే దేశ ప్రజలు అప్రమత్తులై సమాయత్తమవ్వాలి. ఈ దేశాన్ని సర్వ హిత, సమ భావంతో సమున్నతంగా నిలుపుకోవాలి!

/ వ్యాసకర్త సుప్రసిద్ధ సాహితీవేత్త, జీవ శాస్త్రవేత్త /

వెంకయ్య ఉచితానుచితాలు

అవీ ఇవీ

పీపీ

వినే వాడుంటే ఇంగ్లీషులో హరికథ చెప్పాడట వెనకటికొకడు. మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడుది ఆ కళలో అందె వేసిన చేయి. ఛాన్సు దొరికితే చాలు. సుభాషితాలు గుమ్మరించి వదులుతారు. తాను రాజకీయాల్లో లేనంటూనే రాజకీయాల్లో ముంచి తేల్చేస్తారు. వారి తాజా నీతి శతకం ప్రభుత్వాల ఉచిత పథకాలపై సాగింది. ఏమంటే పాలకులు చేపల్ని పట్టుకోవడం నేర్పాలిగానీ వాటిని చేతిలో పెట్టకూడదట. అలా అయితే జనం సుఖానికి అలవాటై రేపు మరింత వెరైటీ చేప జాతి కోరతారట. ఇంతకూ ఆయన చంద్రబాబు ప్రభుత్వాన్ని ఉద్దేశించి అన్నారని వైసిపి మీడియా మురిసిపోయి బోలెడు ఇదిగా ప్రచురించింది. అందులోనే ఆయన గత అంటే తమ ప్రభుత్వంపై విసుర్లు విసిరినా పట్టించుకోకుండా అవతలివారిని తిట్టినందుకే ఆనందం వెళ్లగక్కింది. సరే 'నమస్తే తెలంగాణ' పత్రికనేమో అవన్నీ రేవంత్ రెడ్డి సర్కారుపై విమర్శలని వివరించింది. అందం చూసే కళ్లలో వుంటుందన్నట్టు ఎవరి చూపు వారిది, ఇంతకూ వెంకయ్య నాయుడుకు పెన్షన్లు, ఫీజు రీఇంబర్సుమెంట్లు, ఆరోగ్యశ్రీలు ఏవి అనుచితంగా కనిపిస్తున్నాయట? లేడీస్‌కు ఉచిత బస్సు గురించి ఆయన మాట్లాడారని కొన్ని మీడియాల నివేదిక. ఏమైతేనేం! ప్రజలకు సహాయపడేందుకు ప్రభుత్వాలు కాస్త ఉపశమనం ఇవ్వడం ఉచితం కాదా? గత రెండు రోజులలో ప్రజాశక్తి ఒక్కటి చూసినా ఉత్తరాంధ్రలో ప్రజలు ఎంత ఆగ్రహంతో విరుచుకు పడ్డారో కనిపిస్తుంది. నెల్లూరు, అనంతపురం జిల్లాలలో రూ.వేల కోట్ల విలువైన భూములను కార్పొరేట్లకు కట్టబెట్టడం తెలుస్తుంది. అసలు 99 పైసలకు ఎకరా అని అధికారికంగా ప్రకటించారే? ఇప్పుడు మెడికల్ కాలేజీల పిపిపి లోనూ అదే తంతు జరుగుతున్నదే? బ్యాంకులు బడా బాబుల రూ.లక్షల కోట్ల బాకీలు మాఫీ మంత్రం పాడేస్తున్నాయే? కానీ మాజీ ఉ.రా గారికి అవన్నీ ఉచితమే. ఎటొచ్చీ పేదలకు ఆదుకోవడమే అనుచితమట. నమో వెంకటేషా అనుకోవడమే.



దేవుడు విసిరిన చెప్పు!

'దేవుడు చేసిన పెళ్లి ఇది...' అని ఓ పాట వుండేది వెనకటికి. అలాగే 'దేవుడు విసిరిన చెప్పు ఇది...' అని పాడుతున్నాడు రాకేశ్ కిశోర్. అదేనండీ..! మొన్న అత్యున్నత న్యాయస్థానంలో గౌరవ ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై చెప్పు విసిరిన చాందస హిందూత్వకుడు. తానేం చేశానో తనకే తెలియదట. సనాతన ధర్మానికి ఆయన చేసిన అపచారానికి గాను ఉన్నఫళాన అలా చేసేశాడట. ఇంతకూ ఆయన సొసైటీ ఎన్నికల్లో పోటీ చేసినపుడు తప్ప మరే విధంగానూ ఎవరికీ తెలియని ఘనుడట. 'నేను పెద్దగా కనిపించేవాణ్ని కాదు. కేవలం సనాతనం మీద భక్తితోనే ఈ పని చేశాన'ని గొప్పగా చెప్పుకున్నాడు ఇసుమంత కూడా పశ్చాత్తాపం లేని ఆ రాకేశుడు. కాగా ఆయన ధైర్య సాహసాలకు మురిసిపోయి కితాబులు కురిపించారు బెంగళూరు మాజీ పోలీసు కమిషనర్, ప్రస్తుత బిజెపి నేత భాస్కరరావు. చట్ట రీత్యా తప్పయినా సరే ఈ 70 ఏళ్ల పైబడిన వయసులో మీరు అంత ధైర్యంగా దాడి చేసినందుకు అభినందిస్తున్నానంటున్నారు. ఇకపోతే ఎ.పి ఉప ముఖ్యమంత్రి 'హరిహర వీరమల్లు' పవన్ కల్యాణ్ గారేమో ఉద్వేగాలను అదుపులో పెట్టుకోవాలని సూచించారు. నామకార్థంగా ఖండిస్తూనే ఈ దాడిలో సహేతుకమైన ఉద్వేగాన్ని చూడటం ఏం సంకేతమిస్తుంది? అలాంటి విషయాల్లో ఉద్వేగం ఏంటి ఉన్మాదం తప్ప! కాని వీరమల్లు కదా ఆయనకు భావోద్వేగమే కనిపించింది. అంటే అక్కడ చెప్పు విసరడం తప్ప మిగిలింది రైటేనన్నమాట. ఈ తరహాలో కామెంట్లు చేసిన బిజెపి నేతలు మరెందరో. అయితే ఇంత దాడి జరిగినా యథావిధిగా విచారణలు కొనసాగించి వదిలేయమని చెప్పిన సిజెఐ సంయమనాన్ని చాలా పత్రికలు ప్రశంసించాయి. సుప్రీంకోర్టు రిజిస్ట్రార్ రాకేశ్ కిశోర్‌పై ఫిర్యాదు ఇవ్వడానికి కూడా సిద్ధపడలేదట. కాకుంటే బార్ కౌన్సిల్ మాత్రం ఆయనను ప్రాక్టీసు నుంచి బహిష్కరించింది.

సంధ్యాకాంతుల నర్తకీమణి

వి.శాంతారాం కళా స్రష్ట. ఆయన చిత్రాలలో సంగీత నృత్యాలు, రంగులు మరో లోకానికి తీసుకెళతాయి. సంస్కరణ, సంస్కారం, మత సామరస్యంతో సామాజిక స్పృహ తొంగి చూస్తుంటుంది. 'దో ఆంఖే బారా హాత్' వంటి చిత్రంతో జైళ్ల సంస్కరణలను కూడా ప్రతిపాదించిన ప్రతిభాశాలి. పైగా తనే హీరో. జల్ బిన్ మచిలీ, నృత్య బిన్ బిజిలీ (నీళ్ల లేని చేప, నృత్యం చేయని మెరుపు), పింజర, నవరంగ్, ఝనక్ ఝనక్ పాయల్ బాజే వంటి చిత్రాలతో శాంతారాం చెరగని ముద్ర వేశాడు. ఇంతకూ ఈ చిత్రాల్లో నాయికగా నటించిన నృత్య గీతాలతో అలరించిన మెరుపు తీగే సంధ్య, తన 94వ ఏట గత వారం మరణించారు. శాంతారాం చిత్రాలలో మాత్రమే నటించిన ఆమె అభినయం చూడటానికి విదేశీ దర్శకులు కూడా ఎంతో ఆసక్తి చూపేవారట. 1958 బెర్లిన్ చిత్రోత్సవంలో 'దో ఆంఖే బారా హాత్' ప్రదర్శనకు ప్రత్యేకంగా వచ్చేవారట. శాంతారాం చిత్రాలు మానేశాక ఆమె నృత్యంపై కేంద్రీకరించి మరింత పట్టు సాధించారు. 'ఝనక్ ఝనక్ పాయల్ బాజే' లో ఆమెతో పాటు ప్రఖ్యాత నృత్య కళాకారుడు గోపీకృష్ణ నటించారు. ఒక కవి కల్పన ఆధారంగా రూపొందిన 'నవరంగ్'లో తల మీద వరుస కుండలు పెట్టుకుని నాట్యం చేయడమేగాక అర్ధనారీశ్వర వేషంలో అలవోకగా రెండింటినీ అభినయించడం ఆశ్చర్యం నింపింది. నిరతం తన ఊహల్లో కదిలే ప్రియతమ సుందరిని వర్ణిస్తూ పతాక సన్నివేశంలో హీరో పాడే 'ఆదా హై చంద్రమా రాత్ ఆది..ములాఖాత్ ఆది' పాట ఆల్ టైమ్ హిట్. సంధ్య తండ్రి కూడా రంగస్థల నటుడే. 'అమర్ భూపాలి' చిత్రంలో నూతన నటి కోసం అన్వేషిస్తున్నపుడు విజయా దేశ్‌ముఖ్ ఆయనకు పరిచయమై ఆ పేరుతో ప్రేక్షకులకు చేరువయ్యారు. శాంతారాం ఆమెను తృతీయ వివాహం చేసుకున్నారు. శాంతారాం సృజనకు ప్రాణ ప్రతిష్ట చేసిన నటిగా సంధ్య చిరకాలం గుర్తుండిపోయారు. నిజానికి ఆ పాత్రలు ఆమె చేయకపోతే ఆ చిత్రాలు అంత చిరస్మరణీయమయ్యేవి కావు.

వారి తాజా నీతి శతకం ప్రభుత్వాల ఉచిత పథకాలపై సాగింది. ఏమంటే పాలకులు చేపల్ని పట్టుకోవడం నేర్పాలిగానీ వాటిని చేతిలో పెట్టకూడదట. అలా అయితే జనం సుఖానికి అలవాటై రేపు మరింత వెరైటీ చేప జాతి కోరతారట.... ప్రజలకు సహాయపడేందుకు ప్రభుత్వాలు కాస్త ఉపశమనం ఇవ్వడం ఉచితం కాదా? గత రెండు రోజులలో ప్రజాశక్తి ఒక్కటి చూసినా ఉత్తరాంధ్రలో ప్రజలు ఎంత ఆగ్రహంతో విరుచుకు పడ్డారో కనిపిస్తుంది. నెల్లూరు, అనంతపురం జిల్లాలలో రూ. వేల కోట్ల విలువైన భూములను కార్పొరేట్లకు కట్టబెట్టడం తెలుస్తుంది. అసలు 99 పైసలకు ఎకరా అని అధికారికంగా ప్రకటించారే? ఇప్పుడు మెడికల్ కాలేజీల పిపిపి లోనూ అదే తంతు జరుగుతున్నదే? బ్యాంకులు బడా బాబుల రూ.లక్షల కోట్ల బాకీలు మాఫీ మంత్రం పాడేస్తున్నాయే? కానీ మాజీ ఉ.రా గారికి అవన్నీ ఉచితమే. ఎటొచ్చీ పేదలకు ఆదుకోవడమే అనుచితమట.

కవిత్వం

అయ్యో.. రైతన్నా..!

అరువు ఉరిమి చూసింది
బతుకు బరువై పోయింది
విత్తనం తేలికై పోయింది
చేను విగతలా మారిపోయింది.

కలుపు మొక్క వెక్కిరించింది
కౌలు రైతుకు కాలు బెనికింది
రాళ్ళు రప్పల సంఖ్య పెరిగింది
చెట్టు లేక గుట్ట చిన్నబోయింది.

ఎరువు లేని మొలక తల్లడిల్లింది
కరువు రాక్షసి పొంచి చూస్తోంది
సత్తువ లేని నేల సాగిలపడింది
గిట్టుబాటు మొహం తిప్పుకుంది.

వానతో ఏరు పరుగులు పెట్టింది
ఊపిరాడక పంట ఒరిగిపోయింది
కాలు కదపని రైతు కన్నీరొలికింది
బీడు చేను బాధ అంతకంతైంది.

రెక్కాడినా రైతుకు ఫలితం లేకుంది
డొక్క నిండని బతుకు కూలబడింది
పొలాన్ని నమ్మిన హలం ఏడ్చింది
దుక్కి దున్నకం లేక కుప్పకూలింది.

నేటి రైతు లోకానికి
చెప్పలేని మూగవేదనే వరమైంది
దిక్కుతోచని బాధే వలయమైంది
కర్మ తెగని సేద్యమే శాపమైంది
అంటి ముట్టని పంట కొరివైంది
రైతు ఆశ ఎండమావైంది.

- నరెద్దుల రాజారెడ్డి,
సెల్ : 9666016636

సుప్రీంకోర్టు సుమోటోగా తీసుకోవాలి

- రాష్ట్రపతి జోక్యం చేసుకోవాలి
- హర్యానాలో ఐపిఎస్ అధికారి ఆత్మహత్యపై ఎఐఎడబ్ల్యుయు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

హర్యానాలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఐపిఎస్ అధికారి వై.పూరన్ కుమార్ ఆత్మహత్య ఘటనను సుప్రీంకోర్టు సుమోటోగా తీసుకోవాలని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం (ఎఐఎడబ్ల్యుయూ) ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ డిమాండ్ చేశారు. గురువారంనాడిక్కడ ఆయన మీడియాతో మాట్లాడారు. పూరన్ కుమార్ ఆత్మహత్య ఘటనను తీవ్రంగా ఖండించారు. "ఒక ఉన్నత స్థాయి పోలీసు అధికారి, రాజ్యాంగం అమలు చేయాల్సిన బాధ్యత ఉన్న వ్యక్తిపైనే కుల వివక్ష, హింస, అవమానం జరుగుతుంటే, ఈ దేశంలో సామాన్య దళితులు, గిరిజనలు, పేదలు, కార్మికులు ఏ రక్షణలో ఉన్నారు? ఇది దేశపు లౌకిక, రాజ్యాంగ విలువలపై బహిరంగ దాడి" అని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఘటన యాదృచ్ఛికం కాదనీ, ఇది మనువాద పాలనకు ప్రతిబింబమని విమర్శించారు. బిజెపి పాలనలో ఆధిపత్య కులాలు పోలీసు – న్యాయ వ్యవస్థల్లో, పరిపాలనలో తెగబడి, దళిత అధికారులపై, ప్రజా ప్రతినిధులపై దాడులు చేయడం రోజువారీ వ్యవహారమైపోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్యాంగాన్ని బలహీనపరుస్తున్నారని అన్నారు.

డిమాండ్లు

1. దళిత అధికారి మరణంపై సుప్రీంకోర్టు తక్షణం సుమోటోగా విచారణ ప్రారంభించాలి.
2. భారత రాష్ట్రపతి దేశ రాజ్యాంగ అధ్యక్షురాలిగా తక్షణ జోక్యం చేసుకొని న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలి.
3. ఆ అధికారి రాసిన 9 పేజీల సూసైడ్ నోట్ వెంటనే బహిరంగ పరచాలి.
4. ఆ నోట్‌లో పేర్లున్న అధికారులను, రాజకీయ నాయకులను వారి పదవుల నుంచి తొలగించి వెంటనే అరెస్ట్ చేయాలి. వారి ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి.
5. హర్యానా ప్రభుత్వం, కేంద్రంలోని బిజెపి పాలకులు బాధ్యత వహించాలి.
6. ఎస్‌సి కమిషన్ వెంటనే అన్ని చర్యలూ తీసుకోవాలి.

అయోధ్యలో పేలుడు

- ఇల్లు కూలి ఐదుగురు మృతి

అయోధ్య : ఉత్తర ప్రదేశ్‌లోని అయోధ్య పగ్లా భరి గ్రామంలో గురువారం పేలుడు సంభవించడంతో ఇల్లు కూలి ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. పలువురు గాయపడ్డారు. గ్యాస్ సిలిండర్ పేలడంతో ఈ ప్రమాదం సంభవించి ఉండవచ్చునని స్థానిక అధికారి దేవేష్ చతుర్వేది తెలిపారు. ప్రమాదం ఎలా జరిగిందన్న విషయంపై ఇంకా నిర్ధారించలేదు. ఈ సంఘటన గురించి సమాచారం అందిన వెంటనే, పోలీసులు, అగ్నిమాపక శాఖ, స్థానిక అధికారుల బృందాలు సంఘటనా స్థలానికి చేరుకున్నాయి. "పేలుడులో ఐదుగురు మరణించారు, మరికొందరు గాయపడ్డారు, చిక్కుకున్న వారిని రక్షించే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి" అని మరో అధికారి శైలేంద్రసింగ్ తెలిపారు. ముందు జాగ్రత్త చర్యగా సమీపంలోని ఇళ్లను ఖాళీ చేయించారు. ప్రమాద స్థలం నుండి దూరంగా ఉండాలని స్థానికులకు అధికారులు విజ్ఞప్తి చేశారు.

వాణిజ్య ఒప్పందంతో ఉద్యోగాల సృష్టి

- బ్రిటన్ ప్రధాని స్టార్మర్



ముంబయి : భారతదేశంతో వాణిజ్య ఒప్పందం యునైటెడ్ కింగ్డమ్ (యుకె) నాయకత్వాన్ని మరింత బలోపేతం చేస్తుందని, ఉద్యోగాలు సృష్టించబడతాయని బ్రిటన్ ప్రధానమంత్రి కీర్ స్టార్మర్ పేర్కొన్నారు. జులైలో భారత ప్రధాని మోడీ బ్రిటన్ పర్యటన సందర్భంగా ఇరు దేశాల మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదిరిన విషయం తెలిసిందే. దానిలో భాగంగా వివిధ రంగాలకు చెందిన వందమందికిపైగా ప్రముఖులతో కలిసి భారత్‌లో పర్యటిస్తున్న ఆయన గురువారం ముంబయిలో ప్రధాని మోడీతో భేటీ అయ్యారు. టెక్నాలజీ, లైఫ్ సైన్స్, పునరుత్పాదక శక్తి, అధునాతన కమ్యూనికేషన్లు, కృత్రిమ మేధస్సు వంటి కీలక పరిశ్రమల్లో బ్రిటన్ నైపుణ్యం పెంచడానికి ఈ ఒప్పందం దోహదపడుతుందని స్టార్మర్ తెలిపారు. ఈ ఒప్పందం దీర్ఘకాలిక అవకాశాలు, విశ్వాసం, అధిక నైపుణ్యం కలిగిన రంగాల్లో ఉద్యోగాలను సృష్టించేందుకు వీలు కల్పిస్తుందని అన్నారు. తాజా ఒప్పందంతో టెక్ స్టార్టప్‌లు, ఇన్నోవేషన్ సెంటర్లు, అధునాతన కమ్యూనికేషన్‌లు, ఎఐ టెక్నాలజీ అభివృద్ధికి పెట్టుబడులు వస్తాయని భారత పారిశ్రామిక శ్రేణులు ప్రచారం చేస్తున్నాయి. యూరోపియన్ యూనియన్‌తో బ్రిటన్ తెగతెంపులు చేసుకున్న తరువాత ఇదే పెద్ద వాణిజ్య ఒప్పందం.

భారత్‌కు నష్టం!

తాజా ఒప్పందం భారత్‌కు నష్టదాయకమని పలువురు అభిప్రాయపడుతున్నారు. భారత వ్యవసాయ రంగం ఒత్తిడికి గురౌతుందని, యూకె దిగుమతుల పోటీతో దేశీయ మార్కెట్ కుదేలవుతుందని, ప్రభుత్వ మద్దతు లేకపోతే మార్కెట్‌లో చిన్న పరిశ్రమలు నిలబడటం కష్టమవుతుందని, వస్త్ర, ఆభరణాల రంగాలపై తీవ్ర ప్రభావం పడుతుందని పలువురు విశ్లేషకులు భావిస్తున్నారు.

ఆఫ్ఘన్ విదేశాంగ మంత్రి రాక

న్యూఢిల్లీ : భారత పర్యటనలో భాగంగా ఆఫ్ఘనిస్తాన్ విదేశాంగ మంత్రి అమీర్ ఖాన్ ముత్తాఖీ గురువారం న్యూఢిల్లీ చేరుకున్నారు. అష్రఫ్‌ఘనీ ప్రభుత్వాన్ని కూల్చివేసి తాలిబన్లు ఆఫ్ఘనిస్తాన్‌లో తాలిబన్లు అధికారాన్ని చేజిక్కించుకున్న తర్వాత.. కాబూల్ నుండి ఇది మొదటి ఉన్నతస్థాయి పర్యటన కావడం గమనార్హం. ఆరు రోజుల పర్యటనలో భాగంగా విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్‌తో భేటీ కానున్నారని సంబంధిత వర్గాలు తెలిపాయి. ముత్తాఖీ దారుల్ ఉలూమ్ దేవ్‌బంద్ సెమినరీ, తాజ్ మహల్‌ను సందర్శించనున్నట్లు పేర్కొన్నాయి.

న్యూఢిల్లీ చేరుకున్న ఆఫ్ఘన్ విదేశాంగ మంత్రి ముత్తాఖీకి స్వాగతం పలుకుతున్నట్లు విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ సోషల్‌మీడియాలో పేర్కొన్నారు. ద్వైపాక్షిక సంబంధాలు, ప్రాంతీయ సమస్యలపై ఆయనతో చర్చలు జరపనున్నామని అన్నారు.

కర్ణాటకలో మహిళా ఉద్యోగులకు గుడ్‌న్యూస్

బెంగళూరు : కర్ణాటకలో మహిళా ఉద్యోగులకు అక్కడి ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. మహిళా ఉద్యోగులకు నెలకు ఒక వేతనంతో కూడిన రుతుక్రమ సెలవును మంజూరు చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ నిర్ణయాన్ని ఆమోదిస్తూ రాష్ట్ర కేబినెట్ గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయాలు, వస్త్రపరిశ్రమలు, బహుళ జాతి కంపెనీలు, ఐటి సంస్థలు, ఇతర ప్రైవేట్ రంగ సంస్థల్లో పనిచేసే మహిళా ఉద్యోగులకు ఈ సెలవు వర్తించనుంది. రుతుక్రమ సమయంలో ఆరోగ్యం గురించి అవగాహన కల్పించడం, మహిళా ఉద్యోగులకు శారీరక, మానసికంగా సౌకర్యవంతమైన వాతావరణాన్ని కల్పించడాన్ని లక్ష్యంగా పెట్టుకున్నట్లు కేబినెట్ పేర్కొంది. ఇప్పటికే కేరళ, బీహార్, ఒడిశా, సిక్కిం మహిళలకు రుతుక్రమ సెలవును మంజూరు చేస్తున్నాయి.

అప్పుల వేటలో రాష్ట్రం

- సెక్యూరిటీల వేలం.. సంస్థలతో రుణాలు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

ఇప్పటికే పెద్దఎత్తున అప్పుల మధ్య కూరుకుపోయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం కొత్త రుణాల కోసం వెదుకులాట కొనసాగిస్తోంది. సెక్యూరిటీల వేలం ఒక వైపు కొనసాగిస్తూ మరోవైపు ఇతర మార్గాలనుకూడా అన్వేషిస్తోంది. దీనికోసం త్వరలోనే కీలక సమావేశాన్ని నిర్వహించే ఆలోచనలో కూడా రాష్ట్ర ప్రభుత్వం ఉన్నట్లు సమాచారం. ప్రతి మంగళవారం రిజర్వుబ్యాంకు వద్ద ప్రభుత్వ సెక్యూరిటీలను వేలంపెట్టి తీసుకువస్తున్న రుణాలు కూడా ఏ మూలకూ చాలకపోవడంతో ఇతర ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాల్సి వస్తోంది. ఇప్పటికే ఈ రంగం ద్వారా 80 శాతం వరకు రుణాలను తీసుకున్న ఆర్థికశాఖ మరో 11,900 కోట్ల కోసం దరఖాస్తు చేసుకుంది. ఇవి కూడా చాలని పరిస్థితి నెలకొనడంతో శాఖల ద్వారా రుణాలు సేకరించడం, శాఖల ద్వారా పన్నుల ఆదాయాన్ని పెంచుకోవడంపైనా దృష్టి సారిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే బడ్జెట్ అంచనాల్లో 80 శాతం వరకు రుణాలను వినియోగించుకోగా, మూడో త్రైమాసికంలో వినియోగించుకునే రుణాలతో కలిపి 95 శాతానికి రుణం చేరుకుంటుంది. వార్షిక బడ్జెట్లో 79,926 కోట్ల రుణాలను తీసుకోవాలని రాష్ట్ర ఆర్థికశాఖ ప్రతిపాదించింది. ఇందులో సెప్టెంబర్ వరకు 64,800 కోట్ల రుణాలను మార్కెట్ బారోయింగ్స్ ద్వారా సేకరించింది. ఇప్పుడు అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు 11,900 కోట్లు సేకరించాలని ఇండెంట్ దాఖలు చేసింది. దీంతో మొత్తం రుణాలు 76,700 కోట్లకు చేరుకుంది. అంటే చివరి త్రైమాసికం (జనవరి నుంచి మార్చి వరకు)లో కేవలం 3,226 కోట్లు మాత్రమే తీసుకునేందుకు ఆస్కారం ఉంటుంది. తాజా ఇండెంట్ మేరకు అక్టోబర్ 7న 1,900 కోట్ల రుణానికి వెళ్లగా, ఇదే నెల 28వ తేదీన ఐదు వేల కోట్లు, నవంబర్ 25న మరో ఐదు వేల కోట్లకు రుణ ఇండెంట్ దాఖలు చేయడం విశేషం. త్రైమాసికంలో చివరి నెల డిసెంబర్లో మాత్రం రుణానికి వెళ్లకూడదని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం విశేషం.

ఇక సంస్థల నిధులపైనే

ఇతర రుణాలపై ఆశలు సన్నగిల్లుతున్న తరుణంలో ఇక ప్రభుత్వ రంగ సంస్థల ఆదాయం, అవి తీసుకునే రుణాలపైనే ప్రభుత్వం ఆశలు పెంచుకుంటోంది. వివిధ ప్రభుత్వ రంగ సంస్థలను రుణాలు తీసుకునేలా ప్రోత్సహించి, ఆ మొత్తాన్ని ప్రభుత్వ అవసరాలకు వాడుకోవాలని ఆర్థికశాఖ యోచిస్తున్నట్లు సమాచారం. ప్రధానంగా ఇంధనశాఖ, నీటిపారుదల, పౌర సరఫరాలశాఖ, రోడ్లు భవనాలు, గృహ నిర్మాణ శాఖ వంటి వాటి ద్వారా ఆఫ్ బడ్జెట్ రుణాల సేకరణకు ఆలోచన చేస్తున్నట్లు తెలిసింది.

త్వరలోనే మరింత పరోక్ష పన్నుపోటు

ఆదాయాన్ని మరింత పెంచుకునే ఆలోచనలో ఉన్న ప్రభుత్వం త్వరలోనే ప్రజలపై పన్నుల భారాన్ని మోపే అవకాశాలున్నట్లు కనిపిస్తోంది. అయితే ప్రత్యక్ష పన్నులు కాకుండా పరోక్షంగా పన్నుల ఆదాయాన్ని పెంచుకునేందుకు ఇప్పటికే కసరత్తు ప్రారంభమైనట్లు సమాచారం. అదనంగా సెస్సుల భారం పడే పరిస్థితి ఉందని అంటున్నారు. ప్రధాన ఉత్పత్తి దారులపై విధించే పన్నులతోపాటు, వినోదపు పన్ను వంటివాటిపైనా దృష్టి సారించే అవకాశాలు ఉండవచ్చునని అంటున్నారు. ఉత్పత్తిదారులపై పన్నులు పెంచితే దాని ప్రభావం వల్ల రిటైల్ ధరల్లో మార్పులు ఉండవచ్చునని వాదన కూడా ఉంది. ఈ పరిస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి నిర్ణయాలు తీసుకుంటుందో వేచి చూడాలి.



విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

ప్రజాశక్తి- ముదినేపల్లి(ఏలూరు జిల్లా)

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని బొమ్మినంపాడులో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమగోదావరి జిల్లా ఉండి మండలం గోరింతోట చెందిన ఒలిగేటి యేసురాజు(35) ముదినేపల్లి మండలం బొమ్మినంపాడులో రొయ్యల చెరువు వద్ద పనిచేస్తున్నాడు. ఉదయం కరెంటు మోటార్ పనిచేయకపోవడంతో సరిచేస్తుండగా షాక్‌కు గురై ప్రాణాలు కోల్పోయాడు.

ఎస్‌సి, ఎస్‌టి అత్యాచార బాధితులకు సకాలంలో పరిహారం

- 3 నెలలకోసారి మానిటరింగ్ కమిటీ సమావేశం
- జిల్లాకలెక్టర్లకు సిఎస్ ఆదేశం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎస్‌సి, ఎస్‌టి అత్యాచార బాధితులకు సకారంలో పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ఎస్‌సి, ఎస్‌టి అత్యాచార నిరోధకచట్టంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రతి నెల 30వ తేదీన సివిల్ రైట్స్ డేను నిర్వహించాలని సూచించారు. సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌ను సిఎస్ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి 3 నెలలకు జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశాలను నిర్వహించాలన్నారు.

ఈ సమావేశాల్లో నమోదైన కేసులు, బాధితులకు అందిస్తున్న పరిహారం తదితర అంశాలను సమీక్షించాలని ఆదేశించారు. బాధితులకు పరిహారం కింద రూ.31.54 కోట్లు విడుదల చేయగా, రూ.24.47 కోట్లే మాత్రమే చెల్లించారని మిగిలిన మొత్తాన్ని చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. సీజనల్ వ్యాధులు, మందుల పంపిణీ, ఆసుపత్రుల్లో పరిశుభ్రత, రోగ నిర్ధారణ సేవలపై తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో ... భాగంగా జిల్లా స్థాయిలో కలెక్టరేట్, డివిజన్ స్థాయిలో ఎంపిడిఓ, మున్సిపల్ స్థాయిలో కమిషనర్ కార్యాలయాల్లో ప్రత్యేకంగా సిబ్బందికి తగిన స్థలం కేటాయించాలని ఆదేశించారు. పిఎం ఆదర్శ్ గ్రామ యోజన కింద 1,174 గ్రామాలు ఎంపిక అవగా ఇప్పటికే 1,017 గ్రామాలకు గ్రామాభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయగా, మిగిలిన 157 గ్రామాలకు త్వరలో సిద్ధం చేయాలని సూచించారు. ఈ పథకానికి సంబంధించి రూ.60.50 కోట్లు విడుదలయ్యాయని సకాలంలో యుసిలు పంపితే మరిన్ని నిధులు కేంద్రం నుంచి పొందేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఇతర పలు అంశాలపై కలెక్టర్లకు సిఎస్ దిశానిర్దేశం చేశారు.

కోటి సంతకాలతో ప్రభుత్వానికి కనువిప్పు

- పోస్టర్ ఆవిష్కరణలో సజ్జల

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మెడికల్ కళాశాలల విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై వైసిపి చేపట్టిన కోటి సంతకాల కార్యక్రమం ప్రభుత్వానికి కనువిప్పు కలిగిస్తుందని వైసిపి కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసిపి చేపట్టిన కోటి సంతకాల కార్యక్రమం పోస్టర్‌ను గురువారం ఆయన తాడేపల్లిలోని వైసిపి కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సజ్జల మాట్లాడుతూ చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయిన తరువాత ప్రజావ్యతిరేక విధానాలు తప్ప అనుకూల విధానాలు అమలు చేయడం లేదని పేర్కొన్నారు. మెడికల్ కళాశాలలు పూర్తి చేసేందుకు అవసరమైన నిధులు ప్రభుత్వం వద్ద ఉన్నప్పటికీ వాటిని ప్రైవేటు వ్యక్తులకు ఎందుకు ఇవ్వాలనుకుంటున్నారో తెలియడం లేదని అన్నారు. నిర్మించకపోతే వాటిని ఏమి చేసినా ఇబ్బంది లేదని, నిర్మాణం పూర్తయి, ఫర్నీచర్, అపాయింట్‌మెంట్లు అయిన తరువాత ప్రైవేటీకరణ మాట ఎత్తడం అన్యాయమని తెలిపారు. ఉన్న నిధులను దుర్వినియోగం చేయడం తప్ప మరొకటికా దని పేర్కొన్నారు. దీనిపై రాష్ట్రంలో ఉన్న అన్ని మెడికల్ కళాశాలలను సందర్శిస్తామని చెప్పారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ అనకాపల్లి పర్యటనలో పోలీసులు ఇష్టారాజ్యంగా ఆంక్షలు పెట్టారని పేర్కొన్నారు. అయినా వేలమంది కార్యకర్తలు తరలివచ్చారని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ మొండితోక అరుణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, విజయవాడ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, విజయవాడ తూర్పు, మంగళగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జులు దేవినేని అవినాష్, వేమారెడ్డి పాల్గొన్నారు.

చెత్త నుండి విద్యుదుత్పత్తి కోసం జిందాల్, ఆంటోనీలారాతో ఒప్పందం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

చెత్త నుండి విద్యుదుత్పత్తి చేసే ప్రాజెక్టులను సైతం రాష్ట్ర ప్రభుత్వం ప్రయివేటు కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టింది. ఈ మేరకు ప్రభుత్వానికి జిందాల్, ఆంటోనీలారా సంస్థలకు మధ్య ఒప్పందం కుదిరింది. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ కార్యాలయంలో గురువారం సంబంధిత అధికారులు ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు. ఈ సందర్భంగా స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభిరామ్ మాట్లాడుతూ ఈ తరహా ప్లాంట్లు ఏర్పాటు చేయడం దేశంలో ఇదే తొలిసారి అని తెలిపారు. కర్నూలు, కడపలో ప్లాంట్ల ఏర్పాటుకు ఆంటోనీలారా సంస్థతోనూ, నెల్లూరు, కాకినాడ ప్లాంట్ల ఏర్పాటుకు జిందాల్‌తోనూ ఒప్పందాలు చేసుకున్నట్లు ఆయన చెప్పారు. నెల్లూరులో 12 మెగావాట్లు, కడప, కర్నూలు, కాకినాడలో 15 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తిని చేసేలా ప్లాంట్లు నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. 18 నెలల నుండి 24 నెలల్లోపు ప్లాంట్ల ఏర్పాటు పూర్తవుతుందని పేర్కొన్నారు. డంపింగ్‌యార్డు రహితంగా రాష్ట్రాన్ని మార్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

నెల్లూరులో 604 టన్నులు, కాకినాడలో 957, కర్నూలులో 751 టన్నుల చెత్తతో విద్యుత్ ఉత్పత్తి చేస్తామని అన్నారు. వీటితో పాటు విజయవాడలో 15 మెగావాట్లు, తిరుపతిలో 12 మెగావాట్ల సామర్థ్యంతో ప్లాంట్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించామని చెప్పారు. రాష్ట్రంలో ఉత్పత్తయ్యే 7293 టన్నుల వ్యర్థాల నుండి 119 మెగావాట్లు విద్యుత్‌ను ఉత్పత్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎమ్‌డి కుమార్‌రెడ్డి, ప్రైవేటు సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్య పరిష్కారానికి ఐక్య కార్యాచరణ

- ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ సదస్సులో వక్తలు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ప్రభుత్వ ఉద్యోగుల పెన్షన్ ఎవరి దయాదాక్షిణ్యాలతో లభించింది కాదని, అది ఉద్యోగులకు రాజ్యాంగం కల్పించిన హక్కు అని పలువురు వక్తలు పేర్కొన్నారు. గురువారం ఒంగోలులోని ఎన్‌జిఒ హోంలో ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో (ఎపిఆర్ పిఎ) సదస్సు నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్షులు జి.శేషయ్య అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ... ప్రభుత్వ రంగంలో మూడు నాలుగు దశాబ్దాల పాటు పనిచేసి రాజ్యాంగబద్ధంగా పొందుతున్న పెన్షన్‌పై పాలకవర్గాలు ఆంక్షలు విధించడం శోచనీయమన్నారు. ఉద్యోగులు సాధించుకున్న ఒపిఎస్ స్థానంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ ఇష్టానుసారంగా ఎన్‌పిఎస్, సిపిఎస్, యుపిఎస్ పేరున అమలు చేస్తామంటే పెన్షనర్లు ఏ మాత్రం సహించరని హెచ్చరించారు. ఒపిఎస్‌ను మాత్రమే అంగీకరిస్తారని స్పష్టం చేశారు. సమస్య పరిష్కారానికి ఐక్య కార్యాచరణ ప్రకటించాలన్నారు. ఎపిఆర్ పిఎ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సత్తిరాజు మాట్లాడుతూ.. ఉద్యోగుల పట్ల ప్రభుత్వాలు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నాయన్నారు. ఇపిఎఫ్ సొమ్మును షేర్ మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టే చర్యలు ఉపసంహరించాలన్నారు. స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అయ్యప్ప రెడ్డి, ప్రకాశం జిల్లా ఎన్‌జిఒ సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.శరత్ బాబు, ఆర్ సిహెచ్ కృష్ణారెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

రాయవరం ఘటనపై విచారణకు కమిటీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కోనసీమ జిల్లా రాయవరంలో చోటు చేసుకున్న బాణా సంచా పేలుడు ఘటనపై కమిటీని ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కమిటీలో మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్ కుమార్, ఐజి ఆరే రవికృష్ణను నియమించారు. ఈ కమిటీ ప్రమాదానికి కారణాలు కనుగొనడంతోపాటు, సంఘటనకు కారణమైన వ్యక్తులపై నివేదిక సమర్పించాలని, ఇటువంటి సంఘటనలు నివారించడానికి ప్రామాణిక నిర్వహణ విధానాలను సిఫార్సు చేయాలని పేర్కొన్నారు. కమిటీ వారం రోజులలోపు తన నివేదికను సమర్పించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్, ఎస్పి కమిటీకి పూర్తి సహకారం అందించాలని ఆదేశించారు. కాగా ఈ ఘటనలో 8 మంది మృతి చెందినట్లు స్థానిక అధికారులు ప్రకటించారు.

సిపిఎం నాయకులపై కేసు కొట్టివేత

ప్రజాశక్తి - కొత్తూరు

వంశధార నిర్వాసితుల పోరాటం కేసులో సిపిఎం నాయకులపై నమోదైన కేసును కోర్టు కొట్టివేసింది. 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం, ఇతర సమస్యలపై వంశధార నిర్వాసితులు 2016లో పోరాటం చేశారు. ఈ పోరాటానికి సిపిఎం నాయకులు మద్దతునిచ్చారు. దీంతో ఆ పార్టీ నాయకులు భవిరి కృష్ణమూర్తి, జి.సింహాచలం, కె.నాగమణి, సిర్ల ప్రసాద్, కె.మిన్నారావు, శంకరరావు, ఆఫీసు, ముఖలింగంపై పోలీసులు కేసు నమోదు చేశారు. వాదనలు విన్న జూనియర్ సివిల్ జడ్జి రాణి ఈ కేసును కొట్టివేస్తూ తీర్పును వెలువరించారు. సిపిఎం నాయకుల తరుపున న్యాయవాది మహంతి అప్పారావు వాదనలు వినిపించారు.

భర్త ఘాతుకం

ఏలూరు స్పోర్ట్స్: భార్యను భర్త దారుణంగా హత్యచేసిన ఘటన ఏలూరు నగరంలోని మూడో పట్టణ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. చింతలపూడి మండలం సీతానగరం ప్రాంతానికి చెందిన కంతాటి నరేష్‌కు, నాగలక్ష్మి (32)కి 15 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరు గత మూడేళ్ల నుంచి ఏలూరు నగరంలోని శనివారపుపేట హై స్కూల్ సమీపంలో అద్దెకు ఉంటున్నారు. ప్రస్తుతం నరేష్ తాపీ పనులు చేస్తూ ఉండగా నాగలక్ష్మి కొంతకాలం కర్రీ పాయింట్లను మరికొంత కాలం మిషన్ కుడుతూ సహాయంగా ఉంటుంది. కొంతకాలంగా నరేష్ నాగలక్ష్మిపై అనుమానం పెంచుకున్నాడు. ఆమె ఎవరితోనో మాట్లాడుతుందని అనుమానంతో నాగలక్ష్మి మిషన్ కుడుతున్న సమయంలో ఒక్కసారిగా కత్తెరతో ఆమెను కిరాతకంగా హత్యచేశాడు.

విద్యార్థుల కోసం పాక...

ప్రజాశక్తి-వేపాడ

విజయనగరం జిల్లా వేపాడ మండలం కరకవలస పంచాయతీ పరిధిలోని గిరిజన గ్రామం.. మారిక. ఈ గిరిశిఖర గ్రామంలోని గిరిజన చిన్నారులు చదువుకునేందుకు ఏళ్ల తరబడి మొరపెట్టుకున్నా పాఠశాల భవనం నిర్మించడం లేదు. భవనానికి నిధులు మంజూరైనా నిర్మించడం లేదు. దీంతో చెట్టు కిందే బోధన సాగించాల్సిన దుస్థితి నెలకొంది. గత, ప్రస్తుత పాలకులు వీరిని ఓటర్లుగానే చూశారు తప్ప వెనుకబాటు తనాన్ని పారదోలేందుకు, వారిని అభివృద్ధి పథాన నడిపేందుకు కనీస చర్యలు తీసుకోలేదు. ప్రభుత్వం గిరిజనుల పట్ల చూపుతున్న వివక్షత వల్ల గిరిజన చిన్నారులు చదువుకు దూరమవుతున్నారు. ఇటీవల ఉపాధ్యా యులు తాడి రాంబాబు విద్యార్థుల తల్లిదండ్రులను చైతన్యం చేశారు. ఇరువురు ఉపాధ్యాయులు కష్టపడి పిల్లలను తీర్చిదిద్దుతామని, మీరంతా సహకరించి కనీసం విద్యార్థులు కూర్చొనేందుకు, చదువు చెప్పేందుకు పాక వేయాలని కోరారు. దీంతో గిరిజనులంతా పూనుకుని కర్రలతో పాకవేశారు. ప్రభుత్వం ఎలాగూ పట్టించుకోక పోవడంతో పాకలో తమ పిల్లలు కనీసం ప్రశాంతంగా కూర్చుని చదువుకుంటారని భావిస్తున్నామని చిన్నారుల తల్లిదండ్రులు చెబుతున్నారు.

దగ్గు మందు మరణాలపై నేడు సుప్రీం విచారణ

న్యూఢిల్లీ : దగ్గు మందు వాడి మధ్యప్రదేశ్‌లో 21 మంది చిన్నారులు ప్రాణాలు కోల్పోవడంపై ఈ నెల 10న విచారించేందుకు సుప్రీంకోర్టు అంగీకరించింది. ఈ ఘటనపై జ్యుడీషియల్ కమిషన్ లేదా నిపుణుల కమిటీని ఏర్పాటు చేసి స్వతంత్ర విచారణ జరపాలని అడ్వకేట్ విశాల్ తివారీ మౌఖికంగా సిజెఐని కోరారు. దీంతో శుక్రవారం విచారించేందుకు జాబితా రూపొందించారు. చిన్నారుల మరణాల కేసులను సిబిఐకి బదిలీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రమాదక రమైన విషపదార్థం డయాథిలీన్ గైక్లోన్ ఈ మందులో మోతాదుకు మించి ఉందని తెలిపారు. ఆ స్టాక్‌ను స్వాధీనం చేసుకోవాలని, అమ్మకాలు, పంపిణీని నిషేధిం చాలని కోరారు. కంపెనీ తయారు చేసిన కోల్డ్‌రిఫ్ అమ్మకాలను తమిళనాడు, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తర ప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో ఇప్పటికే నిషేధించారు.

ఫార్మా యజమాని అరెస్టు

తమిళనాడు కాంచీపురంలోని స్రెసేశన్ ఫార్మాస్యుటికల్ కంపెనీ యజమాని జి.రంగనాథన్‌ను గురువారం కొడమ్‌బక్కమ్‌లోని ఆయన నివాసంలో మధ్యప్రదేశ్ సిట్, చెన్నై అశోక్‌నగర్‌లోని పోలీసులు సంయుక్తంగా అరెస్టు చేశారు. అనంతరం ఆయనను కాంచీపురంలోని కంపెనీ కార్యాలయానికి తీసుకెళ్లి, విచారించి పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

దిగ్భ్రాంతికి గురయ్యాం!

దాడి ఘటనపై తొలిసారి స్పందించిన జస్టిస్ గవాయ్
ఇక అది మర్చిపోయిన అధ్యాయమంటూ వ్యాఖ్య
ఇది చిన్న విషయం కాదు : జస్టిస్ భుయాన్

న్యూఢిల్లీ : ఈ వారం ప్రారంభంలో సుప్రీంకోర్టులో తనపై బూటు విసిరిన ఘటనపై మొదటిసారిగా భారత ప్రధాన న్యాయమూర్తి బిఆర్ గవాయ్ స్పందించారు. ఆ సంఘటన తనను దిగ్భ్రాంతికి గురి చేసిందని ఆయన చెప్పారు. అయితే ఇప్పుడు అది 'మరిచిపోయిన అధ్యాయం' అని ఆయన వ్యాఖ్యానించారు. ఈనెల 6వ తేదీన జస్టిస్ గవాయ్, జస్టిస్ చంద్రన్‌తో కలిసి వుండగా, ఓపెన్ కోర్టులో ఈ సంఘటన చోటు చేసుకుంది. వనశక్తి వర్సెస్ కేంద్ర ప్రభుత్వం కేసులో మే 16న ఇచ్చిన తీర్పును సమీక్షించి, సవరణలు చేయాలని కోరుతున్న పిటిషన్లపై గురువారం ప్రధాన న్యాయమూర్తి గవాయ్ నేతృత్వాన జస్టిస్ ఉజ్జల్ భుయాన్, జస్టిస్ కె.వినోద్ చంద్రన్‌లతో కూడిన బెంచ్ విచారిస్తున్న సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేశారు. "సోమవారం జరిగిన దాడి ఘటనతో నా సోదరుడు జస్టిస్ చంద్రన్, నేను బిత్తరపోయాం.... మా వరకు అది మర్చిపోయిన అధ్యాయం." అని సిజెఐ చెప్పారు.

నిందితుడు, సస్పెన్షన్‌కు గురైన న్యాయవాది రాకేష్ కిషోర్ పట్ల వ్యవహరించాల్సిన తీరుపై జస్టిస్ భుయాన్ భిన్నంగా స్పందించారు. "దీనిపై నా అభిప్రాయాలు నాకున్నాయి. జస్టిస్ గవాయ్ భారత ప్రధాన న్యాయమూర్తి. ఇదేమీ చిన్న విషయం కాదు, జోక్ అంతకంటే కాదు." అని భుయాన్ అన్నారు. "న్యాయమూర్తులుగా ఇన్నేళ్లలో మేం,



మాట్లాడుతున్న గవాయ్ (ఫైల్)

ఇతరులకు సమర్థనీయంగా లేనివి, నచ్చనివి చాలా చేస్తుంటాం. కానీ అంతమాత్రాన మేం ఏం చేశామో దానిపై మా అభిప్రాయాలు మార్చుకోం?" అని పేర్కొన్నారు.

క్షమించరాని విషయం : తుషార్ మెహతా

సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కూడా ఈ చర్యను తీవ్రంగా ఖండించారు. పూర్తిగా క్షమించరాని పని అని వ్యాఖ్యానించారు. అయితే నేరస్తుడిని వదిలివేయడం ద్వారా సిజెఐ ఔదార్యంగా వ్యవహరించారంటూ శ్లాఘించారు.

నిందితుడిపై అభియోగాలు మోపవద్దని ఆదేశించిన సిజెఐ

ఆ సంఘటన తర్వాత న్యాయవాది రాకేష్ కిషోర్ (71)ను కాసేపు అదుపులోకి తీసుకున్నప్పటికీ ఆయనపై అభియోగాలేవీ మోపవద్దని సిజెఐ, కోర్టు రిజిస్ట్రార్ జనరల్‌ను ఆదేశించడంతో ఆ వెంటనే వదిలిపెట్టేశారు. సంఘటన అనంతరం గవాయ్ మీడియాతో మాట్లాడుతూ, తనను గానీ, తన డెస్క్‌ను గానీ ఏదీ తగల్లేదన్నారు. కేవలం శబ్దం మాత్రమే వినబడింది. బహుశా ఆ బూటు ఏదో టేబుల్‌నో లేదా మరోదాన్నో గుద్దుకుని పడిపోయి వుంటుంది. సిజెఐ గవాయ్ మీదకు విసిరేశాను అంటూ ఆ వ్యక్తి మాట్లాడింది మాత్రమే నేను విన్నాను." అని చెప్పారు. 'ఇదేమీ పట్టించుకోవద్దు, దీని వల్ల నా దృష్టి పక్కకు మరల్లేదు, మీరు కూడా దృష్టి మరల్చుకోకుండా ఈ విచారణతో ముందుకు సాగాలి' అని ఆ సమయంలో వాదనలు వినిపిస్తున్న లాయర్‌తో చెప్పినట్లు గవాయ్ చెప్పారు. కోర్టు నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించలేదంటూ ఆ తర్వాత కిషోర్‌ను బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సస్పెండ్ చేస్తూ చర్యలు తీసుకుంది.

పేర్లు లేని ఓటర్ల అప్పీలుకు సహకారం

- బీహార్ లీగల్ సర్వీస్ అథారిటీని కోరిన సుప్రీం
- ఎస్ఐఆర్‌పై 16న తదుపరి విచారణ

న్యూఢిల్లీ : బీహార్ తుది ఓటర్ల జాబితా నుండి తొలగించబడిన ఓటర్లు భారత ఎన్నికల కమిషన్ వద్ద అప్పీల్ చేసుకోవడం కోసం వారికి అవసరమైన సాయాన్ని అందించాల్సిందిగా బీహార్ రాష్ట్ర లీగల్ సర్వీస్ అథారిటీ (బిఎస్ఎల్ఎస్ఎ)ను సుప్రీంకోర్టు గురువారం కోరింది. ఈ మేరకు జిల్లా స్థాయి సంస్థలకు ఆదేశాలు జారీ చేయాలని ఆదేశించింది. బీహార్ ఓటర్ల సమగ్ర సవరణ ప్రక్రియ ముగిసిన తర్వాత తుది జాబితాలో తొలగించబడిన ఓటర్లు చేసుకునే అప్పీళ్లపై నిర్దిష్ట కాలపరిమితిలో సవివరమైన, సహేతుకమైన ఆదేశాలు జారీ చేసే అంశాన్ని తదుపరి విచారణా తేదీన నిర్ణయిస్తామని సుప్రీం పేర్కొంది. ఇసి ప్రక్రియను సవాలు చేసిన పిటిషన్లపై విచారణ జరిపే సమయంలో ఈ అంశం కూడా పరిశీలించబడుతుందని సుప్రీం కోర్టు తెలిపింది. ఓటర్ల జాబితాలో పేర్లు లేనివారు ఇసి వద్ద తమ అప్పీళ్లను నమోదు చేయడానికి పారా లీగల్ వలంటీర్లు సాయపడతారని, వీరిని జిల్లా స్థాయి లీగల్ సర్వీస్ అథారిటీ పంపించాలని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోమాల్యా బాగ్చిలతో కూడిన బెంచ్ పేర్కొంది. తొలగించబడిన 3.66 లక్షల మంది ఓటర్ల జాబితాను చదివేందుకు వీలుగా (మెషిన్ రీడబుల్ ఫార్మాట్‌లో) అందించడానికి ఇసి తిరస్కరించడాన్ని న్యాయవాది ప్రశాంత్ భూషణ్ విమర్శించారు. ఇసి పారదర్శకతను ఆయన ప్రశ్నించారు. దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితా సవరణలకు యోచిస్తున్న నేపథ్యంలో బీహార్‌లో జరిగిన అనుభవాల నుండి గుణపాఠం నేర్చుకోవాలని ఎన్నికల కమిషన్‌కు జస్టిస్ కాంత్ సూచించారు. అధికారులు వారేం చేస్తున్నారో తెలుసుకుంటారని కోర్టు భావిస్తోందని వ్యాఖ్యానిస్తూ దీనిపై విచారణను ముగించింది. దీనిపై తదుపరి విచారణను 16వ తేదీకి వాయిదా వేసింది.

ఎఐ దుర్వినియోగం వద్దు : ఇసి

న్యూఢిల్లీ : బీహార్ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు షెడ్యూల్ విడుదల కావటంతో ఎన్నికల సంఘం (ఇసి) రాజకీయ పార్టీలను హెచ్చరించింది. డీప్‌ఫేక్‌లను సృష్టించటానికి, నకిలీ సమాచార వ్యాప్తికి కృత్రిమ మేథ (ఎఐ)ను దుర్వినియోగం చేయద్దని వివరించింది. ఈ మేరకు ఓ ప్రకటనను విడుదల చేసింది. రాజకీయ పార్టీలు తమ సోషల్ మీడియా ప్లాట్ ఫామ్‌ల ద్వారా లేదా ప్రకటనల రూపంలో ప్రచారం కోసం పంచుకునే ఏఐ జనరేటెడ్ కంటెంట్‌ను లేబుల్ చేయాలనే సూచనలను ఇసి గుర్తు చేసింది. పార్టీలు, స్టార్ క్యాంపెయినర్లు, అభ్యర్థులు ఇలాంటి కంటెంట్ విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలనీ, వీటిని 'ఎఐ-జనరేటెడ్', 'డిజిటల్‌గా మెరుగుపర్చబడింది', 'సింథటిక్ కంటెంట్' అని ప్రముఖంగా ప్రకటించాలని పేర్కొన్నది. ఎన్నికల వాతావరణానికి విఘాతం కలగకుండా సోషల్ మీడియా పోస్ట్‌లపై కఠినమైన నిఘా ఉంటుందని ఇసి హెచ్చరించింది. గత లోక్‌సభ ఎన్నికల సందర్భంగా తప్పుడు సమాచార వ్యాప్తిని ఇనిరోధించటానికి ఏఐ దుర్వినియోగానికి వ్యతిరేకంగా రాజకీయ పార్టీలకు ఇసి కొన్ని ఆదేశాలను జారీ చేసింది. బీహార్ అసెంబ్లీ ఎన్నికలు వచ్చే నెల 6, 11 తేదీలలో జరుగనుండగా.. నవంబర్ 14న ఫలితాలు విడుదల కానున్న విషయం విదితమే.

15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఆంధ్రప్రదేశ్‌లోని గ్రామీణ స్థానిక సంస్థలకు 2025- 26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన 15వ ఆర్థిక సంఘం నిధులను కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది. ఈ నిధులలో తొలి విడత అన్‌టైడ్ గ్రాంట్ రూ.410.76 కోట్లను రాష్ట్రానికి విడుదల చేశారు. ఈ నిధులు రాష్ట్రంలోని మొత్తం 13 జిల్లా పరిషత్ లు, 650 మండల పరిషత్ లు, 13,327 గ్రామ పంచాయతీల్లో 13,092 అర్హత కలిగిన గ్రామ పంచాయతీలకు లబ్ధి జరగనుంది. అన్‌టైడ్ గ్రాంట్‌లు గ్రామీణ స్థానిక సంస్థలు, పంచాయతీ రాజ్ సంస్థలు స్థానిక అవసరాలకు అనుగుణంగా వినియోగించుకోవచ్చు. ఈ నిధులను జీతాలు, ఇతర పరిపాలనా వ్యయాల కోసం వినియోగించరాదని ఆర్థిక సంఘం తెలిపింది. రాజ్యాంగంలోని 11వ షెడ్యూల్లో పేర్కొన్న 29 అంశాల పరిధిలో ఉండే గ్రామీణాభివృద్ధి కార్యక్రమాల కోసం మాత్రమే ఉపయోగించుకోవాల్సి ఉంటుంది. "టైడ్ గ్రాంట్‌లను (ఎ) పరిశుభ్రత, బహిరంగ మల విసర్జన రహిత స్థితి నిర్వహణతో పాటు గృహ వ్యర్థాల నిర్వహణ, మానవ విసర్జితాలు, ఫీకల్ స్లడ్జ్ మేనేజ్‌మెంట్ కూడా ఉపయోగించవచ్చు. (బి) తాగునీటి సరఫరా, వర్షపు నీరు నిల్వ, నిర్వహణ, నీటి పునర్వినియోగం కోసం వినియోగించవచ్చు.

పేదవాడికి వైద్యాన్ని దూరం చేస్తారా?

- వైసిపి అధినేత వైఎస్ జగన్
- మాకవరపాలెం మెడికల్ కాలేజీ నిర్మాణాల పరిశీలన

ప్రజాశక్తి- కోటవురట్ల (అనకాపల్లి)

'ఆధునిక దేవాలయాలను ఎలా ప్రైవేటుపరం చేస్తారు. మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేస్తే పేదవాడికి వైద్యం ఎలా అందుతుంది' అని టిడిపి కూటమి సర్కారును వైసిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి ప్రశ్నించారు. గురువారం ఆయన అనకాపల్లి జిల్లా మాకవరపాలెం మండలం భీమబోయినపాలెం గ్రామం వద్ద మెడికల్ కాలేజీ నిర్మాణాలను సందర్శించారు. తొలుత విశాఖ ఎయిర్‌పోర్టు రోడ్డు మార్గంలో ఎన్ఎడి జంక్షన్, పెందుర్తి, అనకాపల్లి, తాళ్లపాలెం మీదుగా మాకవరపాలేనికి జగన్ చేరుకున్నారు. అక్కడ మెడికల్ కాలేజీల నిర్మాణాల వద్ద మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో 17 మెడికల్ కాలేజీలను తమ ప్రభుత్వంలో ప్రారంభించగా, ఏడు కాలేజీలు పూర్తయ్యే స్థితికి చేరాయని, వాటిలో ఐదింటిలో తరగతులు కూడా ప్రారంభమయ్యాయని వివరించారు. ఉత్తరాంధ్రలో నాలుగు కాలేజీలకుగాను పాడేరు, విజయనగరం కాలేజీలు పూర్తయ్యాయని తెలిపారు. 2023-24లో విజయనగరం, రాజమండ్రి, ఏలేరు, నంద్యాల, మచిలీపట్నం మెడికల్ కళాశాల్లో 800 సీట్లు



మెడికల్ కాలేజీ నిర్మాణాల ప్రాంతంలో మాట్లాడుతున్న జగన్

అందుబాటులోకి వచ్చాయని, 50 సీట్లతో పాడేరు, పులివెందుల్లో క్లాసులు ప్రారంభమయ్యాయని గుర్తు చేశారు. కాలేజీలకు రూ.8 వేల కోట్లు అవసరం కాగా, తమ హయాంలోనే రూ.3 వేల కోట్లు కేటాయించామని తెలిపారు. మిగిలిన మొత్తాన్ని టిడిపి కూటమి సర్కారు ఖర్చు చేయలేదా? అని ప్రశ్నించారు. అమరావతికి గతంలో 50 వేల ఎకరాలు సేకరించి, నేడు మరో 50 వేల ఎకరాలు సేకరించేందుకు, అక్కడ రెండు లక్షల కోట్ల రూపాయలు ఖర్చు చేసేందుకు సిద్ధమవుతున్నారని, పేదవాడికి ఉపయోగపడే మెడికల్ కాలేజీలకు ఖర్చు చేయకపోవడం దారుణమని అన్నారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమానికి నర్సీపట్నం నుంచే శ్రీకారం చుడుతున్నామని ప్రకటించారు. నవంబర్ 22 వరకు రచ్చబండ కార్యక్రమం ద్వారా నియోజకవర్గానికి 50 వేలు సంతకాలు సేకరించి గవర్నర్‌కు సమర్పిస్తామన్నారు.

'కురుపాం' మృతులకు రూ.25 లక్షల పరిహారం చెల్లించాలి

పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం గురుకుల పాఠశాలలో పచ్చకామెర్లతో మరణించిన ఇద్దరు విద్యార్థుల కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియోను రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాలని జగన్ డిమాండ్ చేశారు. గురువారం రాత్రి విశాఖ కెజిహెచ్‌కు వచ్చిన ఆయన అక్కడ పచ్చకామెర్లతో చికిత్స పొందుతున్న విద్యార్థినులను పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. పార్వతీపురంలో నిర్మాణంలో ఉన్న మెడికల్ కాలేజీ పూర్తయి ఉంటే ఈ విద్యార్థులు దూర ప్రాంతంలోని కెజిహెచ్‌కు రావలసిన అవసరం ఉండేది కాదన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ఇంతమంది విద్యార్థులు వ్యాధి బారిన పడ్డారని విమర్శించారు. జగన్ పర్యటనలో మాజీ మంత్రులు బొత్స సత్యనారాయణ, గుడివాడ అమర్‌నాథ్, కన్నబాబు, విడదల రజని, పాముల పుష్ప శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు. ఉమ్మడి విశాఖ పర్యటనలో ఉన్న జగన్‌కు స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించాలని ఉక్కు కార్మికులు, బల్క్ డ్రగ్ పార్కుకు వ్యతిరేకంగా ఉద్యమించాలని మత్స్యకారులు వినతిపత్రాలు అందజేశారు. జగన్‌ను చూసేందుకు భారీగా ఆ పార్టీ కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చారు.

జగన్ పర్యటనను వ్యతిరేకిస్తూ దళిత సంఘాల నిరసన

జగన్ పర్యటనను వ్యతిరేకిస్తూ నర్సీపట్నంలో దళిత సంఘాలు నిరసన తెలిపాయి. ప్రజలను మోసగించేందుకు ఈ పర్యటన చేస్తున్నారని దళిత సంఘాల నాయకులు విమర్శించారు. కరోనా సమయంలో కరోనా కిట్లు అడిగినందుకు దళిత డాక్టర్ సుధాకర్‌ను పిచ్చివాడిగా ముద్రవేసి, హింసించి ఆయన చావుకు కారణమైన జగన్... నర్సీపట్నంలో ఎలా అడుగుపెడతారని వారు ప్రశ్నించారు. సమీపంలోని అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు.

శాంతి ప్రణాళిక తొలి దశ ఇలా...

- స్వాగతించిన ప్రపంచ దేశాలు

కైరో : ఇజ్రాయిల్, హమాస్ ఆమోదించిన శాంతి ప్రణాళిక తొలి దశలో భాగంగా హమాస్ 20 మంది బందీలను విడుదల చేస్తుంది. చనిపోయిన 27 మంది మృతదేహాలు కూడా అప్పగిస్తుంది. అటు ఇజ్రాయిల్ చెరలో ఉన్న రెండు వేల మంది పాలస్తీనా ఖైదీలు కూడా విడుదలవుతారు. ఇజ్రాయిల్ విడుదల చేయాల్సిన ఖైదీల జాబితాను ఇప్పటికే హమాస్ అందజేసింది. ఇజ్రాయిల్‌పై 2023 అక్టోబర్ 7న దాడి చేసిన సమయంలో హమాస్ 47 మందిని బందీలుగా పట్టుకుంది. వీరిలో 27 మంది చనిపోయారు. ఒప్పందం అమలులోకి వచ్చిన 72 గంటల్లో ఈ బందీలు, ఖైదీల మార్పిడి జరుగుతుంది. ఈ సందర్భంగా ట్రంప్ వాషింగ్టన్ నుంచి మాట్లాడుతూ బందీలందరూ త్వరలోనే విడుదల అవుతారని అన్నారు. బలమైన, సుస్థిరమైన, దీర్ఘకాలిక శాంతి స్థాపన దిశలో తొలి చర్యగా ఇజ్రాయిల్ గాజా నుండి తన దళాలను ఉపసంహరించుకుంటుందన్నారు. మధ్యవర్తిత్వం నెరపిన ఖతార్, ఈజిప్ట్, టర్కీలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

స్వేచ్ఛ, స్వాతంత్య్రం సాధించేందుకు కట్టుబడి ఉన్నాం : హమాస్

తమ ప్రజలకు స్వేచ్ఛ, స్వాతంత్య్రం కల్పించేందుకు కట్టుబడి వున్నామని హమాస్ పునరుద్ఘాటించింది. పాలస్తీనా వాసుల త్యాగాలు వృథా పోవని పేర్కొంది. మధ్యవర్తులకు, ట్రంప్‌నకు కృతజ్ఞతలు తెలిపింది.

కేబినెట్ ఆమోదం తరువాత అమలులోకి : నెతన్యాహూ

ఇది ఇజ్రాయిల్‌కు గొప్ప రోజని ప్రధాని బెంజిమిన్ నెతన్యాహూ వ్యాఖ్యానించారు. ఒప్పందం కుదరడంలో కీలక పాత్ర పోషించిన ట్రంప్‌నకు ధన్యవాదాలు తెలిపారు. ఇజ్రాయిల్ కేబినెట్ ఆమోదముద్ర వేసిన తర్వాతనే ఒప్పందం అమల్లోకి వస్తుందని ప్రకటించారు.

ఒప్పందం అమలుకు మద్దతిస్తాం : యుఎన్‌ఓ

గాజాలో శాంతి ఒప్పందం కుదిర్చేందుకు అమెరికా, ఖతార్, ఈజిప్ట్, టర్కీ దేశాల మధ్యవర్తిత్వ ప్రయత్నాలను ఐక్యరాజ్య సమితి (యుఎన్‌ఓ) ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ కొనియాడారు. ఒప్పందాన్ని



శాంతి ప్రణాళికకు ఇజ్రాయిల్, హమాస్ ఆమోదంపై వివరాలను వెల్లడిస్తున్న ట్రంప్

పూర్తిస్థాయిలో అమలు చేసేందుకు ఐక్యరాజ్య సమితి మద్దతు ఇస్తుందని, మానవతా సాయాన్ని పర్యవేక్షిస్తుందని ఆయన తెలిపారు.

స్వాగతించిన మోడీ... నెతన్యాహుకు ప్రశంసలు

బందీల విడుదల, గాజా ప్రజలకు మానవతా సాయం పెంపు వంటి చర్యలు ఊరట కలిగిస్తాయని, దీర్ఘకాలిక శాంతికి దోహదపడతాయని ప్రధాని మోడీ వ్యాఖ్యానించారు. ఈ ఒప్పందం నెతన్యాహూ బలమైన నాయకత్వానికి అద్దం పట్టిందని కొనియాడారు. తన రాజకీయ అవసరాల కోసం, పదవిని కాపాడుకోవడం కోసం చిన్నారులు, మహిళలుసహా 70 వేల మందికిపైగా పాలస్తీనియన్లను బలిగొన్న ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహును ప్రధాని మోడీ ప్రశంసించడం గమనార్హం.ఇక్కడ ఒక విషయాన్ని ప్రస్తావించాల్సిన అవసరం ఉంది. గాజాలో కాల్పుల విరమణ జరపాలని, తన వద్ద బందీలుగా ఉన్న వారిని హమాస్ తక్షణమే విడుదల చేయాలని, నిరాటంకంగా మానవతా సాయాన్ని అందిం చాలని కోరుతూ ఈ ఏడాది ప్రారంభంలో ప్రతిపాదించిన తీర్మానాన్ని ఐక్యరాజ్యసమితిలో మూడో వంతు సభ్యులు సమర్థించగా, భారత్ గైర్హాజరైంది. ప్రత్యక్ష చర్చల ద్వారానే శాంతి నెలకొంటుందని అభిప్రాయపడింది.

ప్రపంచ దేశాల ఆశాభావం

శాంతి ప్రణాళిక అమలుకు హమాస్, ఇజ్రాయిల్ చేసుకున్న ఒప్పందాన్ని భారత్‌సహా పలు ప్రపంచదేశాలు స్వాగతించాయి. ఇయు, బ్రిటన్, కెనడా, బ్రిటన్, న్యూజిలాండ్, ఇరాన్, ఇటలీ, లెబనాన్, రష్యా, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఫ్రాన్స్ సహా పలు దేశాలు ఈ ఒప్పందాన్ని స్వాగతించిన వాటిలో ఉన్నాయి. మారణకాండకు స్వస్తి చెప్పే చొరవను, కార్యాచరణను ఎల్లప్పుడూ స్వాగతిస్తామని ఇరాన్ పేర్కొంది. గాజాలో శాంతి స్థాపనకు ఇదొక విశిష్ట అవకాశమని ఇటలీ ప్రధాని మెలొని వ్యాఖ్యానించారు. శాశ్వత కాల్పుల విరమణ దిశగా ఈ తొలి ఒప్పందం ముందడుగు అని లెబనాన్ అధ్యక్షుడు జోసెఫ్ ఔన్ వ్యాఖ్యానించారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయెల్ మాక్రాన్ స్పందిస్తూ రాజకీయ పరిష్కారానికి ఈ శాంతి ప్రణాళిక మార్గం వేస్తుందని ఆశిస్తున్నట్లు చెప్పారు.

అమలు ఎలా ఉంటుందో చూడటమే కీలకం : రష్యా

ఒప్పందం కుదరడం ఆనందించదగ్గ విషయమే కానీ, ఈ ఒప్పందం అమలు ఎలా వుంటుందో చూడడమే చాలా కీలకమని రష్యా పేర్కొంది. ఈ ప్రయత్నాలకు కచ్చితంగా మద్దతిస్తామని క్రెమ్లిన్ తెలిపింది. తాజా పరిణామాలను సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ స్వాగతిస్తూ న్యాయమైన, సమగ్రమైన శాంతి నెలకొనాలని ఆకాంక్షిస్తున్నామని పేర్కొన్నాయి. ఈ మేరకు సౌదీ, యుఎఇ విదేశాంగ శాఖలు ప్రకటనలు జారీ చేశాయి.

మూడు మాసాలకు సరిపడా ఆహార నిల్వలు : ఐరాస

కాల్పుల విరమణ ఒప్పందాన్ని స్వాగతిస్తూ ఐక్యరాజ్య సమితి పాలస్తీనా శరణార్థుల సంస్థ, గాజా ప్రజానీకానికి మూడు మాసాలకు సరిపడా ఆహార నిల్వలు తమ వద్ద వున్నాయని తెలిపింది.

20వేలకు పైగా చిన్నారుల బలి

- జీవచ్ఛవాలుగా 60 వేల మంది బాలలు

గాజా : రెండు సంవత్సరాల పాటు ఇజ్రాయిల్ సాగించిన మారణహోమంలో 20 వేల మందికి పైగా చిన్నారులు ప్రాణాలు కోల్పోయారు. అంటే ప్రతి 52 నిమిషాలకు ఓ చిన్నారి ప్రాణం పోయింది. 12లక్షల మందికి పైగా చిన్నారులు ఆకలితో అలమటించారు. 58,554 మంది పిల్లలు అవయవాలు కోల్పోయి జీవచ్ఛవాలుగా మిగిలారు. 9,14,102 మంది పిల్లలు విద్యకు దూరమయ్యారని, 5,580 మంది వైద్య చికిత్స కోసం ఎదురుచూపులు చూస్తున్నారని పేర్కొంది.

అభం శుభం తెలియని 20,179 మంది చిన్నారులు ప్రాణాలు కోల్పోయారని గాజాలోని ఆరోగ్య మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఇజ్రాయిల్ దాడుల్లో చనిపోయిన పిల్లల్లో ఏడాది కూడా నిండని వారు 1,029 మంది ఉండగా 5,031 మంది ఐదేళ్ల లోపు వారు. 420 మంది పసికూనలైతే పుట్టగానే దాడుల్లో చనిపోయారు. గాజాలో చిన్నారులకు వ్యాక్సినేషన్ ప్రక్రియ కూడా సరిగా జరగడం లేదు. ఈ నెల 7వ తేదీ నాటికి గాజాలో మొత్తం 7,67,173 మంది చనిపోగా, 1,69,780 మంది గాయాల పాలయ్యారు. మృతుల్లో 30శాతం పిల్లలే వున్నారు. మిగిలినవారిలో 16శాతం మంది మహిళలు కాగా, ఏడు శాతం మంది వృద్ధులు, 47 శాతం మంది పురుషులు ఉన్నారు. ప్రతి రోజూ కనీసం 13 కుటుంబాలు ఊచకోతకు గురయ్యాయి. మొత్తంగా 8,910 కుటుంబాలు కనుమరుగయ్యాయి. ప్రస్తుత సంవత్సరంలో 4,163 గర్భస్రావాలు జరగ్గా, 2,415 మంది నెలలు నిండకుండానే పుట్టారు. నవజాత శిశువుల్లో 274 మంది చనిపోయారు. ఈ ఏడాది ఇప్పటి వరకూ 408 మంది పోషకాహార లోపంతో కన్నుమూశారు. వీరిలో 34.1 శాతం మంది పిల్లలే.



హాజరైన ఉత్తర కొరియా అధ్యక్షులు కిమ్ జోంగ్ ఉన్

ఘనంగా డబ్ల్యూపికె వార్షికోత్సవం

ప్యాంగ్‌యాంగ్ : ఉత్తర కొరియాలో అధికార కార్మికుల పార్టీ (డబ్ల్యూపికె) స్థాపించి 80 ఏళ్లు పూర్తయిన సందర్భంగా వార్షికోత్సవం గురువారం ఘనంగా ప్రారంభమైంది. ప్యాంగ్‌యాంగ్‌లో జరిగిన ఈ వేడుకలకు చైనా, రష్యా, వియత్నాం దేశాల ఉన్నతస్థాయి ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉత్తర కొరియా అధ్యక్షులు కిమ్ జోంగ్ ఉన్ తన పూర్వీకులు 1945లో పార్టీ స్థాపించిన నాటి ఎనిమిది దశాబ్దాల పురోగతిని గుర్తుచేసుకుంటూ భావోద్వేగ ప్రసంగం చేశారు. సామ్యవాదం, ఐక్యత, స్వావలంబన సిద్ధాంతాల గురించి ప్రత్యేకంగా వివరించారు. తమ పూర్వీకుల విప్లవ స్ఫూర్తికి విధేయంగా ఉంటానని తెలిపారు. తన తాత కిమ్ ఇల్ సంగ్‌కు నివాళులర్పించారు. భవిష్యత్ తరాలు పార్టీ సిద్ధాంత స్వచ్ఛతను కాపాడాలని పిలుపునిచ్చారు. ముఖ్యఅతిథిగా హాజరైన చైనా ప్రధాని లీ కియాంగ్‌కు ప్యాంగ్‌యాంగ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఘనస్వాగతం పలికారు. లీ మాట్లాడుతూ రెండు సామ్యవాద పొరుగు దేశాల మధ్య దీర్ఘకాల స్నేహం, పరస్పర సంబంధాలు విలువైనవన్నారు. ఇరుదేశాల చారిత్రక సంబంధాలు, భౌగోళిక సామీప్యత, ఉమ్మడి రాజకీయ ఆదర్శాలను ప్రస్తావించారు. రష్యా మాజీ అధ్యక్షులు దిమిత్రి మెద్వదేవ్ నేతృత్వంలో ప్రతినిధి బృందం వేడుకల్లో పాల్గొంది. ఆ దేశ సహజ వనరుల మంత్రి అలెగ్జాండర్ కోజ్‌లోవ్, కుర్స్క్ ప్రాంత గవర్నర్ కూడా హాజరయ్యారు. అయితే రెండు దశాబ్దాల అనంతరం వియత్నాం కమ్యూనిస్టు పార్టీ సెక్రటరీ జనరల్ టో లామ్ మొదటిసారిగా ఉత్తర కొరియాను సందర్శించారు. రెండు దేశాల మధ్య విద్య, సాంకేతికత, సాంస్కృతిక సహకార ఒప్పందాలపై చర్చించారు.

హైడ్రో పవర్ ప్రాజెక్టు ఒప్పందాలు రద్దు చేయండి

(మొదటిపేజీ తరువాయి)

పెదకోట, చిట్టంవలస, సీలేరు, ఎర్రవరం వంటి ప్రాజెక్టుల్లో మొత్తం 7,400 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. ఈ ప్రాజెక్ట్ ఆదివాసీ పూర్వీకుల భూములు, అడవులు, నదులు, సంస్కృతిని, జీవనాధారాలను పూర్తిగా ధ్వంసం చేస్తుందని పేర్కొన్నారు. పంప్డ్ స్టోరేజ్ హైడ్రోపవర్ (పిఎస్‌పి) వల్ల అడవుల నిర్మూలన, జలవనరుల దుర్వినియోగం, భూకంపాల ప్రమాదం, జీవవైవిధ్యనష్టానికి దారితీస్తాయని తెలిపారు. ఇటీవల పార్వతీపురం మన్యం జిల్లాలో అదాని సంస్థలకు సంబంధించిన రెండు పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులు (జిఓఎమ్ఎస్. నెం.55) స్థానిక సమస్యలు, ఆదివాసీల ఆందోళనతో జూలై 29, 2025న రద్దు చేశారని తెలిపారు. మిగిలిన ప్రాజెక్టులు ఇప్పటికీ కొనసాగుతున్నాయని, ఇది ఆదివాసీల అణచివేతతో సమానమని పేర్కొన్నారు. ఆదివాసీల పట్ల ప్రభుత్వం వివక్షపూరిత వైఖరి ప్రదర్శిస్తోందని, సావధానంగా పైఅంశాలను పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. 51, 13, 2 జిఓల ద్వారా మంజూరు చేసిన హైడ్రో పవర్ ప్రాజెక్టుల ఒప్పందాలను వెంటనే రద్దు చేయాలని, ఆదివాసీల గ్రామసభలతో సంప్రదింపులు నిర్వహించి, వారి అనుమతి లేకుండా ఏ పనులూ చేయకూడదని పేర్కొన్నారు. ప్రభుత్వం ఆదివాసీల భూమి హక్కులు, పర్యావరణ రక్షణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, గ్రామాలు, పొలాలు ఆక్రమణ లేకుండా జనావాసాలు లేని నది ప్రవాహ ప్రాంతాల్లో పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టులను పెట్టాలన్న అంతర్జాతీయ నిబంధనలను గౌరవించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చూడాలని సూచించారు. అక్రమంగా సర్వేరాళ్లు పాతి గిరిజనులను భయభ్రాంతులకు గురిచేస్తున్న కంపెనీలు, వాటి ప్రతినిధులపై చట్టబద్ధమైన చర్యలు తీసుకోవాలని, ఎస్‌సి, ఎస్‌టి, పిఓఎ చట్టాల ప్రకారం కేసులు నమోదు చేయించాలని కోరారు. ఈ విషయంపై స్వతంత్ర జాతీయ మానవహక్కుల కమిషన్ (ఎన్‌ఎచ్ఆర్‌సీ), జాతీయ గిరిజన కమిషన్ (ఎన్‌సిఎస్‌టి)ల చేత విచారణ జరిపించాలని శ్రీనివాసరావు డిమాండ్ చేశారు.

యుపిలో సాక్షికి బెదిరింపులు

- 'లఖింపూర్' కేసులో కేంద్ర మాజీ మంత్రి ప్రభృతులపై ఎఫ్ఐఆర్
- సుప్రీంకు తెలిపిన పోలీసులు

న్యూఢిల్లీ : బిజెపి ఏలుబడిలోని ఉత్తరప్రదేశ్‌లో బిజెపి నేతల అరాచకాలకు అంతులేకుండా పోతోంది. హింసాకాండకు పాల్పడటంతోపాటు సాక్షులపై బెదిరింపులకు పాల్పడుతున్నారు. లఖింపూర్ ఖేరి హత్యల కేసులో కీలక సాక్షిని బెదిరించినందుకు కేంద్ర మాజీ మంత్రి అజయ్ మిశ్రా, ఆయన కుమారుడు అశీష్ మిశ్రా మరో ఇద్దరిపై ఎఫ్ఐఆర్ దాఖలైందని గురువారం సుప్రీంకోర్టుకు యుపి పోలీసులు తెలిపారు. 2021 అక్టోబరు 3న లఖింపూర్ ఖేరిలో ఆందోళన చేస్తున్న రైతులను అశీష్‌మిశ్రా, అతని అనుచరులు కారుతో ఢీకొట్టడంతోపాటు హింసాకాండకు పాల్పడ్డారు. ఈ ఘటనలో నలుగురు రైతులతోపాటు మొత్తంగా 8మంది మరణించారు. కేంద్రం కొత్తగా తీసుకువచ్చిన నల్ల చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ రైతులు నిరసన చేస్తుండగా ఈ దారుణానికి పాల్పడ్డారు. సాక్షి ఫిర్యాదుతో ఎఫ్ఐఆర్ నమోదు చేశామని యుపి పోలీసులు చెప్పారు. ఈ మేరకు యుపి ప్రభుత్వం అఫిడవిట్ అందజేసింది. పడువా పోలీసు స్టేషన్‌లో తప్పుడు సాక్ష్యమివ్వాల్సిందిగా బెదిరించడం వంటి అభియోగాలపై ఎఫ్ఐఆర్ దాఖలైంది. సాక్షి బల్జీందర్ సింగ్ నివసిస్తున్న పంజాబ్‌కు డిఎస్‌పిని పంపి స్టేట్‌మెంట్‌ను నమోదు చేశామని ప్రభుత్వం ఆ అఫిడవిట్‌లో పేర్కొంది. విచారణ సందర్భంగా ఏమీ చెప్పవద్దని వారు తనపై ఒత్తిడి తెచ్చారని సాక్షి ధ్రువీకరించారు. తనకు బెదిరింపు కాల్ వచ్చిందని జనవరిలో బల్జీందర్ సింగ్ సుప్రీంను ఆశ్రయించాడు. దానిపై ఆగస్టు 7న సుప్రీం స్పందిస్తూ ఈ ఫిర్యాదుపై పోలీసుల నిష్క్రియాపరత్వాన్ని తీవ్రంగా విమర్శించింది. ఆ నేపథ్యంలో యుపి పోలీసులు స్పందించి, చర్యలు తీసుకుని కోర్టుకు తెలియజేశారు.

ఉమ్మడి విశాఖలో భూలూటీ

(మొదటిపేజీ తరువాయి)

చెబుతోంది. పైన చెబుతున్న వాటిలో ఎఐ టెక్‌తో నడిచేవీ ఉండడంతో ఉద్యోగాల కల్పన మాటలకే పరిమితమన్న విషయం ఇట్టే అర్థమవుతుంది. రూ.2 వేల కోట్లు విలువైన విశాఖ తీరంలోని 14 ఎకరాలను లూలూ మాల్‌కు రూ.400 కోట్లలోపు ధరకే చంద్రబాబు ప్రభుత్వం ఇచ్చేసింది. విశాఖ జిల్లా ఆనందపురం మండలం తర్లువాడలో రూ.500 కోట్ల విలువైన 300 ఎకరాల భూమిని గూగుల్ సంస్థకు ధారాదత్తం చేసేస్తోంది. మొత్తంగా ఐటి కంపెనీల పేరుతో రూ.6 వేల కోట్ల భూములకు స్కెచ్ వేశారు.

ఐటి కంపెనీల్లో ఉపాధి ఎంత?

2015 నుంచి ఐటి కంపెనీల ప్రగతి శూన్యం. ఈ కాలంలో 25 వేల మందే ఉద్యోగులు ఉన్నారు. 2014-15 కాలంలో మధురవాడ -కాపులుప్పాడల్లో అదాని 132 ఎకరాలను ఐటి డేటా సెంటర్ కోసం తీసుకుని ఇంతవరకూ కార్యకలాపాలు చేపట్టలేదు. విశాఖ నగరం నడిబొడ్డున మద్దిలపాలెంలో రూ.వందల కోట్ల విలువైన ఎనిమిది ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని విప్రో, టెక్ మహీంద్ర, డబ్ల్యుఎన్ఎస్ సంస్థలు తీసుకుని ఒక్కో సంస్థ మూడు వేలకుపైగా ఉద్యోగాలు ఇస్తామని ఎరవేశాయి. అవి ఇచ్చిన ఉద్యోగాలు మొత్తంగా నేటికీ మూడు వేలకు దాటలేదు.

పెందుర్తి మండలం గుర్రంపాలెంలో 22 ఎకరాలను ల్యాండ్ బ్యాంక్ పేరుతో గతంలో చంద్రబాబు ప్రభుత్వం స్వాధీనం చేసుకుని పదేళ్లు దాటుతున్నా అక్కడ ఇప్పటికీ ఎలాంటి ఎలక్ట్రానిక్స్ పార్కు రాలేదు. అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో మిట్టల్ స్టీల్‌ప్లాంట్, బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటు కోసం పెద్ద మొత్తంలో భూములను తీసుకున్నారు. అచ్యుతాపురంలో సుమారు పదహారేళ్ల క్రితం టెక్స్‌టైల్ సెజ్ కింద నోటిఫై అయిన శ్రీలంకకు చెందిన బ్రాండిక్స్ ఇండియా అపెరల్ సిటీ ప్రయివేట్ లిమిటెడ్‌కు ఎకరా రూపాయి చొప్పున వెయ్యి ఎకరాలను ప్రభుత్వం ఇచ్చేసింది. ఇప్పటికి 490 ఎకరాల్లో మాత్రమే అక్కడ పరిశ్రమలు వచ్చాయి.

అతిపెద్ద భూ లూటీకి తెరుచుకున్న ద్వారాలు

పెట్రోలియం కెమికల్స్ అండ్ పెట్రోకెమికల్ ఇన్వెస్ట్‌మెంట్స్ రీజియన్ (పిసిపిఐఆర్) పేరుతో చంద్రబాబు 2014లోనే భూములపై దృష్టి సారించారు. తాజాగా పిసిపిఐఆర్‌కు విశాఖ చెన్నయ్ ఇండస్ట్రియల్ కారిడార్ (విసిఐసి)గా పేరు మార్చారు. అనకాపల్లి జిల్లాలో పిసిపిఐఆర్ కోసం ఆరు మండలాల్లోని 67 పంచాయతీల పరిధిలోగల 83 గ్రామాల నుంచి 1,03,607 ఎకరాల భూమిని సేకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటి వరకూ రూ.40 వేల కోట్ల విలువైన సుమారు 50 శాతానికిపైగా భూములను సేకరించారు.

జీవన సౌరభం

ఆదర్శాలు గొప్పవైనంత మాత్రాన ప్రయోజనం ఉండదు. వాటిని ఆచరణలో పెట్టినప్పుడే సార్థకత.

మీ కోసం

కందిపప్పు నిల్వ చేసుకునే డబ్బాలో ఎండు కొబ్బరి వుంచితే పప్పు త్వరగా పాడవ్వదు.



రవి - పెన్సిల్



తరగతి గదిలో రాము విచారంగా కూర్చున్నాడు. తోటి మిత్రులు హోంవర్క్ చేసుకుంటున్నారు. మరి కొంతమంది పెన్సిల్ చెక్కుతున్నారు. రాము దగ్గర పెన్సిల్ లేదు. అయినా పెన్సిల్ కావాలని ఎవరినీ అడగడం లేదు. రాము పక్కనే ఉన్న రవి... రామును చూసి 'నా దగ్గర మరో పెన్సిల్ ఉంది. తీసుకో' అని ఇచ్చాడు. రాము సంతోషంతో రవి దగ్గర ఉన్న పెన్సిల్ తీసుకుని హోమ్ వర్క్ చేశాడు.

హోమ్ వర్క్ పూర్తి అయ్యాకా రవికి పెన్సిల్ ఇవ్వటం రాము మరచిపోయాడు. అప్పుడు పెన్సిల్ ఇలా అంది : 'రాము నీ పని పూర్తి చేశావు. సంతోషం. మరి నన్ను రవి దగ్గరకు చేర్చాలి కదా. నీ అవసరం తీరింది. నేను కూడా పెన్సిల్ లేని వాళ్లకు ఉపయోగపడాలి కదా. అదిగో అక్కడ సుమిత్ర తన పెన్సిల్ కోసం బ్యాగ్ అంతా వెతుకుతోంది. నన్ను సుమిత్రకు ఇవ్వు' అంది. అప్పుడు రాము 'సారీ, సారీ' అని రవితో చెప్పి సుమిత్రకు పెన్సిల్ ఇచ్చాడు. సుమిత్ర 'థాంక్స్ రాము' అంది. 'థాంక్స్ నాకు కాదు, రవికి చెప్పాలి, ఈ పెన్సిల్‌కు చెప్పాలి' అన్నాడు రాము.

సుమిత్ర తన వర్క్ పూర్తి చేసుకుని రవికి పెన్సిల్ ఇస్తూ 'నీకు నీ పెన్సిల్‌కు థాంక్స్' అంది నవ్వుతూ. 'అందరికీ ఉపయోగపడటమే ముఖ్యం' అన్నాడు రవి. క్లాసులో పిల్లలందరూ చప్పట్లు కొడుతూ ఘొల్లున నవ్వారు. పెన్సిల్ వాళ్లకు టాటా చెప్పి రవి బాక్స్‌లోకి వెళ్ళింది.

- కనుమ ఎల్లారెడ్డి, 93915 23027

చిన్ననాటి జ్ఞాపకాలు

తోకకి దారం కట్టి
తూనీగతో ఆడిన రోజులు
కాలపు దారంతో
ఆనంద పతంగాలను
ఎగరేసిన గెంతులు
కపటమెరుగని స్నేహితులు
బతుకు బాటలో
బంగారు మైలురాళ్ళుగా
మిగిలి పోయిన
మధుర జ్ఞాపకాల
బాల్యపు ఆటలు



ఇప్పటికీ మన మనసుకు
గిలిగింతల పులకింతలు!

- సురేంద్ర రొద్ద, 94915 23570.

నేను గీసిన బొమ్మ



ఎం.గీతిక, 6వ తరగతి, ఎంజెపి ఎపి బిసి డబ్ల్యు రెసిడెన్షియల్ స్కూలు, సీతంపేట, కొయ్యలగూడెం మండలం, ఏలూరు జిల్లా.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

గజిబిజి జీవనశైలితోనే ఒత్తిడి ...

'జీవితంలో ఒత్తిళ్లు, సవాళ్లూ సహజమే. ఏవో చిన్నపాటి కారణాలకే తీవ్ర ఒత్తిడికి గురై కొందరు నానా రకాలుగా మథనపడిపోయి జీవితాలను చాలిస్తున్న వారూ ఉన్నారు. శారీరక, మానసిక ఆరోగ్యం ముఖ్యమే. అందుకే ప్రతి ఒక్కరూ ఒత్తిడి రహిత జీవితాలను గడిపేందుకు సన్నద్ధత కావాలి. ఆధునిక జీవనశైలి అవసరమే. కానీ ఆ పేరుతో అవసరం లేని పనుల్లో కూడా ఇమిడిపోయి నిద్రాహారాలు మానేసి నేటి యువతరం ఒత్తిడి జీవనాన్ని గడుపుతోంది. రాబోయే కాలంలో ఇలాంటి సమస్యలు మరింత ఉధృతి అయ్యే ప్రమాదం ఉంది' అంటున్నారు డాక్టర్ ఎన్టీఆర్ సార్వత్రిక ఆరోగ్య విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్, మానసిక వైద్య నిపుణురాలు డాక్టర్ వి.రాధికారెడ్డి. అక్టోబర్ 10న ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆమెతో ప్రజాశక్తితో మాట్లాడారు. ఆ వివరాలు ఆమె మాటల్లోనే ...



నేడు ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం



శారీరక ఆరోగ్యంతో పాటు మానసికంగా, సామాజికంగా కూడా దృఢంగా ఉంటేనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటాం. ఏటేటా అక్టోబర్ 4 నుంచి 10వ తేదీ వరకూ ప్రపంచ మానసిక ఆరోగ్య వారోత్సవ కార్యక్రమాలు జరుగుతుంటాయి. వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ (డబ్ల్యుహెచ్ఒ) ఈ ఏడాది (2025)ని 'విపత్తులు, ఆపత్కాలంలో మానసిక ఆరోగ్య సేవల లభ్యత' అనే నినాదాన్ని ఇచ్చింది. డబ్ల్యుహెచ్ఒ అంచనా ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా సుమారు 97 కోట్ల మంది ప్రజలు, రకరకాల మానసిక రుగ్మతలతో బాధ పడుతున్నారు. మానసిక ఆరోగ్య ప్రాముఖ్యతను గుర్తించిన 'వరల్డ్ ఫెడరేషన్ ఫర్ మెంటల్ హెల్త్ (డబ్ల్యుఎఫ్ఎంహెచ్) 1992 నుంచి ఏటేటా ప్రపంచవ్యాప్తంగా 150 దేశాల్లో మానసిక ఆరోగ్యంపై అపోహలు తొలగించి అవగాహన పెంచడానికి పలు కార్యక్రమాలు నిర్వహిస్తోంది. మన దేశంలో ప్రతి ఆరుగురిలో ఒకరు ఏదో ఒక మానసిక ఇబ్బందికి గురవుతున్న వారేనని గణాంకాలు చెబుతున్నాయి. కరోనా తర్వాత మానసిక రుగ్మతలు కనీసం 25 శాతం పెరిగాయని పలు పరిశోధనల్లో వెల్లడైంది. యువతలో మొబైల్ అడిక్షన్, డిప్రెషన్, గ్యాంబ్లింగ్, హింసా రూపాలు వంటి సమస్యలు అధికమయ్యాయని నివేదికలను బట్టి తెలుస్తోంది. ఆధునిక జీవనం, డిజిటల్ టెక్నాలజీ, కృత్రిమమేథ వచ్చిన తర్వాత మనుషులంతా వాటిపైనే ఎక్కువగా ఆధారపడాల్సివస్తోంది. కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు, సెల్‌ఫోన్లు, టీవీలను ఎక్కువసేపు వీక్షిస్తుండటంతోపాటు విపరీతంగా పెరిగిన శబ్దకాలుష్యంతో కూడా ఎక్కువగా మానసిక సమస్యలు పెల్లుబికుతున్నాయి. బ్లూటూత్‌లు, హెడ్‌సెట్లు ఎక్కువ సేపు వినియోగిస్తుండటం వల్ల కూడా వినికిడి వంటి సమస్యలు తాండవిస్తున్నాయి. క్రమబద్ధంగా ఆహారం తీసుకోకపోవటం, విశ్రాంతి లేకపోవటం వంటి వాటితో నిద్రలేమి, అలసట, మానసిక ఒత్తిడికి దారితీస్తున్నాయి. డిప్రెషన్, ఆందోళన, మద్యపానం, మాదక ద్రవ్యాల వినియోగం వల్ల ఎక్కువమంది మానసికంగా ఇబ్బంది పడుతున్నారు. మనిషి తన ఆలోచనలు, భావోద్వేగాలు నియంత్రించుకోగలిగి, సమస్యలను ధైర్యంగా ఎదుర్కొని, సరైన నిర్ణయాలు తీసుకోగలిగితే ఒత్తిడి ఉండదు. మానసిక సమస్యలు వచ్చిన ప్రాథమిక దశలోనే గుర్తిస్తే పలు రకాల చికిత్సల ద్వారా త్వరగా నయం చేసుకోవచ్చు. కొన్ని సూచనలు పాటిస్తే మెరుగైన ఫలితాలు వస్తాయి.

తగినంత విశ్రాంతి : రోజు మొత్తంలో కొంత సమయాన్ని ప్రశాంతంగా గడపటానికి కేటాయించాలి. పని ప్రదేశంలోనూ, ఉద్యోగంలోనూ, వృత్తి పరమైన అంశాల్లోనూ సామరస్య ధోరణితో వెళ్లాలి. గొప్పలకు పోకుండా సమభావంతోనూ, పరస్పర సహకారంతోనూ పనిచేస్తే మానసిక ఒత్తిడి దరిచేరదు. అభద్రతాభావంతో కాకుండా సహృద్భావంతో పనిచేస్తుండటం వల్ల కూడా ప్రశాంతంగా విధి నిర్వహణలను పూర్తిచేయొచ్చు. మానసిక ఉద్రేకాలను నిగ్రహించుకోలేకపోడం ద్వారానే రుగ్మతలు వస్తాయి. కష్ట సమయంలో కృంగిపోకుండా ఉండగలిగితే మెదడు సక్రమంగా పనిచేస్తుంది. కెమికల్స్, హార్మోన్ల ప్రయాణాలు సరిగా జరగాలన్నా, ఆరోగ్య సమస్యలు సమసిపోవాలన్నా మెదడుకు తగినంత విశ్రాంతి అవసరం. మెదడులో రసాయన మార్పులు కలగటం, బాధాకరమైన బాల్య అనుభవాలు, కుటుంబ వాతావరణం, లైంగికపరమైన కారణాలు, నిరుద్యోగం, అసమానతలు, ఆర్థికంగా నష్టపోయి, కుటుంబ కలహాలు, అనారోగ్య సమస్యలతో కొందరు మానసిక సమస్యలకు గురౌతున్నారు. ఇవన్నీ మానసిక వ్యాధులకు దారి తీస్తున్నాయి.

ఒత్తిళ్లకు దూరం : ఒత్తిడి అన్ని వయస్సులవారినీ వేధిస్తోంది. ఇంటా బయటా ఎదురయ్యే సవాళ్లు. చదువుల నుంచి ఆఫీసు వ్యవహారాల వరకు అన్నింటిలో ఇతరులతో పోలికలతో ఒత్తిడి ఎక్కువవుతోంది. ఆందోళన, కుంగుబాటు వంటి తీవ్ర సమస్యలూ పెరుగుతున్నాయి. వీటి నుంచి బయటపడటానికి ఎవరికివారే శ్రద్ధ తీసుకోవాలి.

మత్తు పదార్థాలు వద్దు : అపరిమితమైన స్వేచ్ఛ లభించడంతో పిల్లల నుంచి పెద్దల వరకూ పొగ, మద్యం అలవాట్లూ చుట్టు ముడుతున్నాయి. కొందరు మాదకద్రవ్యాల వ్యసనానికీ లోనవుతున్నారు. నడతలో మార్పులు, ఆకలి మందగించటం, విచ్చలవిడిగా డబ్బులు ఖర్చు పెట్టడం, చిన్న అప్పులు చేయటం, చేబదుళ్లు తీసుకోవటం, చదువు మీద శ్రద్ధ తగ్గటం, తరచూ బడి, కాలేజీ మానెయ్యటం, మతిమరుపు, పరాకు వంటి లక్షణాలను గమనిస్తే ఏదో అలవాటుకి బానిస అవుతున్నారని అనుమానించాలి.

ఆన్‌లైన్ గేమ్స్ : ఇప్పుడు డిజిటల్ పరికరాల వాడకం వ్యసనంగా మారిపోతోంది. అర్ధరాత్రి దాటినా సోషల్ మీడియాను, గేమ్స్‌ను వదల్లేని స్థితికి చేరుకుంటున్నారు. అందువల్ల తల్లిదండ్రులు, సంరక్షకులు వీరిని ఒక కంట కనిపెట్టటం మంచిది. అవసరమైన దాని కన్నా ఎక్కువ సమయం ఫోన్‌తోనే గడపటం, చూడొద్దంటే చిరాకు, కోప్పడడం లాంటి లక్షణాలను గమనిస్తే తాత్సారం చేయొద్దు.

ఆత్మహత్యలు : పరీక్షలో మార్కులు తక్కువ వచ్చాయనో, తల్లిదండ్రుల కోరికలకు అనుగుణంగా రాణించలేకపోతున్నామనో, తమతో ఏదీ సాధ్యం కావటం లేదనే నిరాశతోనో ఎంతోమంది యువత నిండు జీవితాలను ఛిద్రం చేసుకోవటం ఎక్కువైంది. చిన్న సమస్యలకే కుంగిపోయి బలవన్మరణాలకు పాల్పడటం తరచూ చూస్తున్నాం. వీటిని నివారించటం మనందరి బాధ్యత.

ఒత్తిడికి కొన్ని కారణాలు

- లావుగా ఉన్నామని
- పెళ్లికాకపోవటం
- పిల్లలు పుట్టకపోవటం
- ఉద్యోగం రాకపోవటం
- కోరుకున్న ర్యాంకు, మార్కులు రాలేదని

బయట ప్రపంచం తెలియనీయకుండా చేయటం

పిల్లలను కేవలం చదువుకే పరిమితం చేయటం

ఆటపాటల్లో అవకాశం కూడా లేకుండా చేయటం

తీవ్రమైతే ప్రమాదాలు


- ఉన్మాదులుగా మారిపోవటం
- ఎదుటివారిపై దాడి చేయడం
- పిచ్చిగా ప్రవర్తించటం
- దుర్మార్గపు పూరితంగా వ్యవహరించటం
- ఈజీమనీ కోసం వెంపర్లాట-క్రెడిట్‌కార్డులు (ఇఎంఐలు)
- సామాజిక మాధ్యమాలకు అలవాటు

ఇంటర్వ్యూ : యడవల్లి శ్రీనివాసరావు



నవంబర్ 6న వృషభ

మలయాళ సూపర్‌స్టార్ మోహన్‌లాల్ నటించి కొత్త సినిమా 'వృషభ' నవంబర్ ఆరోతేదీన విడుదల కానుంది. ఇప్పటికే ఈ ఏడాది ఎల్2 ఎంపురాన్, తుడరుమ్, కన్నప్ప, హృదయపూర్వం సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన లల్లెట్టన్ తాజాగా మరో సినిమాను ఈ ఏడాది ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నాడు. మోహన్‌లాల్ ప్రధాన పాత్రలో నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'వృషభ'. నంద కిషోర్ దర్శకత్వం వహిస్తున్నారు. కనెక్ట్ మీడియా, బాలాజీ టెలిఫిల్మ్స్, అభిషేక్ ఎస్. వ్యాస్ స్టూడియోస్, ఆశీర్వాద్ సినిమాస్ సమర్పిస్తున్నాయి. శోభా కపూర్, ఏక్తా ఆర్. కపూర్, సి.కె. పద్మకుమార్, వరుణ్ మాథుర్, సౌరభ్ మిశ్రా, అభిషేక్ ఎస్.వ్యాస్, ప్రవీర్‌సింగ్, విశాల్ గుర్నాని, జుహి పరేఖ్ మెహతా సంయుక్తంగా నిర్మిస్తున్నారు. మోహన్‌లాల్ యోధుడి పాత్రలో కొత్త పోస్టర్‌లో కనిపించారు.



18 భాషల్లో శోభిత 'చీకట్లో'

శోభిత దూళిపాళ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ వెబ్ మూవీ తెరకెక్కింది. సురేష్ ప్రొడక్షన్స్ ఈ సిరీస్‌ని నిర్మించింది. దీనికి యువ దర్శకుడు శరణ్ కొప్పిశెట్టి దర్శకత్వం వహించారు. 'చీకట్లో' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ వెబ్ మూవీని అమెజాన్ ప్రైమ్ వీడియోలో 18 భారతీయ భాషల్లో డబ్ చేసి విడుదల చేయబోతున్నారు. ఒక వెబ్ సిరీస్ ఇన్ని భాషల్లో డబ్ కావడం ఇదే మొదటిసారి. థ్రిల్లర్ జానర్‌లో రానున్న ఈ వెబ్ మూవీని నవంబర్‌లో విడుదల చేసేందుకు చిత్రబృందం సన్నాహాలు చేస్తోంది.

పాటల చిత్రీకరణలో 'పెద్ది'



రామ్‌చరణ్, జాన్వీకపూర్ జోడీగా నటిస్తున్న యాక్షన్ డ్రామా 'పెద్ది'. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ మహారాష్ట్రలోని పూణేలో జరుగుతోంది. బుచ్చి బాబు సానా దర్శకత్వంలో వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పిస్తున్నాయి. గురువారం నుంచి ప్రారంభమైన షెడ్యూల్‌లో రామ్‌చరణ్, జాన్వీ కపూర్‌పై పాటను చిత్రీకరిస్తున్నారు. దీని కోసం ఏఆర్ రెహమాన్ పాటను కంపోజ్ చేశారు. జానీ మాస్టర్ కొరియోగ్రఫీ చేస్తున్నారు. ఈ పాట విజువల్ ట్రీట్‌గా ఉండనుందని చిత్ర యూనిట్ తెలిపింది. చిత్రీకరణతోపాటు పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా ఏకకాలంలో కొనసాగుతున్నాయి. షెడ్యూల్ ప్రకారం సినిమా పూర్తయ్యేలా కృషిచేస్తున్నామని చిత్రయూనిట్ తెలిపింది. గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ సినిమాకు తగ్గట్టుగా రామ్‌చరణ్ తన రూపాన్ని మార్చుకున్నారు. కన్నడ సూపర్‌స్టార్ శివ రాజ్‌కుమార్ పవర్‌ఫుల్ పాత్రలో నటిస్తున్నారు, జగపతిబాబు, దివ్యేందు శర్మ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. రామ్‌చరణ్ పుట్టినరోజు సందర్భంగా వచ్చే ఏడాది మార్చి 27న ఈ సినిమా పాన్ ఇండియాస్థాయిలో విడుదల కానుంది. రచన, దర్శకత్వం: బుచ్చిబాబు సానా, నిర్మాత వెంకట సతీష్ కిలారు, డిఒపి ఆర్ రత్నవేలు, ప్రొడక్షన్ డిజైన్ అవినాష్ కొల్లా, ఎడిటర్ నవీన్ నూలి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ వి.వై.ప్రవీణ్‌కుమార్.

ఆకట్టుకునేలా 'డ్యూడ్' ట్రైలర్

లవ్ టుడే, డ్రాగన్ లాంటి డబ్బింగ్ సినిమాలతో తెలుగులోనూ హిట్స్ కొట్టిన తమిళ కథానాయకుడు ప్రదీప్ రంగనాథన్. ఇప్పుడు 'డ్యూడ్'తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని నిర్మించింది. 'ప్రేమలు' ఫేమ్ మమిత బైజు కథానాయిక. కీర్తిశ్వరన్ దర్శకుడు. దీపావళి కానుకగా ఈనెల 17న మూవీ థియేటర్లలోకి రానుంది. విడుదల చేసిన ట్రైలర్ ఆకట్టుకునేలా ఉంది. కామెడీతో పాటు ఎమోషన్స్ కూడా చూపించబోతున్నారనే విషయాన్ని ట్రైలర్‌తో చెప్పకనే చెప్పారు. ప్రదీప్-మమిత ప్రేమించుకుంటారు. కానీ పెళ్లి అనేసరికి మమిత నో చెప్పేస్తుంది. తర్వాత



ప్రదీప్..నేహాశెట్టితో ప్రేమలో పడతాడు. తర్వాత ఏమైందనేదే స్టోరీలా అనిపిస్తుంది. సాయి అభ్యంకర్ బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్ బాగుంది. 'డ్యూడ్'తో పాటు దీపావళికి తెలుగులో మిత్రమండలి, తెలుసు కదా, కె ర్యాంప్ మూవీస్ వస్తున్నాయి.

పూరీ చిత్రానికి 'అర్జున్ రెడ్డి' సంగీత దర్శకుడు



పూరీ జగన్నాథ్, విజయ్ సేతుపతి కాంబోలో రాబోతున్న చిత్రంలో స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ భాగం అయ్యారు. పూరిసేతుపతి బృందంలోకి జాతీయ అవార్డు గ్రహీత సంగీత దర్శకుడు హర్షవర్ధన్ రామేశ్వర్‌ను స్వాగతిస్తూ 'బ్లాక్‌బస్టర్ సంగీత దర్శకుడు.. అతని సంగీతం మాటల కంటే బిగ్గరగా మాట్లాడుతుంది' అనే క్యాప్షన్ ఇచ్చి చిత్రబృందం ఓ ఫొటో షేర్ చేసింది. ఈ చిత్రంలో సంయుక్త మీనన్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. విజయ్ కుమార్, వీటీవి గణేష్, టబు, రాధికా ఆప్టే కీలక పాత్రల్లో కనిపించబోతున్నారు. ఈ సినిమాను పూరి కనెక్ట్స్‌తో పాటు జెబి మోషన్ పిక్చర్స్ బ్యానర్స్‌పై పూరి జగన్నాథ్, చార్మీ కౌర్, నారాయణ రావు నిర్మిస్తున్నారు.

టీమిండియాకు నిరాశ

ధనా ధన్ ఇన్నింగ్స్‌తో చెలరేగిన డి.క్లార్క్, వోల్వడార్ట్

దక్షిణాఫ్రికా మహిళల చేతిలో మూడు వికెట్ల తేడాతో ఓటమి



విశాఖపట్నం : ఐసిసి మహిళల వన్డే ప్రపంచకప్‌లో టీమిండియా తొలి ఓటమిని చవిచూసింది. ఎసిఎ-విడిసిఎ స్టేడియంలో దక్షిణాఫ్రికాతో గురువారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో టీమిండియా మూడు వికెట్ల తేడాతో అనూహ్యంగా పరాజయం పాలైంది. టీమిండియా నిర్దేశించిన 252 పరుగుల లక్ష్యాన్ని దక్షిణాఫ్రికా జట్టు 48.5ఓవర్లలో 7వికెట్లు కోల్పోయి ఛేదించింది. కెప్టెన్ వోల్వడార్ట్(70)కి తోడు చివర్లో డి క్లార్క్(84 నాటౌట్; 54బంతుల్లో 8ఫోర్లు, 5సిక్సర్లు) ధనా ధన్ ఇన్నింగ్స్‌తో దక్షిణాఫ్రికాను గెలిపించింది. ఆ జట్టు ఒక దశలో 81పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయి కష్టాల్లో నిలిచింది. ఈ క్రమంలో వోల్వడార్ట్, ట్రయాన్(49) కలిసి ఇన్నింగ్స్‌ను కుదుట పరిచారు. దీంతో దక్షిణాఫ్రికా 45ఓవర్లు ముగిసేసరికి 6వికెట్ల నష్టానికి 200 పరుగులు చేసి లక్ష్యానికి ఆమడదూరంలో నిలిచింది. చివర్లో డి క్లార్క్.. క్రాంతి గాడ్ వేసిన ఇన్నింగ్స్ 47వ ఓవర్లో రెండు సిక్సర్లు, ఒక ఫోర్‌తో సహా 18పరుగులు కొట్టి దక్షిణాఫ్రికాను విజయ తీరాలకు చేర్చింది. ఆమెకే ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది.

టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన టీమిండియాను స్మృతి మంధాన(23) ప్రతీకా రావల్(37) రాణించడంతో వికెట్ నష్టానికి 83పరుగులతో పటిష్టంగా నిలిచింది. ఆ తర్వాత సఫారీ బౌలర్లు ఒక్కసారి చెలరేగారు. రోడ్రిగ్స్(0) చోలే ట్రయాన్ వేసిన 21వ ఓవర్లో నాలుగో బంతికి స్వీప్ షాట్ ఆడబోయి డకౌట్ అయింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్(9), దీప్తి శర్మ(4)లు కూడా స్వల్ప వ్యవధిలోనే పెవిలియన్ చేరారు. టాపార్డర్, మిడిలార్డర్ కుప్పకూలడంతో టీమిండియా ఒక దశలో 103 పరుగులకే ఆరు వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఆ దశలో సఫారీ బౌలర్లను హడలెత్తించిన వికెట్ కీపర్ రీచా ఘోష్ (94; 77బంతుల్లో 11ఫోర్లు, 3సిక్సర్లు) ఇన్నింగ్స్‌ను కుదుట పర్చింది. అమన్‌జోత్ కౌర్(13)తో కలిసి 7వ వికెట్‌కు 51పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పింది. అమన్ ఔటయ్యే సమయానికి భారతజట్టు 7 వికెట్ల నష్టానికి 153పరుగులు చేసింది. 8వ వికెట్‌కు రీచా-స్నేహ్ రాణా 88 పరుగులు జోడించారు. రీచా లోయర్ ఆర్డర్ బ్యాటర్లు స్నేహ్ రాణా 33పరుగులతో రాణించడంతో టీమిండియా స్కోర్ 251 పరుగుల గౌరవప్రద స్కోర్ చేసింది. సెంచరీకి చేరువలో రీచా ఘోష్ 94పరుగుల వద్ద భారీషాట్‌కు ప్రయతినంచి ఔటైంది. దీంతో టీమిండియా ఇన్నింగ్స్ 251 పరుగుల వద్ద ముగిసింది. దక్షిణా ఫ్రికా బౌలర్లు ట్రయాన్‌కు మూడు, మాబా, క్లార్క్, కాప్‌కు రెండేసి వికెట్లు దక్కాయి. ఈ గెలుపుతో దక్షిణాఫ్రికా 4వ స్థానానికి ఎగబాకింది. భారతజట్టు 4పాయింట్లతో మూడో స్థానంలో ఉండగా.. ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ టాప్-2లో కొనసాగుతున్నాయి.

ఐసిసి వన్డే ప్రపంచకప్‌లో నేడు..
న్యూజిలాండ్ మహిళలు × బంగ్లాదేశ్ మహిళలు
(వేదిక: గౌహతి, మ.3.00 గం॥లకు

క్లీన్‌స్వీప్ లక్ష్యంగా టీమిండియా

నేటినుంచి వెస్టిండీస్‌తో చివరి టెస్ట్
ఉదయం 9.30గం॥లకు



న్యూఢిల్లీ: తొలి టెస్ట్‌లో విండీస్‌ను చిత్తుగా ఓడించిన టీమిండియా.. ఇక క్లీన్‌స్వీప్‌పై దృష్టి సారించింది. రెండు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా అహ్మదాబాద్ వేదికగా జరిగిన తొలి టెస్ట్‌లో టీమిండియా ఇన్నింగ్స్ 140పరుగుల తేడాతో ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఆ మ్యాచ్‌లో కెఎల్ రాహుల్, ధృవ్ జురెల్, రవీంద్ర జడేజా సెంచరీలతో రాణించగా.. బౌలింగ్‌లో సిరాజ్, బుమ్రాకి తోడు స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ అద్భుత ప్రదర్శనతో అదరగొట్టారు. దీంతో తొలిటెస్ట్ కేవలం రెండున్నర రోజుల్లోనే ముగిసింది. రెండు టెస్ట్‌మ్యాచ్‌ల సిరీస్‌లో టీమిండియా 1-0 ఆధిక్యతలో ఉండగా.. రెండోటెస్ట్ జరిగే అరుణ్ జైట్లీ స్టేడియం స్పిన్నర్లకు స్వర్గధామం. తొలి రెండురోజులు బ్యాటర్లకు అనుకూలంగా ఉన్నా.. ఆ తర్వాత మూడురోజులు స్పిన్నర్లు చెలరేగడం ఖాయం.

ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్(డబ్ల్యుటిసి) పాయింట్లే లక్ష్యంగా టీమిండియా ఈ సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేస్తే మరిన్ని పాయింట్లు జమ కానున్నాయి. ఈ సిరీస్ తర్వాత టీమిండియా వైట్‌బాల్ సిరీస్ ఆడేందుకు ఆస్ట్రేలియా టూర్‌కు బయల్దేరి వెళ్లనుంది. దీంతో ఈ సిరీస్ గెలుపు టీమిండియాకు బూస్ట్‌లా ఉపయోగపడనుంది. వర్క్‌లోడ్ కారణంగా జస్‌ప్రీత్ బుమ్రాకు విశ్రాంతి తీసుకుంటాడా? లేదా? అనేది విషయమై స్పష్టత లేదు. వెస్టిండీస్‌తో రెండో టెస్ట్‌కూ తొలి టెస్ట్ ఆడిన జట్టునే కొనసాగిస్తామని భారత అసిస్టెంట్ కోచ్ రైన్ టెన్ దస్కతే స్పష్టంచేశాడు. బ్యాటింగ్‌తో పాటు స్పిన్‌కు పిచ్ అనుకూలించే అవకాశం ఉన్న ఈ మైదానంలో మేం కాంబినేషన్‌ను మార్చే అవకాశం లేదని చెబుతా... సుదీర్ఘ లక్ష్యాలు చాలా ఉన్నాయని, అందులోనూ స్వల్పకాలిక లక్ష్యాలు కూడా ఇమిడి ఉంటాయని ఆయన తెలిపారు. మంచి సీమ్ బౌలింగ్ ఆల్‌రౌండర్‌ను మెరుగుపర్చేందుకు చూస్తున్నాం. విదేశాలకు వెళ్లినప్పుడు చాలా ప్రయోజనం ఉంటుంది. గాయం నుంచి కోలుకొని వచ్చిన నితీశ్ కుమార్‌ను గత మ్యాచ్‌లో ఆడించాం. రెండో టెస్టులోనూ అతడికి అవకాశం ఇవ్వాలను కుంటున్నాం. ఇదొక మంచి ఛాన్స్ అవుతుంది. మంచి సీమ్ బౌలింగ్ ఆల్‌రౌండర్ అవుతాడని భావిస్తున్నాం. గత ఆసీస్ పర్యటనలో నితీశ్ అద్భుత ప్రదర్శన చేశాడు. బౌలర్ మాత్రమే కాకుండా మంచి బ్యాటర్ కూడానూ. అందుకే, రెండో టెస్టులోనూ మరోసారి అవకాశం ఇవ్వాలని నిర్ణయించాం జస్‌ప్రీత్ బుమ్రా విషయంలోనూ ఏ మార్పు లేదు. అతడూ రెండో టెస్టులో ఆడే అవకాశాలే ఎక్కువ" అని దస్కతే వెల్లడించాడు.

జట్లు(అంచనా)..

ఇండియా: శుభ్‌మన్(కెప్టెన్), జైస్వాల్, కెఎల్ రాహుల్, సాయి సుదర్శన్, ధృవ్ జురెల్, నితీశ్ రెడ్డి, జడేజా, సుందర్, బుమ్రా, కుల్దీప్, సిరాజ్.

వెస్టిండీస్: ఛేజ్(కెప్టెన్), క్యాంప్‌బెల్, చంద్రపాల్, అథంజే, కింగ్, హోప్, గ్రీవ్, పియరీ, వారికన్, బ్లేడ్స్, సీల్స్.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68